fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 43 | విజయవాడ, మంగళవారం 13 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



సిపిఎం పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు మహ్మద్ అమీన్ కన్నుమూత

8

అగ్రిగోల్డ్ బాధితులకు ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్రిగోల్డ్ సంస్థ వల్ల ఆత్మహత్యలకు పాల్పడిన వారితో పాటు ఆ సంస్థ వల్ల నష్టపోయిన వారిలో గుండె పోటుతో మరణించిన బాధితులకు రూ.5 లక్షలు చొప్పున నష్ట పరిహారాన్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ప్రభుత్వం రెండు విడతలుగా రూ.5 కోట్లు నష్టపరిహారాన్ని ప్రకటించింది. సోమవారం విడుదలైన ఉత్తర్వుల ప్రకారం అర్హులైన బాధితులకు త్వరలోనే అధికారులు నగదు పంపిణీ చేసే అవకాశముంది.



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్

ప్రజా పునాదిని విస్తరించండి

సిపిఎం శ్రేణులకు కరత్ పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

వామపక్ష ప్రజాతంత్ర సంఘటనే లక్ష్యంగా రాష్ట్రంలో సిపిఎం ప్రజాపునాదిని పెద్దఎత్తున విస్తరించాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ పిలుపునిచ్చారు. భీమవరంలోని పర్ససత్యనారాయణనగర్‌లో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో సోమవారం ఆయన ప్రతినిధులనుద్దేశించి ప్రసంగించారు. ప్రత్యామ్నాయ రాజకీయాలను, విధానాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి సిపిఎం ప్రజాపునాదిని విస్తరించడమొక్కటే మార్గమని ఆయన చెప్పారు. ఈ రకమైన కృషే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన బలపడటానికి దోహదపడుతుందని అన్నారు. 'అనేక రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో వామపక్ష ఉద్యమానికి ఘనమైన చరిత్ర ఉంది. ఆ ఘనమైన వారసత్వం ప్రజల్లో ఇప్పటికీ స్ఫూర్తిని నింపుతోంది. ఇప్పటికీ సిపిఎం బలంగా ఉంది. ఇతర వామపక్షాలు కూడా ప్రభావాన్ని చూపుతున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ కాషాయ భావాలకు ప్రజానీకంలో పెద్దగా ఆదరణ లేదు. అయితే తమ ప్రభావాన్ని పెంచుకోవడానికి ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అదే సమయంలో ప్రజాతంత్ర ఉద్యమాల పట్ల ప్రజలు సానుకూలంగా మిగతా 9లో

ప్రత్యేక హోదాపై

విశాల ఉద్యమం

అన్నిపక్షాలను కలుపుకుని ముందుకు

14న వామపక్షాలతో విజయవాడలో సమావేశం

సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి మధు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర విభజనతో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, విభజన సందర్భంగా చెప్పిన ఏ అంశమూ పరిష్కారం కాలేదని రాబోయే రోజుల్లో విభజన హామీలు, ప్రత్యేక హోదాపై విశాలమైన ఉద్యమాలుచేపట్టాలని భీమవరంలో జరిగిన సిపిఎం 25 రాష్ట్ర మహాసభల్లో నిర్ణయించినట్లు సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి.మధు తెలిపారు. మూడు రోజుల మహాసభలు ముగిసిన సందర్భంగా ఆయన సోమవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. నూతనకార్యవర్గాన్ని 60 మంది సభ్యులు, 15మంది కార్యదర్శివర్గ సభ్యులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సమస్యలపై చేసే పోరాటాల్లో అందరి సహకారంతో ముందుకుసాగుతామని, ఇప్పటికే చాలామందితో కలిసి పనిచేస్తున్నామని, ఇకముందుకూడా అందరినీ కలుపుకుని విశాల ఉద్యమం చేపడతామన్నారు. రాష్ట్రంలో రైతాంగ ఆత్మహత్యలు మిగతా 9లో

సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా

మధు ఎన్నిక

- 15 మందితో కార్యదర్శివర్గం
- 60 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక
- ఆహ్వానితులుగా 10 మంది
- జాతీయ మహాసభల ప్రతినిధులుగా 23 మంది
- రాష్ట్ర బాధ్యతల్లోకి శ్రీనివాసరావు
- ఐదుగురితో కంట్రోల్ కమిషన్

3



వైవి | నర్సింగరావు | పెనుమల్లి మధు | ఎంఎ గఫూర్ | వి శ్రీనివాసరావు | వి కృష్ణయ్య | రమాదేవి | ఎంవిఎస్ శర్మ | మిడియం బాబూరావు | సిహెచ్ బాబూరావు | దడాల సుబ్బారావు | వి ఉమామహేశ్వరరావు | మంతెన సీతారాం | ఎం కృష్ణమూర్తి | ప్రభాకర రెడ్డి

స్వాతంత్ర్య పోరాటం లాంటిదే!

- కేంద్ర వైఖరిపై చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రస్తుతం జరుపుతున్న పోరాటం స్వాతంత్రపోరాటం లాంటిదేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. నీరు-ప్రగతి, వ్యవసాయం రంగంపై తన నివాసం నుంచి సోమవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్వాతంత్రపోరాటం గత చరిత్ర... రాష్ట్ర హక్కులకోసం, ప్రయోజనాలకోసం పోరాడటం ప్రస్తుత చరిత్ర' అని అన్నారు. గత మూడన్నరేళ్లుగా తాము కేంద్ర ప్రభుత్వానికి అన్ని విధాల సహకరించామని, అయినా రాష్ట్రం పట్ల కేంద్ర సర్కారు ఇలా వ్యవహరించడం సబబుకాదని అన్నారు. జిఎస్టి, నోట్లరద్దు వంటి సందర్భాల్లో కేంద్రానికి అన్ని విధాలా తాము అండగా ఉన్నామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడితే ప్రజల్ని ఇబ్బంది పెట్టినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రానికి కేంద్రం మరింత సహకారాన్ని అందించాల్సి అవసరముందన్నారు. తాము రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతుంటే ప్రధాన ప్రతిపక్షం లేఖలు రాసి ప్రయోజనాలను అడ్డుకుంటోందని విమర్శించారు. రబీలో వ్యవసాయ పనులు పూర్తవుతున్నందున ఉపాధి పనుల్ని ముమ్మరంగా చేపట్టాలన్నారు. జల సంరక్షణ పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. రెండో దశ జలసంరక్షణ ఉద్యమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలోని 14 వేల చెరువులు, 2,500 సెలయేరులు, 10 వేల చెక్ డ్యాంలలో జలసంరక్షణ పనుల్ని చేపట్టాలన్నారు. రబీ పంట రుణాల లక్ష్యం 76 శాతమే పూర్తయ్యిందని, మిగిలిన రుణాల్ని వెంటనే అందజేయాలని ఆదేశించారు. మేలైన విధానాలు, శాస్త్ర సాంకేతికతను రైతులకు చేరువ చేయాలన్నారు. అతి త్వరలో లక్షన్నర ఇళ్లకు గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ప్రస్తుతం రోజుకు వంద ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నామని, ఈ సంఖ్యను 150కి పెంచాలన్నారు. గాలి నాణ్యతపై దృష్టి పెట్టాలన్నారు. పర్యాటకంలో ప్రస్తుతమున్న మూడో స్థానం నుంచి ప్రథమ స్థానానికి చేరుకోవాలన్నారు. పింఛన్లకు నగదు కొరత లేకుండా చూడాలన్నారు. వయోవృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను పంపిణీ చేస్తున్నామన్నారు. మార్చి 31లోపు కార్మికుల పిల్లల పేర్లను నేషనల్ పోర్టల్‌లో నమోదు చేస్తే ఒక్కొక్కరికీ రూ.1200 చొప్పున ఉపకార వేతనం అందుతుందని చెప్పారు. టెలికాన్ఫరెన్స్‌లో ప్రణాళిక మండలి ఉపాధ్యక్షులు కుటుంబరావు, జలవనరులు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

బినామీల వద్ద బంగారం

- భారీగా స్థిరాస్తులు
- విశాఖ అర్బన్ ప్లానర్ ప్రదీప్ కేసులో ఎసిబి గుర్తింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో అదనపు చీఫ్ అర్బన్ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తూ జనవరి 29న ఎసిబికి చిక్కిన పసుపర్తి ప్రదీప్‌కుమార్ బినామీ లాకర్లను అధికారులు గుర్తించారు. నిందితుని సోదరి భర్త పేరు మీద చెన్నైలోని టి నగర్ ఎస్‌బిఐ బ్రాంచ్‌లో ఉన్న లాకర్‌ను సోమవారం తెరవగా 905 గ్రాముల బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. వీటి విలువ సుమారు రూ.22 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వీటితో పాటు ప్రదీప్‌కు చెందిన పలు స్థిరాస్తి దస్తావేజుల్ని కూడా స్వాధీనం చేసుకున్నారు.

కేంద్రం మరో మాయ!


- హామీలపై అధికారుల అనుమానాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రానికి సాయం చేసే అంశంపై మెత్తబడినట్లు కనిపించిన కేంద్రం మరోమాయ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. ఇచ్చేదానిపై స్పష్టత లేకపోగా, అంతా ఇచ్చేస్తామని చెప్పడాన్ని అర్థం చేసుకోలేకపోతున్నామని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా లోటు నిధులు, రాజధాని, పోలవరం నిర్మాణాలపైనే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇవి చిన్న చిన్న అంశాలని, విశాఖకు రైల్వే జోన్ అతి కీలకమైనదని అధికారులు అంటున్నారు. చిన్న చిన్నవే అనుమానాలు కలిగిస్తుండగా, కీలకమైన జోన్ పరిస్థితి ఇంకెలా ఉంటుందోనన్న ఆందోళన వీరిలో వ్యక్తమవుతోంది. దీనిపై ఇప్పటికే ఆర్థికశాఖ అధికారులు అధ్యయనాన్ని ప్రారంభించారు.రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై వామపక్షాలు రాష్ట్ర బంద్ చేపట్టడం, దీనికి అన్ని ప్రతిపక్షాలూ సహకరించడం, పార్లమెంటులో ఎంపీల ఆందోళన నేపథ్యంలో పార్లమెంట్ చివరి రోజు రాత్రి మెత్తబడిన కేంద్రం మిగతా 9లో

భయం గుప్పెట్లో సరిహద్దు గ్రామాలు

1971 నాటికన్నా దిగజారిన పరిస్థితి



ఆర్‌ఎస్ పురా (జమ్మూ): కాశ్మీర్‌లో ఎప్పుడు మరో తుపాకులు గర్జిస్తాయో, బాంబులు ఎవరిని పొట్టన పెట్టుకుంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో భయం గుప్పిట్లో జమ్మూ కాశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంత గ్రామాలు 'సరిహద్దు ప్రాంతాల్లోని ప్రతి ఇల్లూ షెల్లింగ్‌కు గురవుతూనే వుంది. తలుపుమీద ఏదైనా చప్పుడు వినిపిస్తే అది బయట నుండి వచ్చిన తుపాకీ కాల్పుల శబ్దమా అని పిల్లలు అడుగుతున్నారు' అంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ విభజన జరిగిన నాటి నుండి ఇరుదేశాల మధ్య వున్న అంతర్జాతీయ సరిహద్దు వెంట వున్న గ్రామాల వాసులు సరిహద్దుల అవతలి నుండి వచ్చే కాల్పులతో అనునిత్యం ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతుకుతున్నారు. సరిహద్దు గ్రామాల్లో ఇప్పటి పరిస్థితి 1971 నాటి యుద్ధ పరిస్థితుల కన్నా దిగజారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ సరిహద్దు వెంట వున్న సుచేత్‌గఢ్ వంటి గ్రామాలతో మిగతా 9లో

పాక్‌తో చర్చలు అవసరం


మెహబూబాముఫ్తీ




భారత్ పాకిస్తాన్ మధ్య వివాదాల పరిష్కారానికి చర్చలు అవసరం తప్ప యుద్ధం వాంఛనీయం కాదని జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ అభిప్రాయపడ్డారు. ఇటీవలి కాలంలో వాస్తవాధీన రేఖ వెంట ఇరుదేశాల సరిహద్దుల్లో ఘర్షణలు పెరుగుతుండటం, జమ్మూలో సుంజువాన్ సైనిక శిబిరంపై ఉగ్రవాద దాడి నేపథ్యంలో మెహబూబా ముఫ్తీ భారత్-పాకిస్తాన్‌లకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.. 'ఈ వ్యాఖ్యలు చేసినందుకు నన్ను జాతి వ్యతిరేకిగా ముద్ర వేస్తారని నాకు తెలుసు. అయినా ఫర్వాలేదు. జమ్మూ కాశ్మీర్ ప్రజలు బాధపడుతున్నారు. యుద్ధం వాంఛనీయం కాదు కనుకే ఇరుదేశాలు చర్చలు జరపాల్సిన అవసరం వుంది' అని ఆమె స్పష్టం చేశారు.











బిజెపి అసత్య ప్రచారం

ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపిపై బిజెపి చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి కెఎస్ జవహర్ హితవు పలికారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించకుండా టిడిపిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి నిధులు కేటాయించామంటూ 26 పేజీల నోట్ విడుదల చేయటాన్ని ప్రజలు నమ్మరన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో రాష్ట్రానికి న్యాయం చేయాలని మంత్రి కోరారు. బిజెపితో మిత్రధర్మాన్ని పాటిస్తున్నామన్నారు. దాన్ని వారు కూడా పాటిస్తూ రాష్ట్ర ప్రజల మనోభావాల్ని గౌరవించాలన్నారు. మిత్రధర్మాన్ని కాదని వైసిపితో పొత్తు కోసం పాకులాడటం తగదన్నారు. జగన్మోహన రెడ్డిని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు.



నిరసన

ఉత్తరాంధ్ర జనఘోష కార్యక్రమాన్ని విశాఖ జిల్లా మాడుగులలో ప్రారంభిస్తున్న ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ

ఉత్తరాంధ్రపై ప్రభుత్వాల చిన్నచూపు

ఉత్తరాంధ్ర జనఘోషలో మాజీ మంత్రి కొణతాల

ప్రజాశక్తి-మాడుగుల (విశాఖ)

ఉత్తరాంధ్రపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ అన్నారు. ఉత్తరాంధ్ర సమస్యలపై చేపట్టిన ఉత్తరాంధ్ర జనఘోష కార్యక్రమానికి జిల్లాలోని వి.మాడుగుల మండల కేంద్రంలో సోమవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యంతోపాటు అన్ని రంగాల్లోనూ ఉత్తరాంధ్ర జిల్లాలు వెనుకబడి ఉన్నాయని తెలిపారు. గర్భిణులు, పసిపిల్లలు మరణించడం ఎక్కువగా ఈ ప్రాంతంలోనే జరుగుతున్నాయని, ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ సమస్యలతో మరణాలు సంభవిస్తున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన కృషి కానరావడం లేదన్నారు. రాష్ట్రంలోని ధనిక జిల్లాలైన కృష్ణా, గుంటూరులో రాష్ట్ర రాజధానిని ఏర్పాటు చేయడమే కాకుండా, అన్ని విధాలుగా అక్కడే అభివృద్ధి చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎపి అభివృద్ధి కోసం ఆందోళనలు చేస్తున్నా ఢిల్లీ స్థాయిలో ఆంధ్రులను అనాథలుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో మన హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పోరాడితేనే హక్కులు సాధించుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు. జెండాలు వేరైనా ఒకే అజెండాతో ప్రతిఒక్కరూ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



మరట్వాడాపై ఆవర్తనం

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ఆగ్నేయ అరేబియాలో కేరళ తీరానికి సమీపంలో అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు మహారాష్ట్రలోని మరట్వాడాపై ఆవర్తనం నెలకొందని తెలిపింది. వీటి ప్రభావంతో కోస్తాలో సోమవారం అక్కడక్కడా చిరు జల్లులు, ఆకాశం మేఘావృతమైనట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. మూడు రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని వివరించింది. సోమవారం వేడి కొనసాగడంతో పాటు మధ్యలో పాక్షిక మేఘావృతం కనిపించింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే.. **స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. మనదేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న గిరిజన తెగ ?
2. యూరప్‌లో నదిపై లేని ఏకైక రాజధాని నగరం ఏది?
3. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన మొదటి తెలుగు వ్యక్తి ఎవరు?
4. ప్రపంచంలో అతి పొడవైన తీర రేఖ కలిగిన దేశం ఏది?
5. బ్రహ్మపుత్ర నదిని అరుణాచల్ ప్రదేశ్‌లో ఏ పేరుతో పిలుస్తారు?

2 కోట్ల ఎకరాలకు సాగునీరు

అమరావతిలో 'జల సంరక్షణ'ను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-తుళ్లూరు (గుంటూరు జిల్లా)

నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో రెండు కోట్ల ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 12 నుండి నుంచి జూన్ 7వ తేదీ వరకూ 116 రోజులపాటు జల సంరక్షణ ఉద్యమం నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా సోమవారం రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలంలోని వెంకటపాలెం వద్ద జలసంరక్షణ కోసం నీరు-ప్రగతి కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిఎం మాట్లాడుతూ రాష్ట్రంలో 1.15 కోట్ల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తున్నామని, మరో 75 లక్షల ఎకరాలకు నీరివ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. రాయలసీమ అంతటా నీరందిస్తున్నామని, శ్రీశైలం నుంచి హంద్రీనీవా, గాలేరి నగరి, కెసి కెనాల్ ద్వారా నీరందిస్తామని పేర్కొన్న సిఎం వంశధార, నాగావళి ద్వారా శ్రీకాకుళానికీ సాగునీరిస్తున్నామని వివరించారు. 29 సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చి ఏడు పూర్తి చేశామని, మిగిలిన వాటినీ త్వరలోనే పూర్తిచేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. నీరు ఎక్కడుంటే అక్కడ నాగరికత, అభివృద్ధికి వీలుంటుందని, కృష్ణా నది వల్ల విజయవాడ, గోదావరితో రాజమహేంద్రవరం వివిధ రకాలుగా అభివృద్ధి చెందాయని చెప్పారు. నీటి వల్ల గొడవలు, యుద్ధాలు వస్తున్నాయని, కర్ణాటక, తమిళనాడు మధ్య పరిణామాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ క్రమంలో జలసంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రతి గ్రామంలోనూ భూగర్భజలాలు ఎంత ఉన్నాయో గుర్తించాలని, అందుకు అన్ని శాఖలూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా పాలవాగు పూడికతీత పనులను జెసిబిని సిఎం నడిపి ప్రారంభించారు. తొలుత జలవనరులశాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, ఎంపి గల్లా జయదేవ్, స్థానిక ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్, సిఆర్‌డిఎ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, కలెక్టర్ కోన శశిధర్, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి శశిభూషన్‌కుమార్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

నాణ్యతలో రాజీలేదు

పోలవరం పనులపై అధికారులకు చంద్రబాబు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం పనుల్లో ఎవరూ వేలెత్తి చూపకుండా ఉండేలా అధికారులు వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు వీలుగా ఒక రిజిస్టర్‌ను తయారు చేసుకోవాలని సూచించారు. వ్యయంలో కచ్చితత్వం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు, పురోగతిపై సచివాలయంలో ఆయన సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుకు సంబంధించి ఎప్పటికప్పుడు పురోగతి వివరాల్ని ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. కాంట్రాక్టర్లంతా లక్ష్యాల వివరాల్ని వారం రోజుల్లోగా అందించాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు 53 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. కుడి, ప్రధాన కాలువకు సంబంధించి 91శాతం, ఎడమ కాలువకు సంబంధించి 60శాతం పనులు పూర్తయ్యాయన్నారు. హెడ్ వర్క్సుకు సంబంధించి 39శాతం పనులు, డ్యాం, స్పిల్ వేకు సంబంధించి 71శాతం పూర్తయ్యాయన్నారు. 2019 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఇంకా ఇవ్వాల్సింది 2.24 వేల కోట్లు : మంత్రి దేవినేని

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు 12.91 వేల కోట్ల ఖర్చుతో పనుల్ని పూర్తి చేసినట్లు జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు వెల్లడించారు. సచివాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో కొచ్చాక రూ.7.79 వేల కోట్లు ఖర్చు చేయగా 2014కు ముందున్న ప్రభుత్వాలు 5.135 వేల కోట్లు ఖర్చు చేశాయన్నారు. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం 4.932 వేల కోట్లను విడుదల చేసిందని, మరో 2.247 వేల కోట్లను విడుదల చేయాల్సి ఉందన్నారు.

కార్యాచరణ ముమ్మరం చేసిన జెఎఫ్‌సి

జేపీతో ఉండవల్లి, రామకృష్ణ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విభజన హామీల సాధన కోసం ప్రత్యామ్నాయ వేదికగా జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జెఎఫ్‌సి) తెరమీదకొచ్చింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సూచనతో ఏర్పాటైన ఈ కమిటీ, నిధులు విడుదలలో నిజానిజాల్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు విభజన హక్కుల సాధనకు తనవంతు ప్రయత్నాలు చేయనుంది. రాజకీయాలకతీతంగా మేధావులు, మాజీ ఉద్యోగులు, ఆర్థిక నిపుణుల్ని కమిటీలోకి ఆహ్వానించాలని జనసేన ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం జయప్రకాశ్ నారా యణతో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌లు భేటీ అయ్యారు. బేగంపేటలోని లోక్‌సత్తా కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, నిజనిర్ధారణ కమిటీ విధివిధానాలపై చర్చించారు.

అందరిపైనా బాధ్యత ఉంది : జేపీ

విభజన హక్కుల్ని కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉందని డాక్టర్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. సమావేశం అనంతరం ఉండవల్లి, రామకృష్ణలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలకతీతంగా విభజన హక్కుల సాధనకు చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు.

ప్రజలకు మేలు జరగాలి : ఉండవల్లి

రాజకీయాలకతీతంగా ప్రజలకు మేలు జరగాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. నిధుల విడుదలకు సంబంధించి జయప్రకాష్ వద్ద మొత్తం సమాచారముందన్నారు. రాష్ట్రానికి సంబంధించి కేంద్రం దేనికి ఎంత కేటాయించింది, ఏ మేరకు హామీలు ఇచ్చిందనే అంశాలపై నిపుణుల అభిప్రాయం కూడా తీసుకోవాల్సి ఉందన్నారు.

సంపూర్ణ మద్దతు : రామకృష్ణ

రాష్ట్ర హక్కుల సాధన కోసం, ప్రయోజనాల కోసం పార్టీలకతీతంగా అందరితో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. పవన్ కూడా ఇదే ఆలోచనతో ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. హోదా, విభజన హామీల సాధన సమితిని ఏర్పాటు చేసి, గత నాలుగేళ్లుగా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేస్తూ వస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం జేపీ, ఉండవల్లి నుంచి పూర్తి సహకారాన్ని తీసుకోవాలనే ఆలోచనతోనే వారితో కలిశామన్నారు. ఈ నెల 18న విభజన హక్కుల సాధన కోసం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

జెఎఫ్‌సి లోగో ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు, ఇంకా రావాల్సిన నిధుల విషయంలో నిజాల్ని ప్రజలకు తెలియజేసేందుకు ఏర్పాటైన "జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ" లోగోను జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ లోగోను మీడియాకు విడుదల చేశారు. ఏపీకి రావాల్సిన నిధులు, కేటాయించిన నిధుల వివరాల్ని జెఎఫ్‌సికి ఇవ్వాలని టిడిపి, బిజెపి నేతల్ని పవన్ కోరిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఏపీ రాష్ట్ర విభజనను సూచిస్తూ ఈ లోగోను తయారు చేశారు.

JOINT FACT FINDING COMMITTEE

ఎయిర్‌పోర్టు టెండర్ల రద్దు విషయం నాకు తెలియదు : అశోక్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'భోగాపురం ఎయిర్‌పోర్టు టెండర్ల రద్దు విషయం నాకు తెలియదని, ఆ విషయం రాష్ట్ర ప్రభుత్వానికే వదిలేస్తున్నా'నని పౌర విమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు పేర్కొన్నారు. సోమవారం విజయనగరంలోని రూ.94 లక్షల వ్యయంతో నిర్మించిన అవినీతి నిరోధక శాఖ కార్యాలయం ప్రారంభోత్సవం, రూ.కోటీ 40 లక్షలతో నిర్మించనున్న టూ టౌన్ మోడల్ పోలీసు స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. అనంతరం బడ్జెట్‌పై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం దాటవేశారు. 'ఇప్పుడు అవినీతి నిరోధక శాఖ భవనం ప్రారంభానికి వచ్చాను. కాబట్టి ఇదే నా ఫోకస్. మీరు కూడా దీన్నే ఫోకస్ చేయండి. నన్ను డైవర్ట్ చేయడానికి ప్రయత్నించొద్దు. బడ్జెట్ ఇక్కడ అప్రస్తుతం' అంటూ సమాధానం చెప్పారు. 'ఇది మా ప్రశ్నకాదు సార్..! జనం రోడ్లపైకి వచ్చి అడుగుతున్న ప్రశ్న' అంటూ విలేకర్లు వివరించినా ఆయన వినిపించుకోలేదు. 'బడ్జెట్‌పై ప్రశ్నలు ముందస్తుగా రెడీ చేసుకుని వచ్చినట్టు ఉన్నారు మీరు. నాకు అర్థమైంది. ఇంకోసారి మాట్లాడుకుందాం అంటూ సమాధానం చెప్పారు.

'టెట్' కేంద్రాలుగా రాష్ట్రేతర ప్రాంతాలు

బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌లో కేంద్రాలు

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

సాధారణంగా అన్ని రకాల పోటీ పరీక్షలను స్థానికంగానే నిర్వహించడం కొనసాగుతోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత(టెట్) పరీక్షలు మాత్రం అందుకు భిన్నంగా సాగుతున్నాయి. అంతర జిల్లాల మధ్య కాకుండా ఏకంగా రాష్ట్రేతర ప్రాంతాలు పరీక్ష కేంద్రాలకు వేదిక కావడం అభ్యర్థుల్లో ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ క్రమంలోనే పరీక్షల నిర్వహణ విధానంలోనూ పలు మార్పులను చేసింది. గతంలో ఉన్న పేపర్లకు భిన్నంగా రెండు పేపర్లకు బదులు మూడు రకాల పేపర్లను ప్రవేశపెట్టింది. పేపర్-1ను ఎస్‌జిటి అభ్యర్థులకు, పేపర్-2ను ఎస్‌ఎ అభ్యర్థులకు, పేపర్-3ని పండిట్లకు కేటాయించారు. ఆదివారం నుండి హాల్‌టికెట్లను డౌన్లోడ్ చేసుకున్న కొందరు అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను చూసుకుని అవాక్కవుతున్నారు. స్థానికంగా కాకుండా ఇతర రాష్ట్రాలైన చెన్నై, బెంగుళూరు, హైదరాబాదు వంటి ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలను ప్రభుత్వం కేటాయించింది. సాధారణంగా నీట్, ఆర్‌ఆర్‌బి వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలను సైతం స్థానికంగానే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం పరిపాటిగా ఉంది. అలాంటిది కేవలం రాష్ట్ర స్థాయి టెట్ పరీక్షకు రాష్ట్రం ఆవల పరీక్ష కేంద్రాలను కేటాయించడాన్ని అభ్యర్థులు జీర్ణించుకోలేకపోతున్నారు.

అమరావతిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

కేంద్ర మంత్రి గంగ్వార్‌కు రాష్ట్ర మంత్రి పితాని విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అమరావతిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని రాష్ట్ర మంత్రి పితాని సత్యనారాయణ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్‌ను పితాని సోమవారం ఆయన కార్యాలయంలో కలిశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇఎస్‌ఐ ఆసుపత్రుల నిర్మాణానికి సత్వర చర్యలు చేపట్టాలని చేసిన విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ప్రధానంగా విశాఖ పట్నంలో మంజూరు చేసిన 500 పడకల ఇఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి, రాష్ట్ర రాజధాని అమరావతిలో 300 పడకల సూపర్ స్పెషాలిటి ఇఎస్‌ఐ ఆసుపత్రిని విజయవాడలోని ఇఎస్‌ఐ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించేందుకు అనుమతించాలని, విజయనగరంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన భూములను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అప్పగించినందున దాని నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, సత్వరం ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి కార్మికుల సంక్షేమానికి సహకరించాలని కేంద్ర మంత్రిని, ఆ శాఖ అధికారులను కోరినట్లు మంత్రి పితాని సత్యనారాయణ వివరించారు. రాజమండ్రిలోని 50 పడకల ఇఎస్‌ఐ ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా మార్పు చేసేందుకు అవసరమైన భవన నిర్మాణ పనులను చేపట్టాలని కోరామన్నారు. రాష్ట్రంలో 3 పడకలు, 6 పడకల స్థాయి గల 25 డిస్పెన్సరీలను మంజూరు చేసి అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించాలని కోరినట్లు చెప్పారు.

వర్మ, కత్తి మహేష్‌లు నోరు అదుపులో పెట్టుకోండి : ఎంపి శివప్రసాద్

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

టిడిపి ఎంపిలు జోకర్లంటూ రామ్‌గోపాల్‌వర్మ, కత్తి మహేష్‌లు చేసిన వ్యాఖ్యలపై చిత్తూరు ఎంపి శివప్రసాద్ స్పందించారు. వారిద్దరిపై తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తారు. టిడిపి ఎంపిలను ప్రశ్నించడానికి రామ్‌గోపాల్‌వర్మ ఎవరని దుయ్యబట్టారు. అంతో ఇంతో రామ్‌గోపాల్‌వర్మపై గౌరవం ఉండేదని, నిన్న ట్విట్టర్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలతో అదికూడా పోయిందని, ఆయనకు తిక్క అని, లతనికి దర్శకత్వ లక్షణాలే లేవన్నారు. ప్రత్యేక హోదా, బడ్జెట్‌ల కేటాయింపులపై మార్చి 5వ తేదీన పార్లమెంట్‌లో శ్రీకృష్ణుడి వేషంలో వెళ్లి సంధినా..సమరమా అంటూ మోడీని ప్రశ్నిస్తామన్నారు. కత్తిమహేష్‌కు దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో తనపై పోటీకి దిగాలని సవాల్ విసిరారు. ఒక దళితుడిపై మరో దళితుడు అభాండాలు వేయడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగినప్పుడల్లా పార్లమెంట్‌లో తాను వేసే వేషాధారణలు బాగుంటాయని, ఫోన్ ద్వారా ప్రజలే అభినందించారని తెలిపారు. తన వేషాధారణల పట్ల కామెంట్ చేయడం సిగ్గుమాలినపనేనని అన్నారు. పబ్లిసిటీ కోసం ఇష్టమొచ్చినట్లు కామెంట్లు చేయడం, ఒకరిని కించపరిచేలా మాట్లాడటం వంటివి ఘనకార్యాలుగా భావించే కత్తిమహేష్, రామ్‌గోపాల్‌వర్మలకు ప్రజలే బుద్ధిచెబుతారని వాపోయారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా

ఎన్నికల సంఘం రాష్ట్ర పరిశీలకులు కాంతిలాల్‌దండే

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓటరు జాబితా తప్పులు తడకలు లేకుండా పకడ్బందీగా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పరిశీలకులు కాంతిలాల్‌దండే అధికారులను ఆదేశించారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతిలాల్ దండే మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఓటర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ, ఇంజనీరింగ్ ఇతర కళాశాలల్లో 18 సంవత్సరాలు దాటిన విద్యార్థులందరినీ ఓటరు జాబితాలో నమోదు చేయించాలన్నారు. ఓటరు నమోదులో అధికారులు అలసత్వం వహించకుండా చూడాలన్నారు. నమోదుకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి త్వరగా అప్‌లోడ్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పలువురు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు మాట్లాడుతూ జిల్లాలో ఓటరు నమోదు సవరణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించడం లేదని తెలిపారు. ఓటరు నమోదుపై ప్రత్యేకంగా అవగహన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

ప్రత్యేకం

పొగాకు రైతుకు అండగా ఆన్‌లైన్

సాగు, అమ్మకాలన్నీ అంతర్జాలంలోనే..

దళారుల ఆట కట్టించేందుకు పొగాకు బోర్డు నిర్ణయం



ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

పొగాకు సాగు నుంచి అమ్మకం వరకూ అంతా ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని పొగాకు బోర్డు నిర్ణయించింది. దళారులను నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎంతమంది రైతులు ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు? దిగుబడి ఎంత? పంటను వేలం కేంద్రానికి తెచ్చారా? దళారులకు అమ్మారా? వేలం వేసిన తర్వాత ఆయా కంపెనీలు రైతులకు చెల్లించిన ధరలు మొదలైన వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో వర్జీనియా పొగాకు పండించే రైతులు పొగాకు వేలం పాటల్లో పాల్గొనేలా పొగాకు బోర్డు ఆన్‌లైన్ విధానం అమలులోకి తెచ్చింది. బోర్డు వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులే పొగాకు పండించాలి. వేలంలో వారే పాల్గొనాలి. రైతు పేరున రిజిస్ట్రేషన్ ఉండి ఎవరైనా దళారీ పంటను సాగు చేస్తే అనుమతి లేకుండా సాగు చేసినందుకు దళారీపైనా, అతనికి పొలం ఇచ్చిన రైతుపైనా చర్యలు తీసుకోవాలని పొగాకు బోర్డు నిర్ణయించింది. ఉభయగోదావరి జిల్లాల్లో వందలాదిమంది రైతులు తమ పంటను కొన్నేళ్లుగా దళారులకు తక్కువ ధరకే అమ్ముకుని నష్టపోతున్నారు. దళారులు పొగాకు వేలంలో అధిక ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విధానాన్ని అరికట్టేందుకు ఆన్‌లైన్ విధానం అమలులోకి తెచ్చారు. బోర్డు వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు ఏటా పొగాకు సాగు చేయాలి.

ఎవరైనా ఈ ఏడాది సాగుచేయలేకపోతే ఆ విషయాన్ని ముందుగా బోర్డుకు తెలియజేస్తే మరుసటి ఏడాదికి అనుమతి లభిస్తుంది. అలా తెలియజేయకుంటే మరుసటి ఏడాది కూడా సాగుకు అనుమతి ఇవ్వరు. రిజిస్ట్రేషన్ పొందిన రైతే పొగాకు సాగు చేస్తు న్నాడా? లేదా? అనేది బోర్డు అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. వారి పరిశీలన అనంతరం రైతులు వేలంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తారు.

రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామంలోని పొగాకు బోర్డు పరిధిలో 1,397 మంది రైతులు పొగాకు పండిస్తున్నారు. గతేడాది 4,491 ఎకరాల్లో పొగాకు సాగు చేసేందుకు పొగాకు బోర్డు రైతులకు అనుమతి ఇచ్చింది. 1,150 మంది రైతులు 3,705 ఎకరాల్లో పొగాకు పంటను సాగుచేశారు. ఆ ఏడాది 40 లక్షల కేజీల దిగుబడి లక్ష్యం కాగా ఎకరానికి 867 కేజీల చొప్పున 32,12,235 కేజీల పంట దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఉభయ గోదావరి జిల్లాల్లో 3,487 ఎకరాల్లోనే పంట సాగు చేశారు. తేలికపాటి నేలల్లో 275 ఎకరాల్లోను, నల్లరేగడి నేలల్లో 3,212 ఎకరాల్లోను వర్జీనియా పొగాకు సాగు చేశారు. ఈ ఏడాది 25 లక్షల కేజీల దిగుబడి వస్తుందని పొగాకు బోర్డు అంచనా వేసింది. గతంలో 48 గ్రామాల పరిధిలో పొగాకు పండిస్తే, ఈ ఏడాది 38 గ్రామాల పరిధిలోనే పండిస్తున్నారు.

దళారులు పంట అమ్ముకునే సమయంలో రైతుల పేరున బోర్డు వేలంలో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనివల్ల బోర్డు లక్ష్యం నెరవేరడం లేదు. ఈ క్రమంలో రైతులకు మేలు చేసేందుకే ఆన్‌లైన్ విధానం అమలు చేస్తున్నామని పొగాకు బోర్డు అధికారులు చెబుతున్నారు.

సంక్షిప్తం

ఇద్దరు అదనపు ఎస్పీలకు విధుల కేటాయింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇప్పటి వరకు వెయిటింగ్‌లో ఉన్న ఇద్దరు అదనపు ఎస్పీలకు విధులు కేటాయిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం అర్బన్ విభాగానికి క్రైమ్స్ అదనపు ఎస్పీగా వివిఎస్ఆర్ మూర్తికి, విజయవాడ సిటీ సిఎస్‌డబ్ల్యు వింగ్‌కు అదనపు డిసిపిగా ఎమ్ రాజశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఫిబ్రవరి 24 నుంచి టెన్త్ సమ్మెటివ్-2

పదో తరగతి విద్యార్థులకు సమ్మెటీవ్-2(ప్రి ఫైనల్) పరీక్షల షెడ్యూల్‌లో ఎస్‌సిఈఆర్‌టి స్వల్ప మార్పులు చేసింది. ఫిబ్రవరి 26 నుంచి పరీక్షలు మొదలవుతాయని గతనెల 19న ఎస్‌సిఈఆర్‌టి ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ పరీక్షల్ని రెండు రోజుల ముందుకు మార్చింది. ఫిబ్రవరి 24 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని ఎస్‌సిఈఆర్‌టి డైరెక్టర్ ఎం రాజ్యలక్ష్మి సోమవారం కొత్త షెడ్యూల్‌ను విడుదల చేశారు. అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు ఈ షెడ్యూల్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 10 వరకు పరీక్షలు జరుగుతాయని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. మార్చి 15 నుంచి పదోతరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. పబ్లిక్ పరీక్షలకు, ప్రీఫైనల్ పరీక్షలకు మధ్య కేవలం నాలుగు రోజుల మాత్రమే సమయం ఉంది.

ప్రశ్నించిన వారిపై ఎంపీ గంగరాజు అసహనం

విభజన హామీల అమలుపై స్పందించాలని కోరిన పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం టిడిపి మాజీ అధ్యక్షుడు వీరవల్లి చంద్రశేఖర్‌పై నరసాపురం ఎంపి, బిజెపి నాయకులు గోకరాజు గంగరాజు సోమవారం దురుసుగా వ్యవహరించారు. వీరవాసరం మండలంలోని నేలపోగుల, మడుగుపోలవరం, నవుదూరు, అండలూరు గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలను ప్రారంభించేందుకు భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులతో కలిసి ఆయన వచ్చారు. అండలూరు గ్రామంలో ఆయనను కలిసి చంద్రశేఖర్ విభజన హామీల అమలుపై ఆయనకు వివరించడం తో పాటుగా, వినతిపత్రాన్ని ఇస్తుండగా దాన్ని తీసుకునేందుకు నిరాకరించారు. అంతేకాకుండా ఆయన పట్ల దురుసుగా వ్యవహరించారు. విభజన హామీలపై 'మీకేం తెలుసు' అంటూ ముందుకు వెళ్లిపోయారు.


సింహాచలం


శ్రీనివాస్


శ్రీ టోం కుమార్


అప్పలనాయుడు


అప్పలనర్స


అప్పలరాజు


విజయప్రకాశ్


బాలకృష్ణ


బొడ్డు నాగేశ్వరరావు


ధనలక్ష్మి


క్రాంతి


మాదాల వెంకటేశ్వర్లు


రామరాజు


రమణ

అన్ని రంగాలకు విస్తరణ

రంగాలవారీ చర్చల్లో ప్రతినిధులు ● ముగిసిన సమావేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-పర్స సత్యనారాయణనగర్(భీమవరం)

నయా ఉదారవాద విధానాలు, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాటాలపే మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్లాలని సిపిఐ(ఎం) మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు చెప్పారు. పర్స సత్య నారాయణనగర్‌లో జరుగుతున్న సిపిఎం 25వ మహాసభల్లో కార్యదర్శి నివేదికపై చర్చల్లో చివరి రోజు వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు మాట్లాడారు. 30 ప్రజా రంగాల నుండి 38 మంది ప్రతినిధులు మాట్లాడారు. కార్మిక, మహిళ, విద్యార్థి, యువజన, విభిన్నప్రతిభావంతులు, కళా, రైతు, కౌలురైతు, వ్యవసాయకార్మిక, ఉపాధ్యాయ, వృత్తులు తదితర రంగాల నుండి ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటంలో వామపక్షాలు అందిస్తున్న సహకారంపై మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూములు లాక్కోవడం ఎక్కువైంది. నకిలీ విత్తనాలతో రైతులు నిలువునా మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన పోరాటాలూ ప్రజల్లో నమ్మకం కలిగించాయి. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారందరూ ఉద్యమాల్లోకి వస్తున్నారు. మహిళలపై దాడులు పెరిగాయి. సాంస్కృతిక రంగంలో మతోన్మాద శక్తులు చొరబడుతున్నాయి.. వీటన్నిటికీ వ్యతిరేకంగా ఆయా రంగాల్లో ఉన్న వారు ఉద్యమిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు మారాయి. పోరాటాలకు అవకాశాలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో నకిలీ విత్తనాలతో ప్రజలు నష్టపోయారని, వారికి అండగా సాగించిన పోరాటం ఫలించిందని కౌలు రైతు రంగానికి చెందిన ప్రతినిధులు నరసింహారావు, అజయ్‌కుమార్ తెలిపారు. కార్మిక రంగంలో ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగు సిబ్బంది పెద్దఎత్తున ఉద్యమాల్లోకి వస్తున్నారు. ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. హమాలీలతోపాటు పలు రంగాలకు చెందిన వ్యక్తులు కూడా ఉద్యమాల్లోకి వస్తున్నారు. వారికి అండగా నిర్వహిస్తున్న పోరాటాలకు సిపిఎం తనవంతు మద్దతు ఇస్తోంది. భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు నిర్వహించేందుకు ఊతమిస్తోందని ఆ రంగ ప్రతినిధులు కె.ఉమామహేశ్వరరావు, కమల తెలిపారు. ప్రభుత్వ విధానాలతో సామాన్యులకు విద్య అందని ద్రాక్షలా మారిందని విద్యార్థి రంగ ప్రతినిధి రమేష్ పేర్కొన్నారు. జీవనానికి ఆదరువుగా ఉన్న భూమిని ప్రభుత్వం ఏకపక్షంగా లాగేసుకుంటోందని, దీంతో వాటిని సాగుచేసుకుంటున్న పేదలు, వ్యవసాయకార్మికులను బలవంతంగా భూముల్లో నుండి నెట్టేస్తోందని, దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమాలు వస్తున్నాయని, వాటిని నడిపించడంలోనూ, మార్గనిర్దేశనం చేయడంలోనూ సిపిఎం తనవంతు సహాయ సహకారాలు అందిస్తోందని ఆ రంగం నుండి చర్చలో పాల్గొన్న ఎన్.నరసింహయ్య, శివనాగరాణి తెలిపారు. స్తబ్దుగా ఉన్న రైతాంగ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మరిన్ని అవకాశాలు ఏర్పడ్డాయని రైతు రంగ ప్రతినిధి తెలిపారు. మహిళలపై పెరుగుతున్న దాడులకు నిరసనగా పెద్దఎత్తున పోరాటాలు జరుగుతున్నాయని, వీటికి సిపిఎం ప్రోత్సాహాన్నిస్తోందని మహిళా రంగం ప్రతినిధి శ్రీదేవి తెలిపారు. దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా రాష్ట్రంలో నిర్వహించిన పోరాటాలు వారిలో నమ్మకాన్ని కలిగించాయని ఆ రంగం నుండి మాట్లాడిన నటరాజు తెలిపారు. వృత్తిదారులకు ఉపాధి లేకుండా పోయిందని, వారికి అండగా పోరాటాలు సాగుతున్నాయని, వాటిని నిర్వహించడంలో సిపిఎం తమకు స్ఫూర్తి నిస్తోందని వృత్తిదారుల రంగ ప్రతినిధి అప్పలరాజు, బాలకృష్ణ వివరించారు. నిరుద్యోగ భృతి పేరుతో ప్రభుత్వాలు మోసం చేశాయని, ఉపాధి, కల్పించడంలో ఘోరంగా విఫలమైందని యువజన రంగ ప్రతినిధి రమేష్ తెలిపారు. గిరిజనుల సమస్యలపై సాగించిన పోరాటాలు ఫలించాయని గిరిజన రంగం ప్రతినిధి అప్పలనర్స పేర్కొన్నారు. కళారంగంపై దాడి పెరుగుతోందని, దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నామని కళారంగ ప్రతినిధి క్రాంతికుమార్ వివరించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులిస్తామన్నా ఇవ్వలేదని వెనుకబడిన ప్రాంతాల ప్రతినిధులు నరసింహ, శ్రీనివాస్ తెలిపారు. ప్రత్యామ్నాయ మీడియాను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సోషల్ మీడియా ప్రతినిధి విజయ్‌ప్రకాష్ పేర్కొన్నారు. సిపిఎం స్ఫూర్తితో వైద్యాన్ని ప్రజలకు అతి చేరువ చేస్తున్నామని ప్రజావైద్యశాఖ ప్రతినిధి డాక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. మైనార్టీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడటంలో ముందున్నామని మైనార్టీ రంగ ప్రతినిధి రషీద్ వివరించారు. వివిధ రూపాల్లో ప్రజల్లోకి సాంస్కృతిక రంగాన్ని తీసుకెళుతున్నామని వొరప్రసాద్ చెప్పారు. రాజధానిలో ప్రజల హక్కులకు భంగం వాటిల్లిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాజధాని నిర్వాసితుల సంక్షేమ రంగం ప్రతినిధి రవి పేర్కొన్నారు. అనేక చోట్ల పౌర హక్కులకు అన్యాయం జరుగుతోందని, దీన్ని ఎదుర్కో వడంలో శక్తి చాలకపోయినా చర్చనీయాం శం చేస్తున్నామని పౌరహక్కుల రంగం ప్రతినిధి సురేష్ తెలిపారు.

ఐటి రంగంలో విస్తరించాల్సిన అవసరం ఉందని ఐటి రంగ ప్రతినిధి ప్రమోద్ పేర్కొన్నారు. విజ్ఞాన కేంద్రాలతో చైతన్యవంతమైన కార్య క్రమాలు నిర్వహిస్తున్నామని విజ్ఞాన కేంద్రాల ప్రతినిధి రామరాజు వివరించారు. ప్రజల చైతన్యాన్ని మూడనమ్మకాలతో దెబ్బతీస్తున్నారని సైన్స్ రంగ ప్రతినిధి రమేష్, శ్రీనివాస్ తెలిపారు. వీరితోపాటు పలు రంగాలకు చెందని ప్రతినిధులు కూడా చర్చలో పాల్గొన్నారు.


రవికుమార్


రమాదేవి


వొరప్రసాద్


శ్రీనివాస్


సురేష్


రవి


రమేష్



సిపిఎం 25వ మహాసభల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

క్షేత్రస్థాయి వరకూ పోరాటాలు

● సిపిఎం రాష్ట్ర మహాసభలో బివి రాఘవులు పిలుపు

ప్రజాశక్తి - పర్సా సత్యనారాయణ నగర్ (భీమవరం)

ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలే మార్గమని, వాటిని క్షేత్రస్థాయి వరకూ తీసుకువెళ్లాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మూడు రోజులుగా జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో సోమవారం ఆయన ప్రసంగిస్తూ.. ఇంతకాలం ఉద్యమంలో చేసినవీ, చేయాల్సినవీ మర్చిపోకుండా.. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రజా సమస్యలే ఊపిరిగా సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలని సూచించారు. సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయని, తమ కష్టాలు తీర్చేవారెవరూ లేరని, ఎవరొచ్చినా తమ బతుకులింతే అని ప్రజలు అనుకోకుండా మనం ఆ లోటును భర్తీ చేయాలని కోరారు. ఆ విధంగా బాధితుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాలని సూచించారు. వారి పక్షాన పోరాటాలు ప్రారంభించాలని, వాటిని చివరిదాకా పరిష్కారం అయ్యేవరకూ కొనసాగించాలని కోరారు. తుందుర్రు ఉద్యమం ఇంకా కొనసాగుతూనే ఉందని అన్నారు. కొన్ని పోరాటాలు విజయవంతమౌతాయని, మరికొన్ని ఫలవంతం కావని, అంతమాత్రాన అపజయంగా భావించాల్సిన పనిలేదని అన్నారు. వీర తెలంగాణా సాయుధ పోరాటం వల్ల ఉద్యమం చేసినవారికి మేలు జరగకపోయినా ఆ తరువాత తరాలు ఆ పోరాట ఫలితాలు అనుభవిస్తున్నారని వివరించారు. మన పూర్వీకులు చేసిన అనేక పోరాటాల వల్ల కలిగిన ఫలితం మనం అనుభవిస్తున్నామని గుర్తుచేశారు. ప్రస్తుత సరళీకరణ విధానాలు ప్రజలను.. సామాజిక తరగతులను ముక్కలుగా చేసిందని, వ్యక్తులను ఒంటరిపాటు చేసిందని, అస్థిత్వ భావాలు పెరిగాయని స్పష్టం చేశారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అధ్యయనం చేసి అందులో వెలుగు చూసిన సమస్యలపై ఉద్యమాలకు రూపకల్పన చేయాలన్నారు. రాష్ట్రంలో మతతత్వ ప్రమాదం లేదని అనుకోరాదని, సేవా కార్యక్రమాల పేరిట వారిని ఆకర్షించేందుకు ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందినవారు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని వివరించారు. బాగా చదవుకున్నవారే, ఆఖరికి శాస్త్రవేత్తలు కూడా మూఢ నమ్మకాలకు లోనవుతున్న పరిస్థితి ఉందని, అమాయకులైన గిరిజనులను తాము తేలిగ్గా బుట్టలో వేసుకోవచ్చని ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సేవ పేరిట జరిగే కార్యక్రమాల ద్వారా మత భావాలను వ్యాప్తి చేసి గిరిజనులను రాజకీయంగా మార్చుడానికేనన్నారు. ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని, గిరిజనుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేయాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్.. సామాజిక సమస్యలపై పనిచేస్తున్న కవులను, కళాకారులను, సాంస్కృతిక రంగంలోని వ్యక్తులను హత్యలను చేయిస్తున్నదని, మతోన్మాదాన్ని దెబ్బ తీయాలంటే సామాజిక సమస్యలపైనా పనిచేయాలని సూచించారు. విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు చేసి ప్రజల్లో వికాసం కలిగించడానికి బహుముఖ కార్యక్రమాలు నిర్వహించాలని, సాంస్కృతిక రంగంలో మతోన్మాద ప్రమాదం గురించి తెలియజేయాలని, మెజీషియన్లను, హేతువాదులను ప్రోత్సహించాలని సూచించారు. కుల, లింగ వివక్ష, అభివృద్ధిలో వ్యత్యాసాలపై పోరాటాలతోపాటు వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కూడగట్టాలని పిలుపు నిచ్చారు.

2013 భూసేకరణ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

బలవంతపు భూసేకరణను ఆపాలి

ప్రజాశక్తి- పర్స సత్యనారాయణనగర్ (భీమవరం)

2013 భూ సేకరణ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, బలవంతపు భూ సేకరణను ఆపాలని సిపిఎం రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభలో ఈ మేరకు తీర్మానం చేసింది. తీర్మానాన్ని వి వెంకటేశ్వర్లు ప్రతిపాదించగా, కె రామకృష్ణ బలపరిచారు. 2013 భూ సేకరణ చట్టానికి తూట్లు పొడుస్తూ 2017 నవంబర్ 29న తెలుగుదేశం ప్రభుత్వం అసెంబ్లీ, శాసనసభ బిల్లును ప్రవేశపెట్టి ఏకపక్షంగా ఆమోదింపచేసు కొని రాష్ట్రపతి ఆమోదానికి పంపింది. ప్రభుత్వం ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, అభివృద్ధి పేరుతో రైతాంగం, దళితులు ఇతర పేదల నుండి బలవంతంగా భూములు లాక్కోరాదని సిపిఎం రాష్ట్ర 25వ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. వంశదార, పోలవరం, రాజధాని, శకునాల, ఎన్.పి కుంట, పూలసుబ్బయ్య, పురుషోత్తమపట్నంతో పాటు అనేక చోట్ల రైతులకు, భూమి మీద ఆధారపడిన వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, దళితులు, ఇతర పేదలకు పరిహారం ఇవ్వకుండానే రాత్రికి రాత్రే ఇళ్లను కూల్చివేసి దుర్మార్గంగా అక్కడి నుండి తరిమేస్తున్నారు. భూ సేకరణ ప్రాంతాలలో నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం నష్ట పరిహారం, అన్ని వసతులు కల్పించిన తరువాతనే అక్కడి నుండి ఖాళీ చేయించాలి. పరిశ్రమల పేరుతో సేకరించిన భూముల్లో ఎటువంటి నిర్మాణాలు చేయకుండా వృధాగా ఉన్న భూములను తిరిగి రైతులకు అప్పగించాలి. రాజధాని నిర్మాణం పేరుతో సేకరించిన భూములను రియల్ ఎస్టేట్‌కు ఇవ్వరాదు. ల్యాండ్ బ్యాంక్ విధానానికి స్వస్తి చెప్పాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ గిరిజన, దళితుల భూములను సేకరించరాదు. వృత్తిదారులకు సబ్ ప్లాన్ ఏర్పాటుచేయాలి, వృత్తుల రక్షణకు చర్యలు తీసుకోవాలి. చేతివృత్తులవారికి ఉపాధి కల్పించడానికి, వారి అభివృద్ధికి వృత్తిదారుల సబ్‌ప్లాన్‌ను ఏర్పాటుచేసి బడ్జెట్లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని సి.పి.ఎం రాష్ట్ర మహాసభలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రంలో చేతివృత్తులపై ఆధారపడి బ్రతికే వారు సుమారు 50లక్షల మంది ఉన్నారు. వీరంతా వెనుకబడిన తరగతులకు చెందినవారు. సరళీకృత ఆర్థిక విధానాల వల్ల చేతివృత్తులు క్షీణిస్తున్నాయి. వీటిపై ఆధారపడి జీవిస్తున్నవారు ఉపాధి కోల్పోయి ప్రత్యామ్నాయం లేక వీధిన పడుతున్నారు. ఆకలి చావులకు గురవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కల్లుగీత కార్మికులు, గొర్రెల పెంపకందారులు, చేనేత,క్షౌర వృత్తిదారులు, రజక వృత్తిదారులు, మత్స్యకార వృత్తులపై కోట్లది మంది ఆధార పడుతున్నారు. వీరి సంక్షేమం గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

భూ సమస్యపై.....

కోనేరు రంగారావు భూ కమిటి సిపార్సుల మేరకు రాష్ట్రంలో భూమి లేని ప్రతి కుటుంబానికి 2 ఎకరాలు భూమి ఇవ్వాలని, భూ సీలింగ్, అసైన్డ్ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని సిపిఎం 25వ మహాసభలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం అందుకు సిద్ధం కాకపోతే పేదలంతా ఐక్యమై భూములు సాధించుకోవడానికి సన్నద్ధం కావాలని రాష్ట్ర మహాసభ పిలుపునిచ్చింది. పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలి. పట్టాలుండి భూమి చూపని వారికి భూములు చూపాలి. భూసీలింగ్, అసైన్డ్, 1/70, 2013 చట్టాలను సక్రమంగా అమలు చేయాలి. అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి గిరిజన కుటుంబానికి 10 ఎకరాల భూమి ఇవ్వాలి. అసైన్డ్‌మెంట్ కమిటీలను పునరుద్ధరించాలి. ఇందులో వ్యవసాయ కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ఉండాలి. గ్రామసభ, అసైన్‌మెంట్ కమిటీల ద్వారానే భూపంపిణీ చేయాలి. దళితులు, గిరిజనుల భూములను అభివృద్ధి పేరుతో తీసుకోరాదు. పేదల భూ సమస్యల పరిష్కారం కోసం హైకోర్టులో ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలి. భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేయడాన్కి ప్రత్యేక రెవెన్యూ యంత్రాంగాన్ని నియమించాలి. 1973 భూసీలింగ్ చట్టంప్రకారం నీటివనరులు వచ్చినచోట భూ పునర్వర్గీకరణచేసి మిగులు భూమిని పేదలకు పంచాలి.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

● సిపిఎం మహాసభ డిమాండ్

ప్రజాశక్తి-పర్స సత్యనారాయణనగర్ (భీమవరం)

ఉద్యోగులకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రదు చేయాలని సిపిఎం రాష్ట్ర మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. మహాసభల మూడో రోజైన సోమవారం ఈ తీర్మానాన్ని ఆమోదించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సిపిఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌తో పోరాటాలు ఉధృతంగా జరుగుతున్నాయి. సిపిఎస్‌పై ఉద్యోగ సంఘాలు ప్రత్యేకంగా ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి పోరాటాలు చేస్తున్నాయి. సిపిఎస్ ఉద్యోగ సంఘాలు, ఫ్యాప్టో, ఏపిజెఏసి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కలిసి 'పెన్షన్ సాధన సమితి'గా ఏర్పడి పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఇటీవల పరిణామాల వల్ల రాజకీయ విధానాలను అర్థం చేసుకోవడం, పెన్షన్ సాధనా సమితి కార్మికవర్గంతో కూడా కలిసి నడవాల్సిన అవసరాన్ని సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు గుర్తించి విస్తృతంగా ఉద్యమాలు చేసేందుకు సిద్ధపడాలి. ఈ వేదిక మరింత విస్తృతం కావాలి. రైల్వే, ఇన్సూరెన్స్, ఎలక్ట్రిసిటీ, టిటిడి, యూనివర్శిటీ ఉద్యోగ సంఘాలు ఇతర సంస్థల్లోని ఉద్యోగ సంఘాలతో కలిసి విశాలవేదికగా ఏర్పడాలి. సి పి ఎ స్ రద్దుచేసి పాత పెన్షన్‌ను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి అసెంబ్లీలో తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. సిపిఎస్ నుండి వైదొలిగేందుకు కేంద్రం మీద ఒత్తిడి తేవాలి. కార్పొరేట్ శక్తులకనుకూలంగా రాజకీయ నిర్ణయం చేయడం ద్వారా వచ్చిన సిపిఎస్ పథకం తిరిగి రాజకీయ నిర్ణయాలతోనే రద్దుకావాలి. ప్రపంచబ్యాంకు ఆదేశాలు, సంస్కరణల అమలులో తలమునకలైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చేలా పోరాటాలు నిర్మించాలి. రాష్ట్రంలోనేకాదు దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్మించాలి. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఈ మహాసభ డిమాండ్ చేసింది.

మరిన్ని తీర్మానాలకు ఆమోదం

దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ఎస్‌సి., ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు, రాజ్యాంగం కల్పించిన హక్కులను పటిష్ఠంగా అమలు చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. ప్రజల పొదుపును హరించే ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకోవాలని, స్వయం సహాయక గ్రూపులు ఎవరికి వారే నిర్వహించుకునేటట్లు ఏర్పాట్లు చేయాలని, మైనార్టీలపై, భావ ప్రకటనా స్వేచ్ఛపై మతోన్మాద శక్తుల దాడులను ఖండించాలని, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని మహాసభ తీర్మానించింది. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఉన్నత విద్య నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, వైద్య, ఆరోగ్య రంగాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని, యువతకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని, పునరావాసం సందర్భంగా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు పూనుకోవాలని, ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, కుటుంబానికి 200 రోజుల పని, రూ.500 వేతనమివ్వాలని, యంత్రాలను నిషేధించాలని,

మద్యం అమ్మకాలను నియంత్రించాలని, మద్యం వల్ల మహిళలపై పెరిగిన దాడులను అరికట్టాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను కార్పొరేట్లకు ఇవ్వకుండా ప్రభుత్వమే నడపాలని, ప్రయివేట్ రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని, అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని అమలు పరిచి పట్టాలివ్వాలని సిపిఎం రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది.

60 మందితో సిపిఎం రాష్ట్ర కమిటీ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా మధు, 15 మందితో కార్యదర్శివర్గం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-పర్స సత్యనారాయణనగర్(భీమవరం)

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మళ్లీ ఎన్నికయ్యారు. 15 మందితో కార్యదర్శివర్గం ఎన్నికైంది. 60 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎం.ఎ.గఫూర్, వి.శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వర రావు, వి.కృష్ణయ్య, సిహెచ్.నరసింగరావు, మిడియం బాబూరావు, ఎం.వి.ఎస్.శర్మ, దడాల సుబ్బారావు, ఎం.కష్ణమూర్తి, సిహెచ్.బాబూరావు వి ఉమామహేశ్వరరావు, డి రమాదేవి, మంతెన సీతారాం, కె.ప్రభాకరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాష్ట్ర కమిటీ సభ్యులు

బితులసీదాస్, వై సిద్దయ్య, వి వెంకటేశ్వర్లు, పి జమలయ్య, మిరియం వెంకటేశ్వర్లు, జె జయరాం, ఎవి నాగేశ్వరరావు, కె స్వరూపరాణి, కె ధనలక్ష్మి, వి సుబ్రమణ్యం, అంద్ర మాల్యాద్రి, పి మురళీ కృష్ణ, జి ఓబులు, కె సుబ్బరావమ్మ, యం సూర్యారావు, యం రామకృష్ణ, బాబు, కె గడ్డెన్న, యం బాలకాశి, పి పెద్దిరెడ్డి, బి ప్రభావతి, వై అచ్యుతరావు బి కృష్ణమూర్తి(శ్రీకాకుళం) రెడ్డి శ్రీరామ్మూర్తి(పార్వతీపురం), బి.గంగారావు(విశాఖ అర్బన్) కె లోకనాథం(విశాఖ రూరల్), కిల్లో సురేంద్ర(విశాఖ రూరల్) టి అరుణ్(రాజమండ్రి) బి బలరాం (పశ్చిమగోదావరి డెల్టా) జెఎన్‌వి గోపాలన్ (పశ్చిమగోదావరి డెల్టా) చింతకాయల బాబూరావు (పశ్చిమగోదావరి అప్‌ల్యాండ్), డివి కృష్ణ(కృష్ణా పశ్చిమ), కె శ్రీదేవి (కృష్ణా పశ్చిమ), ఆర్ రఘు(కృష్ణా తూర్పు), పి.రామారావు (గుంటూరు తూర్పు), గద్దె చలమయ్య (గుంటూరు పశ్చిమ), పూనాటి ఆంజనేయులు(ప్రకాశం తూర్పు) సయ్యద్ హానీఫ్ (ప్రకాశం పశ్చిమ) సిహెచ్ రాజగోపాల్ (నెల్లూరు) ఎన్ యాదగిరి(నెల్లూరు) వి రాంభూపాల్ (అనంతపురం ఉత్తరం) కె ఆంజనేయులు(కడప) పి.నిర్మల (కర్నూలు), టి రమేష్ కుమార్(నంధ్యాల), కోఆప్షన్(తిరుపతి).

ఆహ్వానితులు

జె ప్రభాకర్, కెఎస్ లక్ష్మణరావు, జాల అంజయ్య, కె ఉమామహేశ్వరరావు, బి నారాయణ, కుంజా సీతారామయ్య, టి సూర్యనారాయణ, గౌస్ దేశాయ్, డి కాశీనాథ్, యం ఇంతియాజ్

ప్రత్యేక ఆహ్వానితులు

ఆర్.సత్యనారాయణరాజు, చౌదరి తేజేశ్వర రావు, జక్కా వెంకయ్య, టి.నరసింహయ్య, పాటూరు రామయ్య

కంట్రోల్ కమిషన్

ఛైర్మన్‌గా బి.ఆర్.తులసీరావు ఎన్నికయ్యారు. సభ్యులుగా టి.షడ్రక్, చల్లా వెంకటయ్య, సావిత్రి, జి.రాజేశ్వరరావు.

అఖిల భారత మహాసభలకు ప్రతినిధులు

23 మందితో అఖిల భారత మహాసభల ప్రతినధులను ఎన్నుకున్నారు. వీరిలో వై వెంకటేశ్వరరావు, వి కృష్ణయ్య, సిహెచ్ నర్సింగరావు, మిడియం బాబూరావు, ఎంవిఎస్ శర్మ, దడాల సుబ్బారావు, యం కృష్ణమూర్తి, సిహెచ్ బాబూరావు, వి ఉమామహేశ్వరరావు, డి రమాదేవి, కె ప్రభాకర్ రెడ్డి, డివి కృష్ణ, సిహెచ్ రాజగోపాల్, బి బలరాం, కె లోకనాథం, చింతకాయల బాబూరావు, పూనాటి ఆంజనేయులు, వి రాంభూపాల్, టి అరుణ్, పాశం రామారావు, కె స్వరూపరాణి, వి వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం ఎన్నికయ్యారు. పరిశీలకులుగా బి ప్రభావతి, రెడ్డి.

కౌలు రైతులందరికీ రుణార్హతా కార్డులు, వడ్డీలేని పంట రుణాలు

ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సిపిఎం మహాసభల తీర్మానం

ప్రజాశక్తి-పర్స సత్యనారాయణనగర్ (భీమవరం)

కౌలు రైతులందరికీ రుణార్హతా కార్డులు, వడ్డీలేని పంట రుణాలివ్వాలని, పెట్టుబడిరాయితీ, ప్రకృతి వైపరీత్యాలకు భీమా పరిహారం ఇవ్వాలని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సిపిఎం 25 వ రాష్ట్ర మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. మహాసభల మూడో రోజైన సోమవారం ఈ తీర్మానాన్ని రైతు సంఘం నాయకులు పెద్దిరెడ్డి ప్రవేశపెట్టగా, కౌలు రైతు సంఘం నాయకులు కె శ్రీనివాస్ బలపరిచారు. పూర్తి సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. తెలుగుదేశం పార్టీ ఎన్నికలముందు కౌలు రైతులందరికీ న్యాయం చేస్తామని వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని వాగ్దానం చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత కౌలు రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. ప్రభుత్వ హామీ మేరకు కౌలు రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలి. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు, కౌలు రైతులకే ఇవ్వాలి. అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టం తీసుకురావాలి. పెరుగుతున్న కౌలు రేట్లను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని మహాసభ డిమాండ్ చేసింది.

విత్తన చట్టం తేవాలి

నేటి ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. రాష్ట్రంలో 80లక్షల మంది చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. వీరికి ప్రభుత్వ ప్రోత్సాహం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. నాణ్యమైన విత్తనాలు లభించడం లేదు. రుణ సౌకర్యం లేక ప్రైవేటు అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

రాష్ట్రంలో నకిలీ విత్తనాల వల్ల ఏటా లక్షలాది ఎకరాలలో రైతాంగం పంటలు నష్టపోతున్నారు. విత్తనచట్టం లేనందున వారి ఇష్టారాజ్యంగావుంది. బహుళజాతి విత్తనకంపెనీల ప్రయోజనాల కోసమే విత్తనచట్టాన్ని పక్కన పెట్టారు. తక్షణమే విత్తన చట్టం చేయాలని మహాసభ డిమాండ్ చేస్తుంది. చెరుకుకు మద్దతు ధర ఇచ్చి సహకార రంగాన్ని కాపాడాలని కోరింది. గత మూడేళ్లుగా మన రాష్ట్రంలో కరువు నెలకొన్నది. ఇప్పటికైనా కరువు వల్ల నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే అదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.

ప్రాధాన్యతక్రమంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి

రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి తగిన నిధులు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలని, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయటానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని పార్టీ రాష్ట్ర మహాసభ డిమాండ్ చేస్తున్నది. రాయలసీమకు నీరందించాల్సిన తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రినీవా, ప్రకాశం జిల్లాకు నీరందించే వెలుగొండ, ఉత్తరాంధ్రకు నీరందించాల్సిన సుజల స్రవంతి ప్రాజెక్టులు నిధులు లేక దశాబ్దల తరబడి పెండింగ్‌లోనే వున్నాయి. వీటితోపాటు 28 సాగునీటి పథకాలు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. వీటిని పూర్తిచేయడంలో గత కాంగ్రెస్, నేటి తెలుగుదేశం ప్రభుత్వాలు విఫలమయ్యాయి.

సంపాదకీయం

ఉద్యమ బాట

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 10 నుంచి మూడు రోజులపాటు జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 25వ మహాసభలు రానున్న ప్రజాపోరాటాలకు దిశానిర్దేశం చేస్తూ సోమవారం నాడు జయప్రదంగా ముగిశాయి. పార్టీ నిర్మాణ చట్రంలో ప్రాథమిక స్థాయి శాఖ మొదలుకొని అఖిల భారత స్థాయి వరకు ప్రతి మూడేళ్లకోసారి క్రమం తప్పకుండా మహాసభలు నిర్వహించుకొని రాజకీయ విధానాన్ని, పార్టీ నిర్మాణాన్ని సమీక్షించుకుని రాబోయే మూడేళ్ల కాలానికి కార్యాచరణ రూపొందించుకుంటుంది సిపిఎం. దేశంలో మరే రాజకీయపార్టీకీ ఈ ప్రజాతంత్ర సంప్రదాయం లేదు. తూతూ మంత్రంగా భేటీలు వేసి పైనుంచి వచ్చిన పేర్లతో నాయకత్వ ఎన్నికను ముగించడం, అధికారాన్ని, పదవులను చేజిక్కించుకునేందుకు ఎత్తులు, పైఎత్తులు వేయడమే బూర్జువా పార్టీలకు పరమావధి. ప్రజాతంత్రయుత చర్చలు, కేంద్రీకృత ప్రజాస్వామ్యం, సమిష్టి పని విధానం సిపిఎం బలం. అధికార కాంక్ష, పదవులపై మక్కువ లేకుండా ప్రజల కోసం అంకితమై పని చేయడం సిపిఎం శ్రేణుల విశిష్టత. భీమవరం మహాసభల్లో ఆసాంతం ఈ విశిష్టత కనిపిస్తుంది. కార్యదర్శి నివేదిక, మహాసభల్లో చర్చలు, ఆమోదించిన తీర్మానాలు, భవిష్యత్తు కర్తవ్యాలు ఇలా అన్నింటిలో ప్రజాకోణమే ప్రస్ఫుటిస్తుంది. విమర్శ, ఆత్మవిమర్శ పార్టీకి జీవం. మహాసభలకు హాజరైన ప్రతినిధుల్లో వర్గ పొందిక సిపిఎం లక్ష్యాలకనుగుణంగా ఉంది. కార్మిక, వ్యవసాయ కార్మిక, పేదరైతు, చేతివృత్తులు, మధ్యతరగతికి చెందిన వారి ప్రాతినిధ్యం 99 శాతం. సామాజికంగా చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్, ముస్లింల ప్రాతినిధ్యం 70 శాతానికిపైనే. రాష్ట్ర పార్టీ కొత్త నాయకత్వం ఎన్నికలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లింది.

ప్రస్తుతం ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతోంది. అమెరికా ఆధిపత్యంలో సామ్రాజ్యవాదం మార్కెట్‌ను విస్తరించేందుకు, మరింత దోపిడీ చేసేందుకు ఉరకలేస్తోంది. మన దేశం అమెరికాకు అంటకాగుతూ దాని ఆదేశాలతో ఇక్కడ నయా-ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేయడంతో ప్రజల బతుకులు చిన్నాభిన్నమవుతున్నాయి. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ దన్నుతో ఆందోళనకర రీతిలో మతోన్మాద శక్తులు దాడులకు తెగబడుతున్నాయి. రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్ చుక్కాని లేని నావలా దారి తెన్నూ లేకుండా ఉంది. ఎన్నికల్లో బిజెపి, టిడిపి పొత్తు పెట్టుకొని విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చాయి. అనంతరం కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం పంచుకున్న ఆ రెండు పార్టీలూ విభజన హామీలపై మూడున్నరేళ్లుగా దోబూచులాడుతూ రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం తలపెట్టాయి. రాజకీయ, స్వంత ప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పట్టించుకున్న దాఖలా లేదు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప ఉక్కు, జాతీయ స్థాయి విద్యాసంస్థలు, దుగరాజపట్నం, లోటు భర్తీ, పోలవరం, రాజధాని.. ఇలా ఏ ఒక్క హామీనీ బిజెపి నెరవేర్చలేదు. వాటికోసం కేంద్రాన్ని రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం నిలదీయ లేదు. పైగా ఏపి సర్కారు కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు భీతిల్లుతున్నారు. ఈ కాలంలో అవినీతి తారాస్థాయికి చేరుకుంది. ఎన్నడూ లేని విధంగా ఏపీలో సంఘ్ పరివార్ శక్తులు విజృంభిస్తున్నాయి. రైతాంగం, కార్మికులు, మహిళలు, ఉపాధి లేక యువత ఇలా అన్ని వర్గాలు, తరగతుల ప్రజానీకం టిడిపి విధానాలతో నలిగిపోతున్నారు.

మూడేళ్లలో సిపిఎం రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించింది. తుందుర్రు ఆక్వా ఫుడ్ మొదలుకొని రాజధాని వరకు, పోలవరం నుంచి వంశధార దాకా, ప్రభుత్వ బలవంతపు భూసేకరణ, భూసమీకరణకు వ్యతిరేకంగా, నిర్వాసితుల హక్కుల సాధన కోసం పోలీస్ నిర్బంధాన్ని ఎదిరించి మరీ ఉద్యమించింది. గరగపర్రు నుంచి మహాభారతం వరకు ఎన్నో సామాజిక పోరాటాలు నిర్వహించింది. సదరు పోరాటాలపై మహాసభల్లో సమీక్షించుకొని ఉద్యమంపై అంచనాకట్టి లోపాలను అధిగమించి భవిష్యత్తు కార్యాచరణను సిపిఎం రూపొందించుకోవడం బాధిత ప్రజలకు ఎంతో భరోసా. ప్రభుత్వ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను మహాసభ ప్రతిపాదించింది. ఆ లక్ష్య సాధనకు రాష్ట్రంలోని వామపక్ష, ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులను సమీకరించాలన్న బృహత్తర కర్తవ్యాన్ని భుజానికెత్తుకొని నయా-ఉదారవాద విధానాలతో దగాపడి తమకు దిక్కెవరా అని ఎదురు చూస్తున్న జనబాహుళ్యంలో ఆత్మస్థయిర్యం నింపింది. బిజెపి, టిడిపి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు విశాల ప్రాతిపదికన ప్రతిఘటనోద్యమాలకు పిలుపునిచ్చింది. సామాజిక అణచివేత, మతోన్మాదం, సర్కారీ నిరంకుశానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సై అంది. మహాసభల్లో ఇలాంటి 34 తీర్మానాలు చేసి రానున్న కాలమంతా ఉద్యమాలేనని భవిష్యత్తు కార్యాచరణకు కదం తొక్కడం వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక, సామాజిక ఉద్యమకారులను ఉత్సాహపరిచింది. స్ఫూర్తినిచ్చింది. సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్ర ప్రజానీకానికి సిపిఎం ఆవిష్కరించిన ఎజెండా కారుచీకటిలో కాంతి రేఖ వంటిది. సిపిఎం చూపిన బాటలో తమ ఈతి బాధల నుంచి విముక్తి కోసం ముందుకు సాగడమే ప్రజల ముందున్న ఏకైక మార్గం.

ఇదీ విషయం



రాజకీయ డ్రామాలిక
వీధుల కెక్కేశాయి...
నంది నాటకాన్ని మించి
నటన చించేశాయి!

మిత్రుల మంటూనే
జేబుల్లో కత్తులు...
తప్పు మాది కాదంటూ
జనం చెవిలో పువ్వులు!

- కొల్లూరు వెంకట్

ప్రపంచ పౌరుల ఉమ్మడి ఆస్తి సైన్స్

కామన్ సెన్స్

ప్రతి దానికీ మేం కారణమడుగుతున్నాం. ప్రశ్నిస్తున్నాం. ప్రశ్నతోనే ఎదుగుతున్నాం. మీరేమో ప్రశ్నలు వేయకుండా ఊరికే 'నమ్ముతూ ఫో' అని అంటారాయె! కారణమంటే ఏంటి? హేతువు! మరి ఆ హేతువును అన్వేషిస్తున్న వాళ్లం మేమే కదా! హేతువులోంచి రూపుదిద్దుకునేదే సైన్స్.

'నేనొక హేతువాదిని. ఎనభై శాతం ప్రజల మనసు నొప్పించకుండా, మనమొక సహజమైన మామూలు నిజాన్ని చెప్పలేని దయనీయ సమాజంలో బతుకుతున్నందుకు నాకు కోపంగా, బాధగా కూడా ఉంది'. అని రిచర్డ్ డాకిన్స్, క్రిస్టోఫర్ హిచెన్స్‌ల అభిమాని, 'ద ఎండ్ ఆఫ్ సెయిత్' అనే ప్రసిద్ధ గ్రంథ రచయిత, అమెరికన్ న్యూరో సైంటిస్ట్ సామ్ హారిస్ అన్నాడు. ఆయన ఒక చోట రాసుకున్న నాలుగు పంక్తులు చూడండి. 'నేను మరణించి నప్పుడు/ నా పరమాణువులన్నీ నిష్ప్రయోజనాలవుతాయి/నేను మళ్లీ అంతరిక్ష ధూళిగా మారిపోతాను/గాలి నన్ను ఎగరేసుకు పోతుంది/విశ్వమంతా వెదజల్లుతుంది'.



డాక్టర్ దేవరాజు మహారాజు

'నేనెప్పుడు ప్రపంచ దేశాలన్నింటినీ విశ్వాంతరాళంలోని కొత్త చంద్రుళ్లనీ దర్శిస్తాను../అప్పుడెంతో మహాద్భుత కవిత్వంగా వుంటుంది/నేనొచ్చి, నీ సాండ్విచ్ మీద వాలేంత వరకు..'

అని తొలి తరం మహిళా హేతువాది, అమెరికా హేతువాద వ్యవస్థాపక అధ్యక్షురాలు మడలైన్ ముర్రే ఓహేర్ అంటారు. 'హేతువాది అంటే భగవంతుడికి బదులు తనని తానూ.. తన తోటి వారినీ ప్రేమించే వాడు. స్వర్గమనేది ఎక్కడో లేదని, దాన్ని ఈ ధరాతలం మీదనే జనమంతా కలిసి నిర్మించుకోవాల్సి ఉందని, అందులోనే అందరూ కలసి మెలిసి ఆనందంగా జీవించాల్సి ఉందని తెలిసిన వాడు'


అందుకే నేనంటున్నదేమంటే మనకు మనిషిని మనిషిగా నిలబెట్టే కళలు కావాలి. పథకాలు కావాలి. ప్రణాళికలు కావాలి. విశాల దృక్పథంతో హేతుబద్ధమైన మానవవాదం కావాలి!

తెల్లవారితే దినపత్రికల్లో ప్రధాన శీర్షికల్లో ఎన్నెన్నో ఘోరమైన వార్తలు చదువుతున్నాం. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, వ్యాపారులు, మేధావులు, కళాకారులు, ఏ రంగంలోని వారైనా సరే. వారి వారి రంగాల్లో ఏ పని చేసినా, మాట్లాడినా, రాసినా ఎంతో బాధ్యతతో వ్యవహరించాలి. తమ విలువ, తమ స్థానం భద్రంగా ఉండాలంటే ముందు 'మనిషి'గా తన స్థానం సుస్థిరం చేసుకోవాలి. మనిషి మనిషి కానప్పుడు ఇక ఏదీ కాలేడు. ఎవరైనా జంతు ప్రవృత్తితో గొప్పవాళ్లుగా నిలబడాలనుకుంటే, అది వారి భ్రమ! ఏ నాగరిక సమాజమూ ఒప్పుకోదు. మనిషి తను మనిషన్నది మరచిపోవాలి. ఒక జంతువుగానే పరిగణించాలి. కఠినంగా శిక్షించాలి. మనిషి బలహీనతల మీద చేసే వ్యాపారాలు, రాజకీయాలు ఆగాలి. విశాల దృక్పథంతో హేతుబద్ధమైన మానవతా వాదాన్ని ఆహ్వానించాలి. నైతికంగా, మానసికంగా మనిషిని బలహీనపరిచే బోధనలు, ప్రవచనాలు, దైవ వాక్కులు ఆగాలి. సర్వకాల సర్వావస్థల్లో మనిషి, తను మనిషినన్న స్పృహతో, బాధ్యతతో వ్యవహరించగలిగితే, ఆరోగ్యవంతమైన మంచి సమాజాన్ని రూపొందించుకోగలం.

చెడు పనులు చేసినవారు ఎవరైనా భయంతో బతకాల్సిందే. ఆ భయంలోంచి బయట పడటానికి వారు దేవుణ్ణి, పాపాల్ని, పుణ్యాల్ని పునర్జన్మల్ని ఇంకా ఎన్నింటినో నమ్ముతూ ఉంటారు. ఆ నమ్మకాన్ని మత బోధకులు వారి స్వార్థం కోసం రెచ్చగొట్టి జనాన్ని మరింత బలహీనులుగా తయారుచేస్తుంటారు. ఈ విషయాలు గ్రహించి, జనం తమని తాము తెలుసుకొని, చైతన్యవంతులై ప్రవర్తిస్తే బావుంటుంది-నువ్వు ఎంత మాత్రమూ పాపాత్ముడి కావు. అలా అని నీకెవరైనా హితబోధ చేస్తే, ఆత్మ విశ్వాసంతో తిప్పికొట్టి అతణ్ణి, అతడి ప్రవర్తనను, ఆలోచనా విధానాన్ని సరిచేసుకోమని హెచ్చరించు. అంతే కాని, ఎవరి మాయ మాటలో నమ్మి మనిషి స్థానం నుండి కిందికి దిగజారకుండా.. నీకు దొరికిన ఈ అందమైన బాధ్యతగల నాగరిక జీవితంలో హాయిగా జీవించు. ఇతరులను కూడా అలా జీవించనివ్వు. మనమంతా ఎదిగిన మనుషులం అని నిరంతరం గుర్తు చేసుకుంటుండాలి.

'మీ నాస్తికత్వాన్ని బయటికి తెచ్చి అనవసరంగా చర్చించకండి' -అని ఎవరైనా అంటే... మానవవాదులు, హేతువాదులు సవినయంగా వారికి జవాబు చెప్పాలి-'అయ్యా! వేల వేల యేళ్లుగా మీ ఆస్తికత్వాన్ని మీ వ్యక్తిగత విషయంగా మీ ఇంటికి పరిమితం చేసుకోలేదు కదా! ఏం సాధించారూ? మీరు చెప్పే విషయాల్లో దేనికీ నిరూపణ లేదు. ఏదీ వాస్తవం కాదు. భ్రమల మీద అపోహల మీద, కల్పిత కథల మీద, బతికే రోజులు పోయాయి. అందువల్ల దయచేసి మా అభిప్రాయాలు కూడా విని ఆలోచించండి. మీకూ మాకూ కారణ మనేది ఒక కామన్ పాయింటుంది. మీరు మహానుభావుల్ని 'కారణజన్ములు' అని ముద్ర వేస్తారు కదా! అంటే-మీరు కారణాన్ని గుర్తించారు కానీ, అదేమిటో అన్వేషించడం లేదు. మాకు భ్రమలు, అంధ విశ్వాసాలు లేవు కనుక, వైజ్ఞానిక దృక్పథమనే దివిటీలు పట్టుకుని, చీకట్లు చీల్చుకుంటూ ఇంతదాకా వచ్చాం. ఇప్పుడైతే మా చేతుల్లో దివిటీల స్థానంలో అత్యాధునిక విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. మరి మీ చేతిలో దీపమే లేదు. మీరు చీకట్లో బతుకుతూ జనాన్ని మహాంధకారంలోకి తోసేసే పనిని దయ చేసి మీరే ఆపాల్సి వుంది. మీకు ఆలోచన రాకపోతే రాకపోనీయండి. ఆలోచించే వారిని ఆలోచించనీయండి. 'కారణం' గోడకు అటువైపు మీరుంటే ఇటువైపు మేమున్నాం. అంతే తేడా! ఇప్పుడు ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో జనావళికి చీకట్లు అవసరమా? వెలుగులు అవసరమా? జనానికే ఆలోచించుకునే అవకాశమివ్వండి!

'మీరు చీకట్లో బతుకుతూ జనాన్ని మహాంధకారంలోకి తోసేసే పనిని దయ చేసి మీరే ఆపాల్సి వుంది. మీకు ఆలోచన రాకపోతే రాకపోనీయండి. ఆలోచించే వారిని ఆలోచించనీయండి. 'కారణం' గోడకు అటువైపు మీరుంటే ఇటువైపు మేమున్నాం. అంతే తేడా! ఇప్పుడు ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో జనావళికి చీకట్లు అవసరమా? వెలుగులు అవసరమా? జనానికే ఆలోచించుకునే అవకాశమివ్వండి!'



అనాదిగా మతపెద్దలు, భక్తులు చెబుతున్నట్టు దేవుడనే వాడుంటే-అతను సర్వాంతర్యామి, సర్వం తెలిసిన వాడూ అయితే మనం ఇప్పుడు అతని కథల్ని ప్రశ్నించాల్సి ఉంది. విశ్లేషించాల్సి ఉంది. నిజం నిగ్గు తేల్చాల్సి వుంది. ఎందుకంటే మీరు ఏ దేవుడి కథనైనా తీసుకుని పరిశీలించండి. అతను సృష్టికర్త కనుక, లోకంలో తెలిసి తెలిసి తప్పుడు మనుషుల్ని పుట్టిస్తాడు. మళ్లీ వారిని నిందిస్తూ దండిస్తూ ధర్మాన్ని పరిరక్షించడానికే తను పుడుతున్నానంటాడు. తప్పుడు మనుషుల్ని పుట్టించిన ఆయన తన 'తప్పు'ను ఒప్పుకోవాలి కదా! ఏ మతంలోనైనా, ఏ కథలోనైనా అలా జరిగిందా? లేదే? విజ్ఞతతో ఏ దేవుడైనా తన భక్తుల ముందు తన తప్పు ఒప్పుకున్నాడా? లేదు కదా? తప్పుడు మనుషుల్ని సృష్టించిన తప్పు ఆయనదే కదా! కొంచెం ఆలోచించండి. సినిమాల్లో తన హీరోయిజం చూయించుకోవడానికి హీరో చేసే తక్కువ స్థాయి గిమ్మిక్కులా లేదూ! హీరోయిన్ పైకి అల్లరి చేయడానికి కిరాయి మనుషుల్ని పంపి... మళ్లీ సమయానికి వెళ్లి, వాళ్లను తన్ని, పెద్ద హీరోలా ఆమెను కాపడినట్టు సీను రక్తికట్టించడం. అసలు దేవుడనే భావనకే సరైన ఆధారం లేకపోయినప్పుడు కర్మఫలం, పునర్జన్మ ఫలితం, పాప నివృత్తి లాంటి మాటలకు అర్థం వుందా? దీనికి పరిష్కారమొక్కటే-కామన్ సైన్స్‌ను ఉపయోగించడం, సైన్సు తెలుసుకోవడం.. దీంతో ఎన్నో సమస్యలు పరిష్కారమౌతాయి. ఎందుకంటే సైన్సు ప్రపంచ పౌరుల ఉమ్మడి ఆస్తి. అది ఒక దేశానిదో ఒక మతానిదో, ఒక జాతిదో కాదు. ప్రాంతీయ దురభిమానాలకు, భాషా విద్వేషాలకు అతీతమైంది. ధనిక-పేదా, అగ్ర-నిమ్న తేడాలు లేనిది. అందువల్ల సైన్సును, సైన్సు విలువను ప్రజలందరూ తెలుసుకోవడం అవసరం!!

(రచయిత సాహితీవేత్త, సైన్స్ ప్రొఫెసర్
సెల్ : 9573706806)

సోషల్ మీడియా

తెలుగు తల్లీ!



మోసపోయిన తెలుగు తల్లి
కపట కాలం, కల్పవల్లీ
రాజకీయపు రాక్షసత్వం
పగటి వేషపు బూటకత్వం

తెచ్చినామని స్పెషల్ స్టేటస్
వెన్నులోనే పొడిచె బ్రూటస్
కొత్త మోసం కొరకు ప్యాకేజ్
నమ్మినందుకు మిగిలె డామేజ్

వెంకయార్యుల మాట నమ్మి
చంద్ర వ్యూహపు బాట తమ్మి
జైట్లీ జెల్ల కడకు మిగిలెను
ఎపి జనులకు కడుపు రగిలెను

తెలుగు దేశం దేబిరించెను
కేంద్రమేమో చీదరించెను
వైకాపా మరి మోహరించెను
పాడు కాలం దాపురించెను

నోరు తెరవని సోనియాజి
రాహుల్ క్యా హోగయాజీ?
పవన్ జెపి కొత్త జంట
గొడవలొద్దని సూక్తి గంట

ఒక్కరొకరిది స్వార్థ రీతి
లెక్కలేసిన రాజనీతి
వామపక్షం సమరగీతి
పిడికిలెత్తును తెలుగు జాతి

- పీపీ

రైతు-పండితుడు



ఓ రైతు పొలం దున్నుతున్నాడు!
'చాలు' వంకరటింకరగా ఉంది! (వంకరగా దున్నినా పంట పండుతుంది, కొంత పంట తగ్గుతుంది. అది రైతులకే తెలుసు).
అయితే దోవనబోయే ఓ పండితుడు,
ఆ రైతును దూషించాడు, ఎగతాళి చేశాడు!
మరుసటి రోజు రైతు, పొలం వద్ద!
కూర్చొని ఉన్నాడు! నాగలికి ఎద్లు కట్టలేదు!
మన పండితుడు
మరలా అటుగా వస్తూ,
దున్నడంలేదేమని ప్రశ్నించాడు!
'మీరు పండితుండులు గదా? ఓసారి మీరు ఎద్లు నాగలికి కట్టి చక్కగా వంకలు లేకుండా, దున్ని చూపించమన్నాడు!'
అదెలా వీలౌతుంది?
అన్నాడు పండితుడు! (అసలు కాడికి ఎద్లు పూన్చడమే చేతకాదు! ఎడ్లకు నాలుగు గజాల దూరంలో ఉంటాడు, చచ్చేంత భయం).
ఎందుకు వీలు కాదూ?
'మీరు దున్ని చూపాల్సిందే'
అన్నాడు రైతు!
లాభం లేదనుకొని; పంచె
ఎగగట్టి పారిపోయాడు,
మన పండితుడు!
విమర్శలు చేయడానికీ
ఉద్యమాలూ! అందులోనూ
వర్గ ఉద్యమాలు!
వర్గ శత్రువుల
దాడులూ!
గందరగోళం!
రక్తపాతం మధ్య
మొత్తం ప్రపంచంలోని పెట్టుబడిదారులూ
రాజులూ చక్రవర్తులందరి
కుట్రలూ కూహకాల మధ్య
సోవియట్ సోషలిస్టు రాజ్యాన్ని 30 ఏళ్ళకు పైగా
నిలబెట్టి
హిట్లరు దాడులను
తిప్పికొట్టడమేగాక
వాడికి బెర్లిన్‌లో సమాధి
కట్టి, ప్రపంచాన్ని 'నాజీ
ఇజం, ఫాసిజం' బారి నుంచి
కాపాడిన
మహానాయకుడు స్టాలిన్ పై!
కొన్ని కోడిపెట్టల
విమర్శలు చూసి ఆవేదనతో!

- వెంకట కృష్ణయ్య మొలకలపల్లి.

జన వాక్యం

ఇదేనా అభివృద్ధి!



ఒక పక్క సామాన్యులకు, పేదవారికి తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలు వుండాలని కేంద్రం పిలుపునిచ్చింది. మరో పక్క అసలు బ్యాంకుల్లోకి వెళ్ళడానికి భయపడే పరిస్థితులను కల్పిస్తోంది. బ్యాంకులకు రావాలంటేనే సామాన్యులు భయపడుతున్నారు. బ్యాంకు ఖాతాలో తాము దాచుకున్న కొద్దోగొప్పో సొమ్మును వారికి తెలియకుండా ఖాళీ చేస్తున్నారు. ఇదేకాక, ఖాతాలో పడే గ్యాస్ సబ్సిడీ డబ్బులను కూడా దోపిడీ చేస్తున్నారు. అంటే ప్రభుత్వాలు చేశామంటున్న అభివృద్ధి ముందుకు సాగకపోగా, తిరోగమనంలో ప్రయాణిస్తుందన్నమాట.

- రావు కొల్లాబత్తుల, ఇ మెయిల్ ద్వారా

మానసిక ఒత్తిడి

ఇటీవల కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయి. సమయపాలన లేకుండా తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురౌతున్నారు. నిర్ణీత సమయంలో తరగతులు పూర్తయినా, అదనపు క్లాసుల పేరుతో ఉదయం 8 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు, అంటే దాదాపు 10 నుండి 11 గంటలు పాఠశాలల్లోనే గడపాల్సి వస్తోంది. ఇది చాలదన్నట్లు మరో మూడు, నాలుగు గంటలకు సరిపడా హోంవర్క్ ఇస్తున్నారు. ఇప్పటికైనా ఈ ధోరణి మానేయాలి. నిర్ణీత సమయానికే విద్యార్థులందరూ స్కూలు నుండి బయటకు వచ్చే ఏర్పాట్లు చేయాలి. అప్పుడే తీరిక సమయంలో కుటుంబ సభ్యులతో గడుపుతూ తమ ఒత్తిడిని తగ్గించుకుంటారు.




జె సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

జమిలి ఎన్నికలు రాజకీయ నియంతృత్వానికే!

చర్చ


నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారత ప్రజల భిన్నత్వ, బహుళత్వ సంస్కృతిపై దాడి ప్రారంభమైంది. ఒకే మతం ఉండాలని, ఒకే రకమైన తిండి తినాలని, ఒకే రకమైన పన్ను వుండాలని, ఒకే రకమైన సంస్కృతిని అనుసరించాలని మొదలైన ఒత్తిళ్లు భారత ప్రజలపై జరుగుతున్నాయి. ఇప్పుడు 'ఒకే దేశం-ఒకే సారి ఎన్నికల' పేరుతో లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించాలనే చర్చకు తెర తీశారు. నరేంద్ర మోడీ గత రెండేళ్లుగా జమిలి ఎన్నికల అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేసిన ప్రసంగంలో జమిలి ఎన్నికలపై రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయానికి రావాలని పిలుపునిచ్చారు. న్యాయశాఖా మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఇటీవల న్యాయవ్యవస్థ కూడా జమిలి ఎన్నికలకు అనుకూలంగా స్పందించాలని కోరారు. ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు గుంటూరులో జరిగిన ఒక సమావేశంలో జమిలి ఎన్నికలపై విద్యావంతులు చర్చించాలని చెప్పారు.



కె ఎస్ లక్ష్మణరావు

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

జమిలి ఎన్నికలు భారత రాజ్యాంగ, సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. భారత రాజ్యాంగంలో ఒకటవ నిబంధన భారత దేశాన్ని 'రాష్ట్రాల యూనియన్'గా పేర్కొన్నది. కేంద్రంతో పాటు రాష్ట్రాలు బలంగా వుండాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. రాజ్యాంగం ఏడవ షెడ్యూల్‌లో అధికారాలు కేంద్ర జాబితా, రాష్ట్ర జబితా, ఉమ్మడి జాబితాలుగా విభజించారు. ఈ అధికారాలు అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్రాలలో ఒకే పార్టీ ఉండాలనే సూత్రమేమీ లేదు. అమెరికాలో దేశాధ్యక్షుడు ఒక పార్టీకి చెందితే, రాష్ట్రాలలో గవర్నర్లు ఇంకో పార్టీకి చెందిన వారు ఎన్నిక కావడం సాధారణ విషయం. మన దేశంలో 1952, 1957, 1962 ఎన్నికలలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ లోక్ సభతో పాటు అన్ని రాష్ట్రాల ఎన్నికలలో (1957లో కేరళ మినహాయిస్తే) గెలుపొందింది. 1967 ఎన్నికలలో కాంగ్రెస్ లోక్‌సభలో స్వల్ప మెజార్టీతో అధికారంలోకి వచ్చినప్పటికీ, 8 రాష్ట్రాలలో ఓటమి చెంది ఇతర పార్టీల ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అప్పటి నుండి ఇప్పటివరకు కేంద్రంలో ఒక పార్టీ అధికారంలో ఉంటే రాష్ట్రాలలో భిన్నమైన పార్టీలు అధికారంలో ఉంటున్నాయి. ఉదాహరణకు 1980 లోక్‌సభ ఎన్నికలలో ఇందిరాగాంధీ నాయకత్వాన కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే రాష్ట్రాలలో ఎన్‌టి రామారావు, రామకృష్ణ హెగ్డే, ఫరూక్ అబ్దుల్లా, జ్యోతిబసు, ఇకె నయనార్ మొదలైన నాయకులు ముఖ్యమంత్రులుగా ఉన్నారు. అప్పుడు కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో, రాష్ట్రాలకు ఇంకా ఎక్కువ అధికారాలు ఉండాలని ఆర్థిక వనరుల పంపిణీలో రాష్ట్రాలకు ప్రాధాన్యత పెరగాలని వారు డిమాండ్ చేశారు. దీంతో ఇందిరాగాంధీ 1983లో కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై సర్కారియా కమిషన్‌ను నియమించారు.



జమిలి ఎన్నికలు జరిగినప్పటికీ, లోక్‌సభ, శాసనసభలు ముందే రద్దు కావనే గ్యారంటీ ఏముంది? భారత రాజ్యాంగంలో 83వ నిబంధన లోక్‌సభ, 172వ నిబంధన శాసనసభ ముందే రద్దు కావడానికి అవకాశం కల్పించాయి.

బహుపార్టీ విధానం-సంకీర్ణ రాజకీయాలు

భారత దేశంలో చారిత్రక అంశాల దృష్ట్యా బహుపార్టీ విధానం ఏర్పడింది. జాతీయ ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలను జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, గుర్తింపు పొందిన పార్టీలుగా గుర్తించింది. ప్రస్తుతం కాంగ్రెస్, బిజెపి, సిపిఐ, సిపిఎం, బహుజన సమాజ్ పార్టీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు జాతీయ పార్టీలుగా గుర్తించబడ్డాయి. గత మూడు దశాబ్దాలుగా మారిన ఆర్థిక, సామాజిక పరిస్థితులలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉనికిలోకి వచ్చాయి. మన దేశంలో జాతీయ స్థాయిలో ప్రారంభమైన సంకీర్ణ రాజకీయాలు 2009 వరకు అంటే 1989,1991,1996,1999,2004,2009లో లోక్‌సభ ఎన్నికలలో ఏ ఒక్క పార్టీకి పూర్తి మెజార్టీ రాలేదు. 1989, 1996, 1998లలో ఏర్పడిన లోక సభలు ముందే రద్దయ్యాయి. జమిలి ఎన్నికలు జరిగినప్పటికీ, లోక్‌సభ, శాసనసభలు ముందే రద్దు కావనే గ్యారంటీ ఏముంది? భారత రాజ్యాంగంలో 83వ నిబంధన లోక్‌సభ, 172వ నిబంధన శాసనసభ ముందే రద్దు కావడానికి అవకాశం కల్పించాయి.

నరేంద్ర మోడీ ఆలోచనలు-రాజకీయ నియంతృత్వం

నరేంద్రమోడీ ప్రభుత్వం 2014 మేలో పూర్తి మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. 2004 నుండి 2014 వరకు పరిపాలించిన యుపిఎ ప్రభుత్వం అనుసరించిన విధానాలు, ప్రత్యేకించి 2009-14 మధ్య జరిగిన అవినీతి మోడీ విజయానికి దోహదపడింది. కార్పొరేట్ శక్తులు, కార్పొరేట్ మీడియా మోడీని జాతీయ నాయకుడిగా చేశాయి. నాలుగేళ్లుగా నరేంద్రమోడీ, అమిత్‌షా ద్వయం అనుసరిస్తున్న రాజకీయ విధానాలు 'రాజకీయ నియంతృత్వం'వైపు కొనసాగుతున్నాయి. జాతీయ స్థాయిలోను, 29 రాష్ట్రాల్లోను బిజెపి పార్టీయే అధికారంలోకి రావాలనే ధోరణి వారిలో బలంగా కనబడుతోంది. గోవా, మణిపూర్ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ సింగిల్ మెజార్టీ పార్టీగా అవతరించినప్పటికీ, బిజెపి అధికారాన్ని కైవసం చేసుకొంది. తమిళనాడు రాజకీయాలలో అనుచితమైన జోక్యం చేసుకుంది. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వాన ఏర్పడిన ఆప్ ప్రభుత్వాన్ని ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తోంది. నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా జాతీయ దృష్టితో కాకుండా, ఒక సాధారణ రాజకీయ నాయకుడి లాగా వ్యవహరిస్తున్నారు.

లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే, ప్రజాధనం చీటికీ, మాటికీ ఎన్నికలకు ఖర్చు కావడం తగ్గిపోతుందని ఆయన చెబుతున్నారు. ఒకేసారి పని చేయవచ్చని, శాంతి భద్రతల సమస్యలు తగ్గిపోతాయని అంటున్నారు. కాని ఆయన ఆలోచన ప్రధానంగా కేంద్రంలోనూ, అన్ని రాష్ట్రాలలోను బిజెపి అధికారంలోకి తీసుకురావడమే. కేంద్రంలో తనను చూసే ప్రజలు బిజెపికి ఓటు వేస్తున్నారని, జమిలి ఎన్నికలు జరిపితే కేంద్రంతో పాటు రాష్ట్రాలలో కూడా బిజెపికే ఓట్లు వేస్తారని భావించబట్టే జమిలి ఎన్నికల గురించి ఆలోచన చేస్తున్నారు.

ప్రజల మనోభావాలు, ఆకాంక్షలు

ప్రస్తుతం భారత దేశంలో ప్రాంతీయ ఆకాంక్షలు, సామాజిక ఆకాంక్షలు పెరిగాయి. అందువలన ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత పెరిగింది. లోక్‌సభ ఎన్నికలలో ప్రజల మనోభావాలు ఒకరకంగా వుంటే, శాసనసభ ఎన్నికలలో మరో విధంగా వుండవచ్చు. 2014 లోక్‌సభ ఎన్నికలలో ఢిల్లీలో 7 స్థానాలలో బిజెపి ఎక్కువ స్థానాలు గెలుపొందింది. కొద్ది నెలల తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికలలో ఢిల్లీ శాసన సభలో గల 70 స్థానాలలో 67 స్థానాలను ఆప్ పార్టీ కైవసం చేసుకుంది. 1980వ దశకంలో కర్ణాటకలో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుపొందితే, కొంత విరామం తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికలలో రామకృష్ణ హెగ్డే నాయకత్వాన జనతాపార్టీ మెజార్టీ స్థానాలు పొందింది. అందువల్ల జమిలి ఎన్నికలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా వుండవు.

జమిలి ఎన్నికలను 2019 నాటికి కాకపోయినా, 2024 నాటికైనా ఆచరణలోకి తేవాలని నరేంద్రమోడీ, అమిత్‌షా ద్వయం పట్టుదలతో ఉన్నట్లు కనపడుతోంది. వీరి రాజకీయ, సామాజిక నియంతృత్వ విధానాలను అడ్డుకోవల్సిన బాధ్యత ప్రజాస్వామ్య, లౌకిక శక్తులపై ఉంది. జమిలి ఎన్నికల ద్వారా బిజెపిని కేంద్రంలోనూ, అన్ని రాష్ట్రాలలోను అధికారంలోకి తేవాలనే ప్రయత్నాలను అడ్డుకోవడానికి జమిలి ఎన్నికలపై పౌర సమాజంలో కూడా చర్చ జరగాలి.

(రచయిత శాసనమండలి మాజీ సభ్యులు)

శక్తినిచ్చే ఆహారం

ఆఫీస్ సమయాలలో హ్యాపీగా, ఎనర్జిటిక్‌గా పనిచేయాలని మనసులో అనుకుంటే సరిపోదు. అందుకోసం మంచి నిద్ర, ప్రతిరోజూ కొద్దిసేపు వ్యాయామంతోపాటు కొన్ని ఆహార నియమాలు పాటిస్తే సరి. పనిచేయడానికి అధికశక్తి రావడమే కాదు. ప్రొడక్టివిటీ కూడా పెరుగుతుంది. మరి ఆ ఆహార సూత్రాలేమిటో తెలుసుకుందాం!

జంక్‌ఫుడ్‌కి దూరంగా

ఆఫీస్ చుట్టూ ఎన్నో రకాల స్నాక్స్, ఫుడ్స్ నోరూరిస్తూ



ఉంటాయి. అయినా మనం జిహ్వాచాపల్యానికి అడ్డుకట్ట వేయాల్సిందే. ఎందుకంటే జంక్‌ఫుడ్ తినడంవల్ల పనిపట్ల అప్రమత్తంగా ఉండలేకపోతాం. తీపి పదార్థాలు తొందరగా శక్తినిస్తాయి. కానీ అంతే తొందరగా హానీ కలిగిస్తాయి. కాబట్టి పోషకాహారం తీసుకోవడం మంచిది.

ఫలహారం తప్పనిసరి

చాలామంది ఉదయం ఏం తినకుండా ఉంటారు. కానీ ఇది ఆరోగ్యానికి హానికరమే కాదు, మన ఆఫీస్ పనికి ఆటంకం కూడా. కాబట్టి తప్పనిసరిగా బ్రేక్‌ఫాస్ట్ తినాలి. అయితే తినమన్నారు కదా అని ఏది పడితే అది తినేయకుండా ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి. పళ్లరసం, ప్రొటీన్ షేక్, ఏవైనా పళ్ల ముక్కలు తీసుకుంటే మంచిది.

కొద్దిగా మీల్స్

రక్తంలో గ్లూకోజ్ స్థాయి స్థిరంగా ఉండాలంటే కొద్ది కొద్ది ఆహారాన్ని ఎక్కువసార్లు తీసుకోవాలి. అలా కాకుండా ఆహారం తినకుండా ఉంటే షుగర్ లెవల్స్ పడిపోతాయి. మరీ ఎక్కువగా తింటే పెరిగే అవకాశం కూడా ఉంది.

పరిగడపున ఓ పండు

పండ్లు ఏవైనా రోజంతా శక్తినిస్తాయి. పళ్లలో ఉండే ఫైబర్, కాంప్లెక్స్ షుగర్స్ సులభంగా జీర్ణమవుతాయి. కాబట్టి ఉదయమే పాలు, కోడిగుడ్డు వంటివాటికంటే ఏదైనా పండు తినడం ఆరోగ్యానికి మంచిది.

తృణధాన్యాలు

గోధుమలు, జొన్నలు, మొక్కజొన్నలు, సజ్జలు, రాగులు ఆహారంలో చేర్చుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల ఎక్కువ సమయం ఎనర్జిటిక్‌గా ఉండగలుగుతాం.

మాంసం తగ్గించండి

మాంసంలో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. ప్రొటీన్స్ కూడా అధికంగా ఉంటాయి. జీర్ణమవ్వడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి. అయితే మాంసం మంచిదే అయినా ఎక్కువమొత్తంలో తీసుకోవడంవల్ల సోమరిగా తయారవుతారు. మాంసం తినడాన్ని తగ్గించాలి.

నీరు

సరిపడా నీళ్ల తాగడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాదు శక్తినిచ్చే పోషకాలు శరీరమంతటా విస్తరించడానికి నీరు ఉపయోగపడుతుంది. నీరు సరిగ్గా తాగకపోవడం వల్ల రక్తం చిక్కగా మారుతుంది. చివరకు గుండె నుంచి రక్త సరఫరా కష్టమవుతుంది. ★

మీ కోసం

సాల్ట్ పొడిగా ఉండాలంటే.. ఉప్పు డబ్బాలో కొన్ని బియ్యపు గింజలు వేయాలి



జీవన సౌరభం

వందమంది శత్రువుల కన్నా.. ఒక నమ్మకద్రోహి చాలా ప్రమాదకరం



బాలల ముంగిట వెలుగుల బడి

శ్వేత.. స్కూల్ నుంచి వచ్చేసరికి.. ఆ ఇరుకైన ఇంట్లో టీవీ సీరియళ్ళ మోత దద్దరిల్లేది. కాసేపు చదువుకోవాలని ఉన్నాగానీ, ఆ..టీవీలో వచ్చే గోల వల్ల శ్వేత కూడా ఇంట్లోవాళ్ళ పక్కనే కూర్చొని.. సాగదీత సీరియళ్ళలో లీనమయ్యేది. అలా.. ఇంట్లో ఆమెకు చదువు కరువయ్యేది. గవర్నమెంట్ బడిలో ఎనిమిదో తరగతి చదువుతోన్న రవి.. సాయంత్రంపూట చదువుకుందామని పుస్తకం తీయడం, హోంవర్క్‌లో ఏదో ఒక డౌట్ రావడం, దాని గురించి ఎవరిని అడగాలో తెలియక పుస్తకాలను పక్కన పెట్టేయడం షరా మామూలుగా జరిగేది. ఇలాంటి సమస్యలు ఈ ఇద్దరి విద్యార్థులవే కావు. రోజూ కాయకష్టం చేస్తేగానీ పూట గడవని ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాలలో సాధారణంగా కనిపించేవే. ఇలా పలు కారణాలవల్ల చదువుకునేందుకు ప్రశాంత వాతావరణం కరువై, ఆ విద్యాకుసుమాలు బాల్యంలోనే వాడిపోతున్నాయి. అలాంటివారి జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో..

ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది 'అమరావతి బాలోత్సవం- ట్యూషన్ సెంటర్'!. ఇంతకీ.. ఆ ట్యూషన్ సెంటర్ ఉద్దేశం ఏమిటి? అక్కడ చిన్నారులు ఏం చేస్తున్నారు? తెలుసుకుందాం పదండి!

'అమరావతి బాలోత్సవ' కమిటీ గతేడాది విజయవాడ పడమట పుట్టరోడ్డులో 'వేసవి విద్యా వికాసవేదిక' పేరుతో ఓ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. అందులో చుట్టుపక్కల ఉన్న మురికివాడల్లోని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి ట్యూషన్‌తో పాటు, ఆటపాటలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నెల రోజులపాటు సాగిన ఆ కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చింది. పిల్లల ఉత్సాహం చూసి, నిర్వాహకులు ఆశ్చర్యపోయారు. ఈ యాంత్రిక విద్యావిధానంవల్ల బాల్యంలో వారు ఏం కోల్పోతున్నారో కమిటీ సభ్యులు తెలుసుకోగలిగారు. కనీసం పదోతరగతి వరకూ ఏ అంతరాయం లేకుండా విద్యార్థులు చదువుకోగలిగితే పేదరికం దరిచేరదని చెప్పిన ఐక్యరాజ్యసమితి వాఖ్యలను గుర్తుచేసుకున్నారు. అందుకోసం నిరుపేద విద్యార్థులు స్వేచ్ఛగా చదువుకోగలిగే వాతావరణాన్ని కల్పించేందుకు ప్రణాళికలు వేశారు.


మరింత ఉత్సాహంతో!

తొలుత పరిచయం ఉన్న ప్రాంతంలో సాయంత్రం ఆరు నుంచి ఎనిమిదిన్నర వరకు స్థానిక విద్యార్థులు చదువుకునేందుకు ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పార్ట్‌టైం జాబ్ కోసం ఎదురుచూస్తున్న డిగ్రీ విద్యార్థినిని టీచర్‌గా అపాయింట్ చేశారు. ఆమెకు మూడువేల రూపాయల వరకూ వేతనాన్ని సమకూర్చేలా మాట్లాడారు. అయితే, నిర్వాహణా ఖర్చులు ఎక్కువ అవుతాయేమో అన్న సందేహం ఆ క్షణంలో నిర్వాహకులను ఆలోచనలో పడేసింది. అదే సమయంలో స్థానికంగా సేవాదృక్పథం కలిగిన కొందరు వ్యక్తులు స్వచ్ఛందంగా కమిటీకి సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. 'భవిష్యత్తులో ఆర్థికంగా ఎదురయ్యే ఇబ్బందుల విషయంలో కాస్త ఆలోచించాల్సి వచ్చింది. అలాంటి సమయంలో స్థానిక ఎస్‌బిఐ విశ్రాంతి ఉద్యోగి కోనేరు రఘురాంగారు తమ ప్రాంతంలో ట్యూషన్ సెంటర్ పెట్టేందుకు పూర్తి సహకారం అందిస్తానని నేరుగా వచ్చి చెప్పారు. వారితోపాటు సిహెచ్ మల్లికార్జునరావు, ఆర్.కొండలరావు వంటివారు ఒక్కొక్కరూ సాయం చేసేందుకు ముందుకొచ్చారు. అలాంటివారి స్పందన చూసి మాలో మరింత ఉత్సాహం వచ్చింది. ఇలాంటి ట్యూషన్ సెంటర్లను మరిన్ని పెంచుకుంటూ వెళ్లగలమన్న నమ్మకం పెరిగింది' అంటున్నారు నిర్వాహకులు.

అదే లక్ష్యంగా..!

అలా ఒక్కటిగా మొదలైన ట్యూషన్ సెంటర్ నెలల వ్యవధిలోనే పడమటలో రెండు, తాడిగడపకట్ట, ఎనమలకుదురు, సింగ్‌నగర్‌లో ప్రకాశ్‌నగర్, రాజరాజేశ్వరీ పేట, విద్యాధరపురం ఇలా విజయవాడ నగరంలోనే ఏడు ప్రాంతాలకు విస్తరించింది. ఈ ఏడాది చివరకు 30 సెంటర్లను ఏర్పాటు చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారు నిర్వాహకులు. అందుకు తగ్గట్టు ప్రణాళికలూ రూపొందించుకున్నారు. స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన పిల్లలు ఇక్కడ ప్రశాంతంగా వారి వారి హోంవర్కులు చేసుకోవడంతోపాటు, స్నేహితులతో చర్చించుకునేందుకు ఈ సెంటర్లు మంచి వేదికలుగా నిలుస్తున్నాయి. సబ్జెక్ట్స్‌లో ఉన్న చిన్న చిన్న అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు కేంద్రంలోని ఉపాధ్యాయులు సాయపడతారు. అంతేకాదు, ఇక్కడి ఉపాధ్యాయులకు అనుభవజ్ఞులైన వారితో ప్రతివారం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. తద్వార విద్యార్థులకు చదువుకునే సమయంలో వచ్చే సందేహాలను తీర్చగలుగుతున్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులు ఇక్కడ చదువుకునే వీలుంది. ప్రస్తుతం ఒక్కో సెంటర్‌లో 25 నుంచి 30 మంది విద్యార్థులు ఉన్నారు. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు 'బాలోత్సవం–ట్యూషన్‌సెంటర్' నిర్వాహకులు. నిర్వాహకులు తలపెట్టిన ఈ అక్షరాస్యత ఉద్యమం మరింత విస్తరించాలని కోరుకుందాం!

- చందు తిలారు




సమాజానికి ఉపయోగపడతారు



ఇక్కడ ప్రయోజనం పొందినవారు భవిష్యత్తులో తప్పకుండా సమాజానికి ఉపయోగపడతారనేది నా అభిప్రాయం. నా అనుభవంతో పిల్లల్లో వ్యక్తిత్వవికాసాన్ని పెంపొందించేందుకు, ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

- వి కేశవరావు,
రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్,
సోషల్ వర్కర్.

పిల్లల్నిచూస్తే.. ముచ్చటేస్తుంది!



మధ్యతరగతి ఇళ్లల్లో పిల్లలు చదువుకునేందుకు, హోంవర్క్ చేసేందుకు సరిపడా స్థలం ఉండదు. ఈ ట్యూషన్ సెంటర్లలో ఆ సమస్య ఉండదు. అలాగే, సెలవు రోజుల్లో వారికి నచ్చిన ఆటపాటల్లో శిక్షణ ఇచ్చి, వారిలోని సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నాం. టీచింగ్ ఫ్యాకల్టీ ఎంపికలోనూ చాలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈ ట్యూషన్ సెంటర్ల ద్వారా వారికీ ఏదో ఒక చిన్న ఉపాధి దొరుకుతుంది అనేది మా ఉద్దేశం. ఇక్కడి పిల్లల్లో చురుకుదనం చూస్తే ఎవ్వరికైనా ముచ్చటేస్తుంది.

- సిహెచ్.ఎల్.నర్సింగరావు,
ట్యూషన్ సెంటర్స్ ఇన్‌ఛార్జ్,
రిటైర్డ్ రైల్వే ఛీఫ్ టిటిఐ.

డ్రాపౌట్ తగ్గుతాయి!



బడిఈడు పిల్లల్లో డ్రాపౌట్స్ తగ్గించి, చదువు కొనసాగించేలా చేయడమే మా ట్యూషన్ సెంటర్ల ప్రధాన ఉద్దేశం. అందుకు అనుగుణంగా శివారు ప్రాంతాల్లో సర్వే చేసి, విద్యార్థులను గుర్తించి, వారికోసం సెంటర్ ఏర్పాటు చేసి, వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నాం. ఉపాధ్యాయులకు అవసరమైన జీతభత్యాల కోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి యాభై రూపాయలు నామమాత్రపు ఫీజులు తీసుకుంటాం. అదీ వారి ఆర్థికపరిస్థితిని బట్టీ! భవిష్యత్తులో ఇక్కడ చేరే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు హెల్త్ క్యాంపులు నిర్వహించేలా ప్రణాళికలూ వేస్తున్నాం.

పి. మురళీ కృష్ణ
కమిటీ నిర్వాహకులు.

చదువుపై శ్రద్ధ పెరిగింది



స్కూల్ నుంచి వచ్చిన వెంటనే టీవీ చూసేదాన్ని. అమ్మానాన్నలు పని నుంచి వచ్చేసరికి రాత్రి తొమ్మిదయ్యేది. చదవాలని ఉన్నా, చదివేదాన్ని కాదు. దాంతో స్కూల్‌లో చెప్పిన క్లాసులు అర్థమయ్యేవి కావు. మా దగ్గర్లోకి ఈ ట్యూషన్ సెంటర్ వచ్చాక టీవీ చూడటం తగ్గించేశాను. చదువుపై శ్రద్ధ పెరిగింది.

- పి. జాహ్నవి,
8వ తరగతి

ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకోవచ్చు!!



ఇంట్లో ఒకటే గొడవ గొడవగా ఉండేది. ఇక్కడకొచ్చాక హాయిగా చదువుకుంటున్నా. హోంవర్క్‌లో ఏవైనా డౌట్స్ ఉంటే, ఫ్రెండ్స్‌తో చర్చించి, నివృత్తి చేసుకోవచ్చు. టీచర్ మమ్మల్ని ఎంతో స్నేహంగా చూసుకుంటున్నారు. మా ట్యూషన్ సెంటర్ చాలా బాగుంటుంది.

- అప్సరున్నీసా,
కెఎస్ఆర్ జెటిపి హైస్కూల్.

ఫోన్లో ఆడ్డం మానేశా!



ఇదివరకు.. స్కూల్ అయ్యాక ఇంటికొచ్చి, ఫోన్‌లో గేమ్స్ ఆడుకునేదాన్ని. చదువుపై పెద్దగా శ్రద్ధపెట్టేదాన్ని కాదు. ట్యూషన్ సెంటర్‌కు వచ్చాక ఫోన్ జోలికి పోవడంలేదు. ప్రతిరోజూ సాయంత్రం అవ్వగానే.. ఇక్కడకొచ్చి అందరితో కలిసి సరదాగా చదువుకుంటున్నాను.

- పి. అమ్ములు,
విఎంసి హైస్కూల్

ఆహ్లాదపరిచే.. ఆటలు

తోటివారిని ప్రేమించాలనే విషయాన్ని అందరూ చెబుతుంటారు. ప్రేమించడం అంటే సహాయం చేయడమేనని ఎంతమంది చెబుతారు? ఈ పిల్లల్ని చూస్తే నిజమైన ప్రేమంటే ఏంటో తెలుస్తుంది. అందరూ చిన్నపిల్లలే కానీ వీరి ఆలోచనలు మాత్రం ఎంతో ఉన్నతమైనవి. అందుకే స్కూల్ ప్రాజెక్ట్‌లో భాగంగా వాళ్ల కోసం కాకుండా అంధుల కోసం ఆహ్లాదపరిచే ఆటలను కనుక్కున్నారు. అంతేకాదు ఇలాంటివి ప్రపంచంలోనే మొట్టమొదటిసారి కనిపెట్టినవారూ వీళ్లే. హైదరాబాద్‌లోని ఈ స్కూల్ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా రూపొందించిన ఆటల వెనుకున్న సంతోషాన్ని మనమూ పంచుకుందాం రండి.



సాధారణంగా అన్ని పాఠశాలల్లోనూ పిల్లలతో ఏదోఒక ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. వీటిలో పిల్లల సృజనాత్మకతను పెంచేవి కొన్నైతే.. మరికొన్ని నైపుణ్యాభివృద్ధికి తోడ్పడతాయి. అయితే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనే పిల్లలకు ఎక్కువగా ఎలాంటి అవసరాలుంటాయో వాటిపైనే ఆసక్తి చూపిస్తారు. అంతేకాకుండా ఆ పిల్లలు రూపొందించే వాటిలో వారికి అవసరమైనవే ఎక్కువ ఉంటాయి. అలాకాకుండా ఇతరులకు ఉపయోగపడే విధంగా పిల్లల ఆలోచనల్ని మలచగలిగితే సమాజం ఎంతో ఆనందదాయకంగా మారుతుంది. అలాంటి పనే చేశారు 'బెటర్ బై డిజైన్ (బిబిడి)' అనే సంస్థవారు. వారి ప్రాజెక్టుల్లో భాగంగా హైదరాబాద్‌లోని చిరెక్ అంతర్జాతీయ పాఠశాలలోని పిల్లలతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆ పిల్లలు తమకు పనికొచ్చే వాటి కోసం కాకుండా సామాజిక స్పృహతో ఇతరులకు ఉపయోగపడే పనిని చేయాలనే నిబంధన పెట్టారు. దానికి సంబంధించి రెండు నెలల సమయం వారికి ఇచ్చారు. అప్పుడు అందరూ కలిసి అంధబాలల కోసం ప్రత్యేకమైన ఆటలను రూపొందించాలని నిర్ణయించుకున్నారు. చూపు సరిగా ఉన్న పిల్లలు కొందరు కళ్లకు గంతలు కట్టుకుని, కొన్ని రోజులు అంధులుగా ఆలోచించి, రూపొందించిన ఆటలే ఇప్పుడు ఎందరో అంధబాలలకు



ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దీనికి సహకరించినవారు బిబిడి సంస్థ. వీళ్ల పిల్లల్లో సృజనాత్మకతనీ, నమ్మకాన్నీ, తార్కికతనూ పెంపొందిస్తుంటారు. వీళ్ల కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు సమాజంలోని చిన్నచిన్న సమస్యలకు పరిష్కారాలను రూపొందించడానికి ప్రోత్సహించారు. అవి నిస్వార్థంగా ఇతరులకు సహాయపడేవిగా ఉండాలని అనుకున్నారు. దానికోసం దెవ్‌నార్ స్కూల్ ఫర్ ది బ్లైండ్ నుంచి 30 మంది అంధ విద్యార్థులనూ ఈ ప్రాజెక్ట్‌లో భాగస్తులని చేశారు. ఇక్కడందరూ అంధుల్లా పరిసరాలను అర్థం చేసుకోవాల్సిన పరిస్థితిని కల్పించి, వివిధ రకాలైన స్పర్శ, బరువు, వాసన, శబ్దాలతోనే పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీశారు. దీనికోసం అంధవిద్యార్థులతో ఈ పిల్లలు మాట్లాడుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. అప్పుడు ఇరువురిలోని ఆలోచనా విధానాన్ని మిళితం చేసి సరికొత్త ఆటలకు ప్రాణం పోసే విధంగా పిల్లలను మార్చారు. అందులో నుంచి పుట్టినవే డ్యాన్స్–డ్యాన్స్ రెవల్యూషన్, ఎరోప్లేన్ సిమ్యులేటర్ వంటి ఆటలు.

ఆటలన్నీ రూపుదిద్దుకున్న తర్వాత వాటిని అంధబాలలతో ఆడించారు. కేవలం అంధుల కోసమే రూపొందించిన ఈ ఆటలు ఆడుతూ ఆ విద్యార్థులు ఎంతో సంతోషించారు. ఈ ఆటలవల్ల పిల్లలకు కేవలం ఆహ్లాదం మాత్రమే అందలేదు. వారిలోని సృజనాత్మకత, నైపుణ్యం పెరగడమే కాకుండా సమాజంపై ఒక బాధ్యత పెరిగింది. తమ కోసం తాము కాదు, అందరి కోసం అందరూ ఉండాలనే ఆరోగ్యకరమైన ఆలోచనకు పునాదులు పడ్డాయి. సంతోషం అనుభవించడంలో కంటే పంచుకోవడంలోనే అర్థం ఉందని తెలుసుకున్నారు. ఈ పిల్లలు ఎలాంటి పరిస్థితుల్లో, ఎలా ఈ ఆటలు రూపొందించారో తెలుసుకోవాలంటే https://goo.gl/uNKXv3 లింక్ క్లిక్ చేయండి. ★

ఇంట్లో.. కృత్రిమ కాంతులు

ఈ సీజన్‌లో ఇంట్లోకి వెలుగు వచ్చేలా చూసుకోవడం చాలా అవసరం. అయితే, ఇంటి లోపలికి సూర్యుని వెలుగు ప్రసరించకపోయినా విచారించనక్కర్లేదు. కాస్త సృజనాత్మకత, ఊహాశక్తిని ఉపయోగించి ఇంటిని అందంగా తీర్చిదిద్దవచ్చు. మనవంతు ప్రయత్నమే దీనికి ఆధారం. టెక్నాలజీ వేగంగా పెరుగుతున్న ఈ రోజుల్లో సూర్యరశ్మియే వెలుతురునివ్వాలన్నదేం లేదు. దానికి సరిసమానమైన కృత్రిమ వెలుతురును ఇంటికి తెచ్చుకోవచ్చు. వెలుతురు సరిగాలేని రూముల్లోని అల్మారాల్లో కూడా బల్బులు అమర్చుకుని, తెరవగానే వెలిగేలా చేసుకోవాలి. దీంతో అందులోని సామాన్లు తీసుకోవటం సులభమవుతుంది. కిచెన్ కౌంటర్, ఫ్లోర్‌లకు తెలుపు లేదా క్రీమ్ కలర్ మార్బుల్ వాడితే వెలుగు ప్రతిబింబిస్తుంది. డైనింగ్, సెంటర్ టేబుళ్ళు గ్లాస్‌వి అమర్చుకుంటే వెలుతురు మరింత వస్తుంది. గది కిటికీలకు బదులు గాజు స్లైడింగ్ డోర్స్ అమర్చుకుంటే వీలైనంత ఎక్కువ వెలుతురు ఇంట్లోకి ప్రవేశిస్తుంది. ఉదయాన్నే బల్బు కాంతిలో నిద్ర లేవాలనుకుంటే ఈ రోజుల్లో టైమర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ బల్బులకు ఉదయం నిద్రలేచే టైమ్ సెట్ చేస్తే అదే సమయానికి వెలుగుతాయి. కొన్ని అలంకరణ వస్తువులూ కాంతిని ప్రతిబింబిస్తాయి. గాజు లేదా క్రిస్టళ్ళతో తయారైన ఫ్లవర్‌వాజులు, షోపీస్‌లు ఈ కోవలోకే వస్తాయి. బెడ్‌షీట్లు లేదా సోఫా కవర్లు తెలుపు, లేత రంగుల్లో ఉంటే గదిలో వెలుతురు నిండుగా ఉంటుంది.



సెన్సెక్స్ ⬆ 295
34,300

నిఫ్టీ ⬆ 85
10,539

రూపాయి ⬆ 09 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.31

బచ్చన్‌తో మీట్ అండ్ గ్రీట్

ఎన్ఆర్ గ్రూప్ అగర్బత్తి బ్రాండ్ సైకిల్ ప్యూర్ తన వినియోగదారుల కోసం ముంబయిలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో అబితాబ్ బచ్చన్ పాల్గొని అభిమానులను పలకరించారు. గతేడాది ఈ కంపెనీ ఉత్పత్తులు కొనుగోలు చేసిన వారిలో 550 మంది విజేతలను ఎంపిక చేసి వారికి ఈ భేటీ ఏర్పాటు చేశారు.



హానీవెల్‌కు 'గోల్డెన్ పికాక్' అవార్డు

సామాజిక బాధ్యతలో విశేష కృషి చేసినందుకు గాను హానీవెల్ ఇండియాకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఒడి) నుంచి గోల్డెన్ పికాక్ 2017 అవార్డు దక్కింది. తెలంగాణలోని భూగర్భ జలాలు కలుషితమైన ప్రాంతాల్లో మూడు లక్షల మందికి సురక్షిత తాగునీటిని అందించినందుకు గాను హానీవెల్‌కు ఈ ప్రశంస దక్కింది.



తగ్గిన పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ : గతేడాది డిసెంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) పెరుగుదల 7.1 శాతానికి పడిపోయింది. ఇంతక్రితం నవంబర్‌లో ఇది 8.4 శాతంగా ఉంది. కాగా 2016 ఇదే మాసంలో 2.4 శాతంగా చోటు చేసుకుంది. కాగా 2017- 18 ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలంలో ఈ సూచీలో 3.7 శాతం పెరుగుదల ఉంది. 2016-17 ఇదే కాలంలో 5.1 శాతం తగ్గు దలను చవి చూసింది. క్రితం డిసెంబర్‌లో తయారీ రంగం 8.4 శాతం వృద్ధిని కనబ ర్చింది. 2016 డిసెంబర్‌లో ఇది 0.6 శాతం పెరుగదలతో సరిపెట్టుకుంది. మొత్తం పారి శ్రామికో త్పత్తిలో తయారీ రంగం 77.63 శాతం వాటా కలిగి ఉంది. క్రితం డిసెంబర్‌లో కాపిటల్ గూడ్స్ రంగం 16.4 శాతం, కన్స్యూమర్ నాన్ డ్యూరెబుల్స్ 16.5 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి. గనులు, తయారీ, విద్యుత్ రంగా లు వరుసగా 1.2 శాతం, 8.4 శాతం, 4.4 శాతం చొప్పున పెరిగాయి. మొత్తంగా తయారీ రంగంలోని 23 రంగాల్లో 13 సెగ్మెంట్‌లు సానుకూల వృద్ధిని సాధించాయి.

జనవరిలో 5.07శాతానికి ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ స్వల్పంగా 5.07 శాతానికి తగ్గిందనికేంద్ర గణంకాల శాఖ సోమవారం వెల్లడించింది. 2017 డిసెంబర్‌లో ఇది 5.21 శాతంగా నమోదయ్యింది. అదే 2017 జనవరిలో ఈ సూచీ 3.17 శాతంగా ఉంది. క్రితం డిసెంబర్‌లో అహారోత్పత్తుల ధరలు 4.7 శాతానికి తగ్గాయని సిఎస్ఒ పేర్కొంది. డిసెంబర్‌లో వీటి ధరలు 4.96 శాతంగా ఉన్నాయి. ముఖ్యంగా కూరగాయల ధరలు నవంబర్‌లో 29.13 శాతంగా ఉండగా, డిసెంబర్‌లో 26.97 శాతానికి దిగివచ్చాయని పేర్కొంది. పళ్ల ధరలు, ఇంధన ధరలు స్వల్పంగా తగ్గినట్లు తెలిపింది.

ఫుడ్‌పండా రూ.400 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ : అహర డెలివరీ సిస్టమ్‌ను మరింత పటిష్టం చేసుకోవడానికి గాను ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ ఫుడ్‌పండా రూ.400 కోట్ల పెట్టుబడుల ప్రణాళికలు ప్రకటించింది. ఈ వ్యయం ద్వారా టెక్న లాజీ ఆధునీకరణ, భాగ స్వామ్య రెసా రెంట్లు, వినియో గదారులు, రైడర్లకు మరింత చేరువ కావాలని నిర్దే శించుకున్నామని ఫుడ్ పండా ఇండియా సిఇఒ ప్రణయ్ జివ్రాజ్కా పేర్కొన్నారు. వచ్చే 12-15 మాసాల్లో మెట్రో, ఇతర ముఖ్య మైన పట్టణాల్లో కొత్తగా 25,000 డెలివరీ రైడర్లను తీసుకో వాలని బావిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ సంస్థ 150 పైగా పట్టణాల్లోని 15,000 పైగా రెస్టారెంట్లతో భాగస్వామై ఫుడ్ ఆర్డర్లు, డెలివరీ చేస్తోంది.

గెయిల్‌కు అమ్మకాల దన్ను



క్యూ3 లాభాల్లో 28% వృద్ధి

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని గెయిల్ ఇండియా 2017-18 డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ త్రైమాసికంలో గెయిల్ నికర లాభాలు 28 శాతం పెరిగి రూ.1262 కోట్లకు చేరాయి. ముఖ్యంగా లిక్విడ్ హైడ్రోకార్బన్స్, గ్యాస్ మార్కెటింగ్, సరఫరా విభాగాల్లో మెరుగైన పనితీరు కనబర్చడం ద్వారా లాభాలు పెరిగాయి. కాగా 2016-17 ఇదే క్యూ3లో రూ.983 కోట్ల లాభాలు నమోదు చేసింది. గత త్రైమాసికంలో సహజ వాయువు సరఫరా, మార్కెటింగ్‌లో 6 శాతం చొప్పున పెరుగుదల చోటు చేసుకుంది. అదే విధంగా పెట్రోకెమికల్స్ అమ్మకాలు 21 శాతం పెరిగాయి. హైడ్రోకార్బన్స్ విక్రయాలు 10 శాతం వృద్ధి, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ సరఫరాలో 2 శాతం చొపుపన పెరుగుదల నమోదయ్యిందని ఆ కంపెనీ వెల్లడించింది. అదే విధంగా 2017-18 తొలి తొమ్మిది మాసాల్లో ఇదే తరహా వృద్ధిని సాధించినట్లు తెలిపింది. ఆ తొమ్మిది మాసాల కాలంలో 31 శాతం వృద్ధితో రూ.3597 కోట్ల నికర లాభాలు సాధించినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా ప్రతీ రూ.10 ముఖ విలువ కలిగిన మూడు షేర్లపై ఒక్క బోనస్ షేర్‌ను అందించాలని గెయిల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నిర్ణయించారు. గత తొమ్మిది మాసాల్లో కంపెనీ నిర్వహణ రెవెన్యూ 17 శాతం పెరిగి రూ.14,414 కోట్లకు చేరింది.

బిఒఐకి రూ.2341 కోట్ల నష్టాలు..

బ్యాంకు ఆఫ్ ఇండియా భారీ నష్టాలు చవి చూసింది. మొండి బాకీల దెబ్బతో ఈ ప్రభుత్వ రంగ సంస్థ 2017 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3) లో ఏకంగా రూ.2341 కోట్ల నష్టాల పాలయ్యింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.101 కోట్ల లాభాలు నమోదు చేసింది. గత త్రైమాసికంలో బ్యాంకు మొండి బకాయిల కేటాయింపుల భారం ఏకంగా 72 శాతం ఎగిసి రూ.4373 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో బ్యాంకు స్థూల నిరర్ధక ఆస్తులు అమాంతం 16.93 శాతానికి ఎగిశాయి. ఈ కాలంలోని నికర ఎన్‌పిఎ 7.09 శాతం నుంచి గత క్యూ3లో ఏకంగా 10.29 శాతానికి చేరాయి. 2016-17 ఇదే క్యూ3లో బిఒఐ జిఎన్‌పిఎ 13.38 శాతంగా ఉంది. క్రితం త్రైమాసికంలో బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 12 శాతం తగ్గి రూ.2501 కోట్లకు పడిపో యింది. వడ్డీయేతర ఆదాయం కూడా 41 శాతం క్షీణించి రూ.10.41 కోట్లుగా నమోదయ్యింది. సోమవారం బిఎస్ఇలో బిఒఐ సూచీ 1.61 శాతం పెరిగి రూ.144.85 వద్ద ముగిసింది.

కామదేను లాభాల్లో 78% వృద్ధి

స్టీల్ బార్ల తయారీ దారు కామదేను లిమి టెడ్ 2017 -18 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 78 శాతం వృద్ధితో రూ.4.1 కోట్ల నికర లాభాలు సాధించింది. 2016-17 ఇదే త్రైమాసికంలో రూ.2.3 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 38 శాతం పెరిగి రూ.3051 కోట్లకు చేరిందని ఆకంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా 2017-18 ఏప్రిల్ డిసెంబర్ కాలంలో కంపెనీ నికర లాభాలు 60 శాతం వృద్ధితో రూ.10 కోట్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ 38 శాతం వృద్ధితో రూ.803 కోట్లుగా చోటు చేసుకుంది.

రూ.50వేల కోట్ల మార్క్‌కు మాక్స్ లైఫ్

న్యూఢిల్లీ : జీవిత బీమా కంపెనీల్లో ఒక్కటైన మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ విలువ రూ.50వేల కోట్లకు చేరినట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతీ ఏడాది 19.5 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు పేర్కొంది. 2016-17లో వ్యక్తిగత, గ్రూపు బీమాలో ప్రీమియం వసూళ్లు 27 శాతం పెరిగి రూ.3,666 కోట్లకు చేరినట్లు ఆ సంస్థ వైస్ ఛైర్మన్ రాజేష్ సుద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థూల ప్రీమియం వసూళ్లు 17 శాతం పెరిగి రూ.10,780 కోట్లుగా నమోదయ్యాయని అన్నారు. రెనివల్ ప్రీమియం వసూళ్లు 12 శాతం పెరిగి రూ.7,114 కోట్లకు చేరిందన్నారు.

ఎట్టకేలకు లాభాలు

ముంబయి : గత కొద్ది రోజులుగా వరుస నష్టాలతో కుదేలైన స్టాక్ మార్కెట్లు సోమవారం ఎట్టకేలకు లాభాల్లో ముగి శాయి. సానుకూల అంతర్జాతీయ పరిణామా లకు తోడు భారీగా పడిపోయిన సూచీల నేపథ్యంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ముఖ్యంగా విద్యుత్, రియాల్టీ సూచీల మద్దతుతో బిఎస్ఇ సెన్సెక్స్ 294.71 పాయింట్లు లేదా 0.87 శాతం పెరిగి 34,300.47కు చేరింది. నిఫ్టీ 84.8 పాయింట్లు లేదా 0.81 శాతం రాణించి 10,539.75 వద్ద ముగిసింది.

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిసెంబర్‌తో ముగిసిన మూడోత్రైమాసికంలో అత్యంత పేలవమైన ఆర్థిక ఫలితాలు నమోదు చేయడంతో పాటు భారీగా మొండి బాకీలు పెరగడంతో ఆ సూచీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది.

విద్య

ఎపి టెట్ ప్రాక్టీస్ పేపర్ -1



కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు
సెల్ : 9440262072

MODEL QUESTIONS - నిన్నటి కొనసాగింపు

పార్ట్ -4 మ్యాథమెటిక్స్

91. ♤ నకు గల సౌష్టవాక్షాల సంఖ్య...
ఎ. 7 బి. 3 సి. 4 డి.1


92. అక్షరము X కి గల సౌష్టవ రేఖల సంఖ్య...
ఎ. 10 బి. 7 సి. 2 డి. 1

93. రెండు సరళరేఖలు ఖండించుకొనినచో ఉమ్మడి భుజం లేకుండా ఏర్పడిన కోణాలను... అంటారు?
ఎ. పూరక కోణాలు బి. సంపూరక కోణాలు
సి. అసన్న కోణాలు డి. శీర్షాభిముఖ కోణాలు

94. ఒక కంటైనర్ ట్రక్కు 2,50,000 కి.గ్రా/ 250 టన్నుల బరువు మోయగలరు. ఒక్కొక్క జీపు బరువు 2000 కిలోగ్రాములు బరువుంటే వాటిని ఎన్ని తీసుకెళ్లగలదు?
ఎ. 115 బి. 145 సి. 135 డి. 125

95. సంతోష్ మరియు తన కుటుంబ సభ్యులు వనోత్సవంలో ఉదయం 10 : 30 నుంచి సాయంత్రం 4 :20 వరకూ ఉన్నారు. అయితే వారు ఎంత సమయం వనంలో ఉన్నారు?
ఎ. 9 గంటల 30 నిమిషాలు
బి. 8 గంటల 15 నిమిషాలు
సి. 3 గంటల 15 నిమిషాలు
డి. 5 గంటల 30 నిమిషాలు

96. ఒక ఆయిల్ పీపాలో 15 లీటర్ల నూనె ఉన్నది. దీనిని ఐదు సమానమైన బాటిళ్లలో నింపారు. అయిన ప్రతి బాటిల్లో .... లీటర్లు ఉంటుంది?
ఎ. మూడు బి. నాలుగు
సి. ఐదు డి. ఏదీకాదు



97. కింది పటంలో ΔPQR వైశాల్యము = 15 చదరపు సెంటీమీటర్లు. అయిన ΔPQS వైశాల్యము =
ఎ. 7.5 సెం.మీ2
బి. 15 సెం.మీ2
సి. 30 సెం.మీ2
డి. 10 సెం.మీ2

98. దత్తాంశమును బొమ్మల ద్వారా వర్ణించడాన్ని... అందురు
ఎ. బొమ్మ చిత్రాలు బి. వృత్త చిత్రాలు
సి. సెక్టరు డి. ఏదీకాదు

99. ఆరోహణ సంచిత పౌనఃపున్యవక్రం నిర్మించడానికి ఉపయోగించేవి?
ఎ. తరగతుల ఎగువ హద్దులు, సంచిత పౌనఃపున్యాలు
బి. తరగతుల దిగువ హద్దులు, సంచిత పౌనఃపున్యాలు
సి. తరగతుల మధ్య విలువలు, సంచిత పౌనఃపున్యాలు
డి. తరగతుల ఎగువ హద్దులు, ఆరోహణ సంచిత పౌనఃపున్యాలు


100. ఈ కిందివానిలో ద్విపది
ఎ. $a^2 + b^2 + c^2$ బి. stu
సి. lm + nm + ln డి. $a^3 + b^3$

101. 0.18 (5x-4)=0.5x +0.8 **అయిన x =.......**
ఎ. 3 బి. 3.8 సి. 8 డి. 1.9

102. $(a^4 + 17 + 5a - 12a^2)$ % $(a^2 + 2a + 5)$**లో శేషం ఎంత?**
ఎ. 0 బి. $a^2 - 2a - 13$
సి. 4la -82 డి. 4la + 82

103. $x^{11} + 101$ **ను** $x + 1$ **చే భాగించగా వచ్చే శేషం?**
ఎ. −1 బి. 102
సి. 0 డి. 100


104. పటాన్ని పూర్తి చేయగా



ఎ. బి.
సి. డి.

105.  **అయిన X =**
ఎ. 900 బి. 400 సి. 520 డి. 260

106. ఇచ్చిన పటంలో l//m **మరియు** n **తిర్యగ్రేఖ** AC **మరియు** BD **లు** ∠A **మరియు** ∠B **కోణ సమద్విఖండన రేఖలు అయిన** a **విలువ...**



ఎ. 60^0 బి. 30^0
సి. 150^0 డి. 330^0

107. భరత్ అమ్మకం వెలపై వచ్చిన లాభశాతాన్ని పొరపాటున 40 శాతంగా లెక్కించారు. అయిన అతని వాస్తవ లాభశాతం ఎంత?
ఎ. 40 % బి. 66 1/3 %
సి. 66 2/3 % డి. 33 1/3 %

108. ఒక విద్యార్థికి ఒక పరీక్షలో 54 మార్చులు వచ్చాయి. కాని పాస్ అవడానికి 18 మార్కులు తగ్గి ఫెయిల్ అయ్యాడు. పరీక్ష పాస్ అవ్వాలంటే 36 % మార్కులు రావాలి. అయిన ఆ పరీక్ష ఎన్ని మార్కులకు నిర్వహించబడింది? (గరిష్ట మార్కులు)
ఎ. 160 బి. 220 సి. 180 డి. 200

109. A α B **మరియు** A α 1/C **మరియు** B=3 **అయితే** A=2 **మరియు** C=5, B=8 **మరియు** C=15 **అయితే** A **విలువ...**
ఎ. 16/9 బి. 9/16 సి. 4/3 డి. 64/27

110. A **కి** B **కన్న రెట్టింపు,** B **కి** C **కన్న రెట్టింపు సొమ్ము వచ్చేలా రూ.3010లను** A,B,C **లకు పంచుము?**
ఎ. A= 860, B= 1720, C= 430
బి. A= 1720, B= 430, C= 860
సి. A= 1720, B= 860, C=430
డి. ఏదీకాదు

111. రవి తన వద్దనున్న మొత్తం సొమ్ములో 75 శాతం వరకూ ఖర్చు పెట్టగా అతని వద్ద 600లు మాత్రమే మిగిలాయి. మొదటగా రవి వద్దనున్న అసలు సొమ్ము...
ఎ. రూ.800 బి. రూ.1600
సి. రూ.2400 డి. రూ.1200

112. $129 / 2^3 5^2$ x 7K **అంతమయ్యే దశాంశం అయిన** K=
ఎ. 3 బి. 2 సి. 1 డి. 0

113. రెండు సంఖ్యల లబ్ధము -20/9 మరియు వాటిలో ఒక సంఖ్య 4 అయిన మరొక సంఖ్య విలువ
ఎ. −1/9 బి.9/5 సి.5/9 డి. −5/9

114. రూపంలో గల సంఖ్య నందు $P=2^m.3^n.5^r$ **రూపంలో రాయగలిగిన అది........దశాంశం**
ఎ. అంతమయ్యే బి. అంతం కాని ఆవర్తనమయ్యే
సి. అంతం కాని డి. ఆవర్తనము కాని

మెథడాలజీ

115. ఈ షీట్లలో ఇచ్చిన సమస్యలను, దాని వద్దనే కేటాయించిన స్థలంలోనే సాధించాలి.
ఎ. వర్క్‌షీట్స్ బి. కృత్యాధార షీట్లు
సి. డామినో కార్డులు డి. ఏదీకాదు

116. ఓబిబి పథకం ఏర్పాటైన సంవత్సరం?
ఎ. 1984 బి. 1986 సి. 1963-64 డి. 1976

117. గణిత గ్రంథాలయంలోని పుస్తకాలు ఎవరి ఆధ్వర్యంలో ఉండాలి?
ఎ. ప్రధానోపాధ్యాయులు బి. డ్రిల్ మాస్టర్ (పి.ఇ.టి)
సి. గణిత ఉపాధ్యాయుడు డి. ఏ ఉపాధ్యాయుడైనా

118. తూనికలు, కొలతరాళ్లు, ద్రవాలను కొలిచే బుడ్లను ఉపయోగించే అంశం ఏది?
ఎ. గణిత ప్రదర్శన బి. గణిత ప్రయోగశాల
సి. గణిత క్లబ్స్ డి. పైవన్నీ

119. 'లెక్కించనివారు లెక్కలోకి రారు' అని ప్రవచించిన వారు
ఎ. అనటోల్ ఫ్రాన్స్ బి. యూక్లిడ్
సి. భాస్కరాచార్య డి. నాథానియెల్‌వెస్ట్

120. నమూనా వార్షిక పథకంలో చేర్చిన అంశాలు
ఎ. యూనిట్ పూర్తి చేయాల్సిన నెల
బి. యూనిట్ పేరు, సబ్ యూనిట్
సి. పీరియడ్‌ల సంఖ్య, క్షేత్ర పర్యటనలు
డి. పైవన్నీ

పార్ట్ -5 ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

121. షార్క్ చేప నోటిలో దంతాల సంఖ్య దాదాపు
ఎ. 4000 బి. 400 సి. 40 డి. 4

122. మొదటి ప్రపంచ యుద్ధంలో అంతిమంగా ఓడిన దేశం
ఎ. జపాన్ బి. ఇటలీ సి. జర్మనీ డి. చైనా

123. సైనానెహ్వాల్ ......లో ప్రవీణురాలు.
ఎ. క్రికెట్ బి. షూటింగ్
సి. బ్యాడ్మింటన్ డి. టెన్నిస్

124. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలోని ఎర్రమల కనుమలలో జన్మించే నది?
ఎ. చిత్రావతి బి. కుందేరు
సి. పాపాఘ్ని డి. చెయ్యేరు

125. 'లౌకిక, సామ్యవాదం' అనే పదాలు రాజ్యాంగ ప్రవేశికకు చేర్చిన సంవత్సరం?
ఎ. 1970 బి. 1972 సి. 1976 డి. 1974

126. ఈ కింది వానిలో అసత్య వాక్యాన్ని గుర్తించండి?
ఎ. తుపాను అంటే అధిక పీడన వ్యవస్థ
బి. గాలి వేగమే తుపాను ఏర్పడటానికి కారణం
సి. తుపానులు ఎక్కువ వర్షం మరియు బలమైన గాలులతో నష్టం కలిగిస్తాయి
డి. తుపానులలో కన్ను లాంటి ఆకారాలు ఏర్పడతాయి

127. మిత్ర కూటమిలోని సభ్య దేశాల సంఖ్య
ఎ. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, రష్యా
బి. ఇంగ్లాండ్, జర్మనీ, ఆస్ట్రియా
సి. ఇంగ్లాండ్, రష్యా, ఆస్ట్రియా
డి. అమెరికా, జపాన్, రష్యా

128. సామాజిక వ్యవస్థాపనలోని ప్రాథమిక అంశం.
ఎ. సమాజం బి. సంస్థ
సి. కుటుంబం డి. కులం

129. 2 కి.గ్రా ద్రవ్యరాశి గల వస్తువు 20 మీ ఎత్తు నుంచి కిందపడితే స్థితిశక్తిలో నష్టం...
ఎ. 400 జౌల్స్ బి. 300 జౌల్స్
సి. 200 జౌల్స్ డి. 100 జౌల్స్

130. మన శరీరంలో ఉండే మొత్తం ఎముకల సంఖ్య
ఎ. 26 బి. 260 సి. 2600 డి. 206

131. గ్రీనిచ్‌లో సమయం ఉదయం 10 గంటలైతే భారత్‌లో సమయం ఎంత?
ఎ. ఉదయం 4.30 గంటలు
బి. సాయంత్రం 4.30 గంటలు
సి. సాయంత్రం 3.30 గంటలు
డి. ఉదయం 3.30 గంటలు

132. భారతదేశ జనాభా ఏ సంవత్సరం తర్వాత నిరంతరాయంగా పెరుగుతంది?
ఎ. 1901 బి. 1911 సి. 1921 డి. 1931

133. దోలమైట్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం?
ఎ. ఉత్తరప్రదేశ్ బి. పశ్చిమ బెంగాల్
సి. సిక్కిం డి. ఒరిస్సా

134.

1. కుంతకాలు	(ఎ) ఎ. విసరటం
2. రదనికలు	(డి) బి. నమలటం
3. చర్వణకాలు	(బి) సి. కొరకటం
4. అగ్రచర్వణకాలు	(సి) డి. చీల్చటం

పైన ఉదహరించిన జతపరచడంలో సరిగా జతపరిచినవి.
ఎ. 1,2 బి. 2,3 సి. 3,4 డి. 1,4

135. బ్లాక్ స్థాయిలో మండల ప్రజాపరిషత్తులను సిఫారసు చేసినవారు (కమిటీ)
ఎ. బల్వంతరాయ్ మెహతా కమిటీ
బి. అశోక్ మెహతా కమిటీ
సి. 73వ రాజ్యాంగ సవరణ
డి. జస్టిస్ హనుమంతరావు కమిటీ

136. నీటి స్థితులలో సరైన క్రమం
ఎ. మంచు-నీరు-నీటిఆవిరి
బి. మంచు-నీటిఆవిరి-నీరు
సి. నీరు-మంచు-నీటిఆవిరి
డి. నీటిఆవిరి-మంచు-నీరు

137. అడవులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం
ఎ. మహారాష్ట్ర బి. ఒరిస్సా
సి. మధ్యప్రదేశ్ డి. గుజరాత్

138. 'మాన్‌సూన్' అనే పేరును ఈ దేశ వర్తకులు పెట్టారు?
ఎ. పర్షియన్‌లు బి. అరబ్‌లు
సి. గ్రీకులు డి. రోమన్లు

139. ఈ కింది వానిలో స్పర్శ గ్రాహకాలు
ఎ. టాక్టైల్ రిసెప్టర్స్ బి. ఫొటో రిసెప్టర్స్
సి. పాసీనియన్ రిసెప్టర్స్ డి. నాసిప్టర్స్

140. శైవలాలు.... తరగతికి చెందుతాయి?
ఎ. థాలోఫైటా బి. బ్రయోఫైటా
సి. టెరిడోఫైటా డి. ఏవీకావు

141. 1.గ్రసని, 2.నాశికా కుహరం, 3.స్వరపేటిక, 4. వాయునాళం...వీటిలో సరైన వరుస క్రమం గుర్తించండి.
ఎ. 1,3,2,4 బి. 2,1,3,4
సి. 2,3,4,1 డి. 2,3,1,4

142. ఎన్ఎఫ్‌సిపిను విస్తరింపుము?
ఎ. నేషనల్ ఫ్లడ్ కంట్రోల్ ప్రోగ్రామ్
బి. నేషనల్ ఫ్లడ్ కంట్రోల్ ప్లాన్
సి. నేషన్ ఫ్లడ్ కంట్రోల్ ప్రాజెక్టు
డి. నాన్-ఫ్లడ్ కంట్రోల్ ప్రోగ్రామ్

143. అంతర్జాతీయ దినరేఖ
ఎ. 00 రేఖాంశం బి. 1800 రేఖాంశం
సి. 900 రేఖాంశం డి. 82 1/20 రేఖాంశం

144. రోగ నిరోధక శక్తిని పెంచే విటమిన్
ఎ. విటమిన్-ఎ ఇ. విటమిన్-బి
సి. విటమిన్-డి డి. విటమిన్-సి

పెడగాగి

145. 'ఎవరు సంపాదించుకుంటే వారి ఆస్తి' ఈ వాక్యం దేనికి సంబంధించినది?
ఎ. భావన బి. సామాన్యీకరణం
సి. సూత్రం డి. నియమం

146. వినియోగంలో లేని స్పష్టీకరణ
ఎ. శాస్త్ర పరిశీలనలను వ్యాక్యానించడం
బి. రేఖాపటాలను, దత్తాంశాలను వ్యాక్యానించుట
సి. అనుమతిని రాబట్టడం
డి. ప్రాగుక్తీకరించడం

147. ఆర్కిమెడీస్, న్యూటన్ లాంటి శాస్త్రవేత్తలు జీవిత విశేషాలు తెలియజేయడానికి ఏఏ శాస్త్రాలకు మధ్య సహసంబంధం ఉంటుంది?
ఎ. చరిత్ర-విజ్ఞానశాస్త్రం
బి. భౌగోళిక శాస్త్రం - విజ్ఞాన శాస్త్రం
సి. పౌరశాస్త్రం-విజ్ఞానశాస్త్రం
డి. అర్థశాస్త్రం- విజ్ఞానశాస్త్రం

148. ఉపాధ్యాయుడు మార్గదర్శికాగా, కరికులం ఒక మార్గం అని అన్నది?
ఎ. కన్నింగ్‌హామ్ బి. జె.బెన్నెట్
సి. బార్న్స్, డగ్లస్ డి. కె.జి.సాయిదిన్

149. వెబ్‌లోని వెబ్‌పేజిని చూసేందుకు తప్పనిసరిగా అవసరమయ్యే సాఫ్ట్‌వేర్‌ను ఏమంటారు?
ఎ. బ్రౌజర్ బి. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ (ఐఎస్‌పి)
సి. సెర్చ్ ఇంజన్‌లు డి. యుఆర్ఎల్

150. బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఊహించే కారకం సూత్రం
ఎ. $s= \frac{R-W}{N-1}$ బి. $s= \frac{R}{N-1} - W$
సి. $s= R- \frac{W}{N-1}$ డి. $s= R- \frac{W}{N+1}$

ANSWERS

MATHEMATICS

91)4	92)3	93)4	94)4	95)4
96)3	97)2	98)19	9)4	100)4
101)2	102)4	103)4	104)2	105)4
106)2	107)3	108)4	109)1	110)3
111)3	112)4	113)4	114)2	115)1
116)2	117)3	118)2	119)1	120)4

ENVIRONMENTAL STUDIES

121)1	122)3	123)3	124)2	125)3
126)1	127)1	128)3	129)1	130)4
131)3	132)3	133)4	134)2	135)2
136)1	137)3	138)2	139)1	140)1
141)2	142)1	143)4	144)4	145) 1
146)2	147)2	148)2	149)1	150)3

విధులను బహిష్కరించిన అద్దె బస్సు డ్రైవర్లు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఆర్టీసీ అద్దె బస్సుల కార్మికులపై కృష్ణా జిల్లా మచిలీపట్నం డిపో మేనేజర్ వివిఎస్ మూర్తి కక్ష సాధింపు చర్యలకు పాల్పడడాన్ని నిరసిస్తూ డ్రైవర్లు సోమవారం విధులను బహిష్కరించారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అద్దె బస్సుల కార్మికులను అక్కున చేర్చుకుని ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేయాల్సిన మేనేజరు సూటీపోటీ మాటలతో కక్షసాధింపు చర్యలకు పాల్పడటం దారుణమని ఖండించారు. వివిధ కారణాలతో సస్పెండ్ చేసిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ ఆందోళనకు దిగటంతో మేనేజరు దిగొచ్చారు. ఐదుగురు కార్మికులను విధుల్లోకి తీసుకునేందుకు అంగీకరించారు.



యువజనోత్సవాలు
శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయంలో సోమవారం యువజనోత్సవాల్లో భాగంగా వివిధ వేషాధారణలతో ఎస్‌వియు పశు సంవర్ధకశాఖ విద్యార్థులు

ఆకట్టుకున్న అఖిల భారత యువజనోత్సవాలు

52 విశ్వవిద్యాలయ విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - క్యాంపస్(తిరుపతి)

భారతదేశం విభిన్న సంస్కృతులకు, సాంప్రదాయాలకు నిలయమని పశుసంవర్ధకశాఖ మంత్రి పి.ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో సోమవారం 18వ అఖిల భారత యువజనోత్సావాలు (అగ్రి యూనిఫెస్ట్-2018) వెటర్నరీ గ్రౌండ్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ఆదినారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో పాల్గొనడం వల్ల ఒత్తిడిని నివారించుకోవచ్చన్నారు. ముఖ్యంగా చదువులతో పాటు మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్‌వియు ఉపకులపతి ఆచార్య వై.హరిబాబు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అత్యధిక శాతం పశుగణాభివృద్ధి గణనీయంగా పెరిగిందని, వాటి ద్వారా ఆదాయం దాదాపు 15 శాతంగా ఉందన్నారు. ప్రారంభోత్సవానికి ముందు 52 విశ్వవిద్యాలయాల పశువైద్య, వ్యవసాయ వర్సిటీల నుండి వచ్చిన 2 వేల మంది విద్యార్థులు వారి రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిభింబిస్తూ నృత్య ప్రదర్శనలు చేశారు. ఇందులో దేశంలోని 23 రాష్ట్రాలకు చెందిన 52 వ్యవసాయ, అనుబంధ విశ్వవిద్యాలయాల నుంచి రెండు వేల మంది విద్యార్థులు, మరో 5 వందల మంది అధ్యాపకులు, సహాయకులు పాల్గొన్నారు. యువజనోత్సవాల్లో న్యాయనిర్ణేతలుగా 16 రాష్ట్రాల నుంచి 38 మంది హాజరయ్యారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- సమాన పనికి సమాన వేతనం
- స్కీం వర్కర్లకు కనీస వేతనం
- సిపిఎం 25వ రాష్ట్ర మహాసభ తీర్మానాలు

ప్రజాశక్తి-పర్స సత్యనారాయణనగర్ (భీమవరం)

రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనమివ్వాలని సిపిఎం 25 వ రాష్ట్ర మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న ఆ పార్టీ మహాసభల్లో మూడో రోజైన సోమవారం ఈ మేరకు తీర్మానించారు. తీర్మానాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు ప్రవేశపెట్టగా, ధనలక్ష్మీ బలపరిచారు. ప్రభుత్వ పథకాలకు అవసరమైన బడ్జెట్ కేటాయించాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ18,000లు అమలు చేయాలని, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, అసంఘటిత రంగకార్మికులకు సమగ్ర చట్టం చేయాలనీ, సామాజిక భద్రత కల్పించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దేశాభివృద్ధికి తోడ్పడే ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేట్‌పరం కాకుండా ఐక్యంగా పోరాడాలని కార్మిక వర్గానికి, ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై...

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నేటికీ రెగ్యులరైజ్ చేయలేదు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదు. మహిళలకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు అమలు కావడం లేదు. రెగ్యులర్ ఉద్యోగినులకు మాత్రమే 180 రోజులు వేతనంతో కూడిన మెటర్నిటీలీవు సౌకర్యం అమల వుతున్నది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మహిళలకు 180 రోజులు మెటర్నిటీ లీవు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నది. వివిధ కేడర్ల ఉద్యోగి నులకు 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నటీ లీవు సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. వివిధ ప్రభుత్వ శాఖలలో వర్క్‌కాంట్రాక్టు విధానాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నాన్ని ఉద్యోగులు ఐక్యంగా త్రిప్పి కొట్టాలి.

స్కీం వర్కర్లపైనా...

వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు, పెన్షన్ 3వేలు, పిఎఫ్, గ్రాట్యూటీ అమలు చేయాలని, పథకాల నిర్వహణకు అవసరమయ్యే పూర్తి బడ్జెట్‌ను కేంద్రం కేటాయించాలని, స్కీంలలో పని చేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సంక్షేమ పథకాలను ప్రైవేటీకరించరాదని రాష్ట్ర మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ స్కీం కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. దశాబ్దాల తరబడి పనిచేస్తున్నా కార్మికులుగా గుర్తించడం లేదు. 'పార్ట్‌టైం, గౌరవ వేతనం, పారితోషికాలు, వాలంటీర్' వంటి పేర్లు తగిలించి కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఆరోగ్య సౌకర్యాలతో కూడిన సామాజిక భద్రత కల్పించకుండా ప్రభుత్వాలు వీరితో వెట్టిచాకిరీ చేయిస్తున్నాయి. వీరికి నెలకు రూ.400 నుండి రూ.7,000 లోపు వేతనాలు చెల్లిస్తున్నారు. ఈ నామమాత్రపు వేతనాలు కూడా ప్రతి నెలా చెల్లించడంలేదు. 7-8 నెలలు పెండింగ్ పెడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కూడా ప్రైవేటీకరించేందుకు రంగం సిద్ధం చేసింది.

కనీస వేతనాలపైన...

రాష్ట్రంలో కనీస వేతనాల షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేసే 50 లక్షల మంది కార్మికులకు, వ్యవసాయ రంగంలో పని చేస్తున్న వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలను వెంటనే సవరించి అమలుకు కృషి చేయాలని మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. కేంద్ర, రాష్ట్రాల పరిధిలోని ఉద్యోగాలకు కార్మిక సంఘాలు కోరిన విధంగా ఒకే వేతనం ఉండాలి. అలా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వం జాతీయ కనీస వేతనాన్ని (నేషనల్ మినిమం వేజ్) నెలకు రూ.18 వేలుగా నిర్ణయిం చాలి. కనీస వేతనాలపై కోర్టులకు వెళ్ళే వీలులేకుండా కొత్త చట్టంలో మోడీ ప్రభుత్వం నిబంధనలు చేర్చింది. ఈ సంస్కరణలకు చంద్రబాబునాయుడు ప్రభుత్వం పూర్తి మద్దతు తెలుపుతున్నది. రాష్ట్రం విడిపోయి మూడున్నర సంవత్సరాలు దాటినప్పటికీ ఇప్పటి వరకూ వేతన సవరణకు అవసరమైన కనీస వేతనాల సలహా బోర్డును కూడా ఏర్పాటు చేయకపోవటం రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వైఖరికి దర్పణం పడుతోంది.

అసంఘటితరంగ కార్మికులపైన..

మన రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులు కోటి మందికి పైగా ఉన్నారు. వీరిలో ముఠా కార్మికులు 7 లక్షలు, బిల్డింగ్ కార్మికులు 9 లక్షలు, హాకర్స్ 3 లక్షలు, ఆటో, లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు 15 లక్షలు, హోంబేసిడ్ వర్కర్స్ 4 లక్షలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 3 లక్షలు, పరిశ్రమలలో కాంట్రాక్టు కార్మికులు, స్కీం వర్కర్లు 4 లక్షలు, కోటి మంది వ్యవసాయ కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత కల్పించాలని, పనిభద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ తదితర పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని రాష్ట్ర మహాసభ ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.

కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణకు...

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణకు జరుగుతున్న పోరాటాలకు సిపిఎం సంపూర్ణ మద్ధతు తెలియజేసింది. విశాఖపోర్టు, విశాఖ స్టీల్, హిందుస్తాన్ పెట్రోలియం, షిప్‌యార్డ్, భెల్, ఒఎన్‌జిసి, ఎన్‌టిపిసి, ఇన్యూరెన్స్, బిఎస్ఎన్ఎల్, బిడిఎల్ వగైరా పరిశ్రమలతో రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధి కల్పనకు తోడ్పడ్డాయి. గత మూడేళ్ళ నుంచి కేంద్ర బిజెపి ప్రభుత్వం, ప్రభుత్వ రంగానికి వ్యతిరేకంగా దూకుడు పెంచింది. ప్లానింగ్ కమీషన్‌ను రద్దుచేసి నీతి అయోగ్ ద్వారా వేగంగా ప్రైవేటీకరించటానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు చావడానికే పుట్టాయని ప్రధాన మంత్రి మోడీ ప్రకటించారు. ప్రభుత్వరంగంతోపాటు, కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, రక్షణ రంగాల్లో నూరుశాతం వాటాలు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విదేశీ కంపెనీలకు వాటాలు అమ్మితే లాభాలు విదేశాలకు తరలి పోతాయి. దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.

విశాఖపట్నంలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ)ను పూర్తిగా ప్రైవేట్‌కు అమ్మేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. దీనికి వ్యతిరేకంగా నెలల తరబడి ప్రజలు, కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడుతున్నాయి. దేశాభివృద్ధికి తోడ్పాడే ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం కాకుండా ఐక్యంగా పోరాడాలని కార్మిక వర్గానికి, ప్రజలకు సిపిఎం విజ్ఞప్తి చేస్తున్నది.

మహిళలపై నేరాలను అరికట్టాలి

సిపిఎం రాష్ట్ర మహాసభల్లో తీర్మానం

ప్రజాశక్తి- పర్స సత్యనారయణ నగర్ (భీమవరం)

మహిళలపై బహుముఖంగా పెరుగుతున్న నేరాలను అరికట్టాలని సిపిఎం 25వ రాష్ట్ర మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభలో సోమవారం ఈ మేరకు తీర్మానించారు. ఆర్‌ఎస్ మాధురి ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డి రమాదేవి బలపరిచారు. విద్యార్థి దశలో ఎదురయ్యే వెకిలి చేష్టలు, ప్రేమ పేరిట వేధింపులు, ఉన్మాదుల దాడుల వల్ల అమ్మాయిలు అభద్రతా భావంతో జీవించాల్సి వస్తోంది. ఇంటా, బయటా వేధింపులకు గురవుతున్న మహిళలు నిస్సహాయత, అభద్రత కారణంగా చట్టాలను 68.9 శాతం మంది వినియోగించుకోలేక పోతున్నారు. మద్యం విచ్చలవిడి అమ్మకాల వల్ల తప్పతాగిన మత్తులో విచక్షణ కోల్పోయి వావివరసలు మరిచి అత్యాచార ఘటనలకు పాల్పడుతున్నారు. మరోపక్క ఒంటరి మహిళల సంఖ్య పెద్ద ఎత్తున పెరుగుతోంది. వీరికి ఎటువంటి రక్షణా లేదు. ప్రభుత్వం కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవటంతో ఒంటరిగా, దిక్కులేనివారిగా వీరు జీవిస్తున్నారు. ప్రభుత్వం వీరికి నెలకు రూ.2వేలు పెన్షను, రేషన్ కార్డు ఇవ్వడంతో పాటు పక్కా గృహాల్ని నిర్మించి ఇవ్వాలి. అదేవిధంగా చిరు వ్యాపారాలు చేసుకోవడానికి వడ్డీలేని బ్యాంకు రుణాల్ని మంజూరు చేయాలి. గృహ హింస, లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు, నిర్భయ, అత్యాచార నిరోధక చట్టాలు అమలుకై విస్తృత క్యాంపెయిన్ నిర్వహించాలి. మహిళలు, బాలికలపై జరిగే అత్యాచారాలు వేధింపుల నేరాలను తీవ్రంగా పరిగణించి ఆ కేసులపై ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర విచారణ చేపట్టాలి. సినిమాలు, టివీల్లో వస్తున్న అశ్లీల, అసభ్య చిత్రాలను, వివక్షాధోరణులను నిరోధించాలి. మహిళలపై హింసను పెంచే మద్యం అమ్మకాలను నియంత్రించాలి. మహిళల హక్కులు మానవ హక్కులుగా పరిగణించేలా కషి చేయ్యాలి. మహిళలలో అన్యాయాన్ని ఎదుర్కొనే ఆత్మస్థైర్యాన్ని, శక్తీ సామర్ధ్యాలను పెంపొందించాలి, ఆత్మరక్షణకు అవసరమైన శిక్షణ ఇవ్వాలి.

గిరిజనుల గిరి దీక్ష

ప్రజాశక్తి - సీతంపేట (శ్రీకాకుళం)

బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ గిరిజన ఐక్యవేదిక ఆధ్వరాన గిరిజనులు శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలంలోని మెట్టుగూడ జలపాతం వద్ద సోమవారం గిరి దీక్ష చేపట్టారు. మండల కేంద్రంలో ఉన్న అడవితల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి గిరిజన సంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ర్యాలీగా మెట్టుగూడ జలపాతం వద్దకు వెళ్లి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు వివేక్ వినాయక్ మాట్లాడుతూ బోయ, వాల్మీకి ఇతర కులాలను ఎస్‌టిల్లో చేర్చే తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన సంప్రదాయాలు, ఇతర కులాల సంప్రదాయాలు పూర్తిగా భిన్నమన్నారు. ఎస్‌టి జాబితాలోకి అభివృద్ధి చెందిన కులాలను చేరిస్తే, గిరిజనులకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమైన గిరి దీక్షలు అన్ని జిల్లాల్లోనూ చేపడతామని వెల్లడించారు. దీక్షల్లో పాలకొండ వైసిపి ఎమ్మెల్యే వి.కళావతి, ఖమ్మం, నాగూరు మాజీ ఎమ్మెల్యేలు చందాల లింగయ్య, నిమ్మక జయరాజ్, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మందుపాతర పేలి జవాను మృతి

ప్రజాశక్తి - చింతూరు(తూర్పుగోదావరి)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి 389 బెటాలియన్‌కు చెందిన జవాను సోనేధార్ హేమ్‌లా (28) సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం డిఆర్‌జి బెటాలియన్ గంగలూరు, తిప్పాపురం అటవీ ప్రాంతంలో సోమవారం కూంబింగ్ నిర్వహించింది. గంగులూరు అటవీ ప్రాంతంలో ప్రయాణిస్తుండగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలింది. ఈ ప్రమాదంలో హేమ్‌లా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని రాయ్‌పూర్‌కు తరలించారు. పోలీసులు, అధికారులు ప్రభుత్వ లాంఛనాలతో హేమ్‌లాకు నివాళు ల అర్పించారు.

ముదిరాజ్‌లను ఎస్‌టిల్లో చేర్చాలి

ప్రజాశక్తి - నెల్లూరు

బిసిలుగా ఉన్న ముదిరాజ్‌లను ఎస్‌టిల్లో చేర్చాలని ఎపి ముదిరాజ్ మహాసభ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.రఘురామ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆమని గార్డెన్స్‌లో జిల్లా యువత కార్యవర్గ సమావేశం నిర్వహిం చారు. తొలుత వారు అయ్యప్ప గుడి నుంచి ఆమని గార్డెన్స్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సందర్భంగా బిసిలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ నేటికీ అమలు కాలేదన్నారు. రాష్ట్రంలోని ముదిరాజ్‌లకు 2019 ఎన్నికల్లో రెండు ఎంపి, ఆరు శాసనసభ స్థానాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు నారాయణరావు, రాష్ట్ర కార్యదర్శి పిఎల్ రావు, జిల్లా అధ్యక్షులు గుద్దేటి ఎల్లయ్య, ఎన్. పెంచలయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి

ప్రజా సంక్షేమానికే పెద్దపీట

డిప్యూటీ సిఎం కెఇ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం అర్బన్

ప్రజా సంక్షేమానికే టిడిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి కెఇ.కృష్ణమూర్తి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో అభివృద్ధి, సంక్షేమ, కార్యక్రమాల అమలు తీరుపై ఆయన అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాలవారీగా అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజలకు మరింత చేరువలో ప్రభుత్వ అధికారులు ఉండేలా ఈ సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. జన్మభూమి కమిటీల పనితీరు బాగుంటే కొనసాగించాలని, లేకుంటే తక్షణం మార్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. కాపు రిజర్వేషన్ల అంశంపై ఎమ్మెల్యేల వ్యక్తిగత అభిప్రాయాలను తెలుసుకుని ముఖ్యమంత్రికి నివేదిక అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖమంత్రి కెఎస్.జవహర్, రాజమహేంద్రవరం ఎంపీ మురళీమోహన్, గుడా చైర్మన్ గన్నికృష్ణ, మేయర్ పంతం రజనీశేషసాయి, ఎంఎల్ఎ ఆకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా మంగినపూడి బీచ్

మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ (కృష్ణా)

కృష్ణా జిల్లాలో మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం తాళ్ళపాలెం పంచాయతీ మంగినపూడి బీచ్‌లో రూ.2.50 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ వద్ద ఇప్పటివరకు రూ.2 కోట్ల నిధులతో మెరక పనులు చేయించామన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ పథకం ద్వారా 80 ఎకరాల్లో నాలుగున్నర అడుగుల ఎత్తు మెరక తరలించామని తెలిపారు. బీచ్ వద్ద 630 మీటర్ల పొడవు గల సిసి రోడ్డును నిర్మించడంతోపాటు దీనికి అనుగుణంగా రిటైనింగ్ గోడ నిర్మించామని వివరించారు. పార్కింగ్ ఏరియా అభివృద్ధి, బీచ్ వద్ద 350 మీటర్ల పొడవు గల డబ్ల్యుఎంఎం నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు. మే నెలలో చేపట్టనున్న బీచ్ ఫెస్టివల్‌కు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కాగిత వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి ఊసా వెంకట సుబ్బారావు, జడ్‌పిటిసి లంకె నారాయణప్రసాద్, ఎంపిటిసి బి.నాగమల్లేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ చిలంకుర్తి సుబ్రహ్మణ్యం, టూరిజం డిఇ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో పోలీసు సేవలు : డిజిపి

ప్రజాశక్తి - అవనిగడ్డ (కృష్ణా)

ప్రజలకు చేరువలో ఉంటూ అధునాతన, సాంకేతిక నాణ్యమైన సేవలు అందించటానికి పోలీసుశాఖ కృతనిశ్చయంతో పనిచేస్తుందని డిజిపి ఎ.మాలకొండయ్య తెలిపారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలో రూ.1.50 కోట్లతో నిర్మించనున్న మోడల్ పోలీసుస్టేషన్ భవన నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మోపిదేవిలోనూ పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎంపిపి మోర్ల విజయలక్ష్మి ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో డిజిపికి వినతిపత్రం అందజేశారు. పోలీసుస్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, అక్కడ ఉన్న ఆర్‌టిసి బస్టాండు స్థలాన్ని పోలీసుస్టేషన్‌కు ఇస్తున్న దృష్ట్యా చల్లపల్లిలోని విజయవాడ రోడ్డులో బస్‌షెల్టర్ ఏర్పాటుకు స్థలం ఇచ్చేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉపసభాపతి బుద్ధప్రసాద్, ఎపి హౌసింగ్ సొసైటీ చైర్మన్ నాగుల్‌మీరా, ఎంపి నారాయణరావు మాట్లాడారు.



కృష్ణా జిల్లా అవనిగడ్డలో మోడల్ పోలీసుస్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డిజిపి మాలకొండయ్య, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తదితరులు

ఉద్యోగ భద్రత కల్పించాల్సిందే

- సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల డిమాండ్

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల రిజిస్టర్డ్ యూనియన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం పలుజిల్లాల్లో ర్యాలీలు, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు.

విశాఖలో ఎస్ఎస్ఎ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఆర్.రాజాచంద్ర మాట్లాడుతూ, సర్వశిక్షా అభియాన్‌లో అన్ని విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వీరికి సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజ్‌కుమార్ మద్దతు ప్రకటించారు. గుంటూరులోని ప్రాజెక్ట్ కార్యాలయం నుండి జిల్లా పరిషత్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 'మీ-కోసం'లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఐఎస్ కో-ఆర్డినేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి.శ్రీహరిబాబు మాట్లాడారు. కర్నూలులో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హాలు నుంచి కర్నూలు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి-2 రామస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతపురంలో సర్వశిక్ష అభియాన్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం మీ కోసంలో కలెక్టర్ వీరపాండియన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రజ్ఞ

జవాబులు

1. గోండులు (వీరి సంఖ్య 40 లక్షలు)
2. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్
3. డా. అక్కినేని నాగేశ్వర్‌రావు, 4. కెనడా. (దీని తీరరేఖ పొడవు 2,02,080 కి.మీ.)
5. ది హాంగ్

ప్రతి పైసా అర్హులకే : కారెంశివాజీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (మచిలీపట్నం)

సబ్‌ప్లాన్ నిధులు ప్రతిపైసా ఆయా వర్గాలకు చెల్లించే విధంగా అధికారులు కృషి చేయాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ చెప్పారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎపి మత్స్యశాఖ, ఎస్సీ, ఎస్టీ, మత్స్యసహకార సంఘాల ప్రతినిధులతో సోమవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కోట్లాది రూపాయలు కేటాయిస్తోందన్నారు. సబ్‌ప్లాన్ నిధులు మార్చి 31వ తేదీ కల్లా పూర్తిస్థాయిలో వినియోగించాలని కోరారు. అవసరమైతే జనరల్ బడ్జెట్ నుంచి నిధులు ఖర్చుచేయాలన్నారు. గత సంవత్సరం మిగులు బడ్జెట్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేయాలని కోరారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద కృష్ణా జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.8.75 కోట్లు కేటాయించగా, ఇప్పటికీ రూ.5.95కోట్లు ఖర్చుచేశారన్నారు.

విద్యుత్ సంస్థకు నష్టం కలిగిస్తే చర్యలు

- ఎపి ట్రాన్స్‌కో జెఎండి పి.ఉమాపతి హెచ్చరిక

ప్రజాశక్తి - కడప

విద్యుత్ సంస్థకు నష్టాలు కలిగించే పద్దతుల్లో అధికారులు పనిచేస్తే చూస్తే ఊరుకోబోనని, వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటూ వేటు తప్పదని ఎపి ట్రాన్స్‌కో జెఎండి పి.ఉమాపతి హెచ్చరించారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఎనర్జీ ఆడిటింగ్, విద్యుత్ చౌర్యం, సంస్థలో జరుగుతున్న విద్యుత్ నష్టాలపై జిల్లాలోని విద్యుత్ అధికారులు, డిఇలు, ఎడిఇలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమావేశంలో పాల్గొన్న డిఇ, ఎడిఇలను తమ పనితీరు ఎలా ఉందని అడిగారు, కొందరి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచైనా సక్రమంగా పనిచేయాలని, సంస్థను నష్టాల నుంచి గట్టెంక్కించే విధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆదేశించారు. జిల్లా అంతటా దీన్‌దయాల్ పథకం కింద సర్వీసులను ఇచ్చినా విద్యుత్ నష్టాలు తగ్గకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహిస్తానని, వచ్చే సమావేశం నాటికి విద్యుత్ నష్టాలను తగ్గించి చూపేలా అధికారులందరూ పనిచేయాలన్నారు. సమావేశంలో ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ ఇంజినీర్ నందకూమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ మనోహర్, కడప ఆపరేషన్ సర్కిల్ ఎస్ఇ ముమ్మడి శివప్రసాద్‌రెడ్డి, ఎపిటిఎస్ సిఐ పి.గౌతమి, డిపిఇ ఎస్ఇ సురేష్‌కుమార్, డిఇలు, ఎడిఇలు పాల్గొన్నారు.

సమావేశం

ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలి : ముద్రగడ

ప్రజాశక్తి - కావలి (నెల్లూరు)

ఎపిలో బలిజ, కాపు, ఒంటరి,తెలగ కులాల జనాభాను రీ-సర్వే చేయించాలని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన తిరుపతి నుంచి వస్తూ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలోని బలిజ కాపు సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షులు మెతుకు రాజేశ్వరిని కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన 5శాతం రిజర్వేషన్‌ను బలిజ కులస్తులకు అమలు చేయాలని కోరారు. తొలుత స్థానిక తహశీల్దార్ కార్యాలయాల్లో బి.సి.(ఎఫ్) కులధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో యూనివర్సిటీల్లో, ఇతర విద్యా సంస్థల్లో దాదాపు 50వేల పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిసిందన్నారు. ఆయా పోస్టుల్లో రిజర్వేషన్ ప్రకారం తమ బలిజ బిడ్డలకు ఉద్యోగాలివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. బలిజల రిజర్వేషన్ బిల్లుకు మార్చి 31వతేదీ లోగా పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలంటే ముఖ్యమంత్రి, రాష్ట్ర ఎంపిలు, మంత్రులు అందరూ రాజీనామా చేసి రోడ్డుకెక్కితే తప్ప కుండా కేంద్రప్రభుత్వం స్పందింస్తుం దన్నారు. ఇప్పటి వరకూ ముఖ్యమంత్రిని కలిసేందుకు అనుమతి లభించలేదన్నారు. అనుమతి దొరికిన వెంటనే ముఖ్యమంత్రిని కలవడం జరుగుతుందని తెలిపారు.ఆ తర్వాత వైసిపి నేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని కూడా కలుస్తామన్నారు. ఆయన వెంట ఆకుల రామకృష్ణ, విష్ణు, కాపు, బలిజ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షులు మెతుకు రాజేశ్వరి, అళహరి కొండయ్య, స్థానిక కాపు నాయకులు చింతాల వెంకటరావు, చలపతి, పాలడుగు వెంకటేశ్వర్లు, వై.హరిప్రసాద్, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.



నెల్లూరు జిల్లా కావలిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

పలు పార్టీల సంఘీభావం

ప్రజాశక్తి - యంత్రాంగం

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేసేంత వరకు ఉద్యమిస్తామని న్యాయవాదులు పేర్కొన్నారు కడపలో న్యాయవాదుల నిరవధిక, రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. కడప జిల్లా కోర్టు ఎదుట న్యాయవాది రమణారెడ్డి చేపట్టిన నిరవధిక దీక్ష సోమవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. రిలే నిరాహార దీక్షలు 21వ రోజుకు చేరుకున్నాయి.

దీక్షలకు రైల్వేకోడూరు శాసన సభ్యులు కొరముట్ల శ్రీనివాసులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ వ్యాప్తంగా గత నెల రోజులుగా న్యావాదులు వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. వికలాంగులు ర్యాలీగా వచ్చి న్యాయవాదులకు సంఘీభావం తెలియజేశారు. రాయలసీమలో హైకోర్టును తప్పక ఏర్పాటు చేయాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకునేలా చూడాలని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి న్యాయవాదులు వినతిపత్రం సమర్పించారు. కర్నూలులో వెంటనే హైకోర్టును ఏర్పాటు చేయాలని కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు ధర్నాచౌక్‌లో న్యాయవాదుల చేస్తున్న రిలే దీక్షలు సోమవారం 23వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డిని న్యాయవాదులు కలిసి మద్దతు ప్రకటించారు. హైకోర్టు సాధన సమితి ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. వీరి దీక్షలకు పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు మద్దతుగా పాల్గొన్నారు.

అది సైన్యంతో పోలిక కాదు

మోహన్ భగత్ వ్యాఖ్యలపై ఆరెస్సెస్ వివరణ

న్యూఢిల్లీ : సైన్యం సన్నద్ధం కావాలంటే ఆరు నెలలు పడుతుందని, అదే తమ కార్యకర్తలకైతే మూడు రోజులు చాలని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగత్ చేసిన వ్యాఖ్యలు సైనిక దళాలను కించపరిచేవిగా వున్నాయని ఆగ్రహం వ్యక్తమైన నేపథ్యంలో సంఘ్ పరివార్ వివరణ ఇచ్చుకుంది. భగత్ వ్యాఖ్యలు వక్రీకరించబడ్డాయని అఖిల భారత ప్రచార్ ప్రముఖ్ మన్మోహన్ వైద్య తెలిపారు. అవసరమైన పరిస్థితుల్లో రాజ్యాంగం అనుమతిస్తే దేశంకోసం సిద్ధమయ్యేందుకు సైన్యానికి ఆరు నెలలు పడుతోందని, అయితే స్వయం సేవకులు తగిన రీతిలో శిక్షణ పొందుతారు కనుక తక్కువ సమయంలోనే సన్నద్ధం కాగలరని ఆయన చెప్పినట్లు వైద్య పేర్కొన్నారు.

ప్రముఖుల భేటీ



మస్కట్‌లో సోమవారం గల్ఫ్ దేశాలలోని పారిశ్రామిక ప్రముఖులతో ప్రధాని మోడీ భేటీ అయ్యారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు.

భారత్ ఒక ఆకర్షణీయమైన వాణిజ్య దేశం

మస్కట్ పారిశ్రామిక ప్రముఖులతో మోడీ

మస్కట్ : విదేశీ వాణిజ్యానికి భారత్ ఒక ఆకర్షణీయమైన ప్రదేశమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. మస్కట్‌లో జరిగిన భారత్-ఒమన్ వాణిజ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గల్ఫ్-పశ్చిమాసియా ప్రాంత పారిశ్రామిక ప్రముఖులను సోమవారం ఆయన కలుసుకున్నారు. ప్రధాని మోడీ ఆదివారం దుబాయ్ నుంచి మస్కట్ చేరుకున్నారు తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరి మజిలీగా మస్కట్ చేరుకున్నారు. సోమవారం ఒమెన్ ఉప ప్రధాన మంత్రి సయ్యాద్ అస్సాద్ బిన్ తరీఖ్ అల్ సయిద్‌తో సమావేశమయ్యారు. పరస్పర ప్రయోజనకర రంగాలలోద్వైపాక్షిక సహకారంపై నేతలిరువురూ చర్చించారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ ట్వీట్ చేశారు. "నాలుగు రోజుల్లో నాలుగు దేశాలు పర్యటించి, చివరిగా మస్కట్‌లో ఒమన్-ఇండియా వాణిజ్య సమావేశంతో పాల్గొన్నారు. వాణిజ్య సంబంధాలు పెంపొందించుకొనేందుకు భారత్ ఒక ఆకర్షణీయమైన దేశంగా పేర్కొన్నారు. మన విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని వివరించారు." అని ట్వీట్ చేశారు. చివరగా ప్రధాని మోడీ మస్కట్‌లోని చారిత్రాత్మక దేవాలయాన్ని, ప్రసిద్ధ సుల్తాన్ కబూస్ మసీదును సందర్శించి అనంతరం ఢిల్లీకి తిరుగు పయనమయ్యారు.

నాగాలాండ్ ఎన్నికల్లో సెక్యులర్ అభ్యర్థులకు మద్దతు : కాంగ్రెస్

కోహిమా : నాగాలాండ్‌కు జరిగే అసెంబ్లీ ఎన్నికలలో తాము పోటీ చేయని స్థానాలలో సెక్యులర్ పార్టీ అభ్యర్థులకు మద్దతిస్తామని కాంగ్రెస్ తెలిపింది. బిజెపితో పాటు దాని భాగస్వామ్య పార్టీలు అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు లౌకిక పార్టీ అభ్యర్థులకు మద్దతివ్వనున్నట్లు నాగాలాండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి (ఎన్‌పిసిసి) ఒక ప్రకటనలో తెలిపింది. నాగాలాండ్ అసెంబ్లీకి ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు గాను కాంగ్రెస్ 19 స్థానాల్లో పోటీ చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ తరుపున 20 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. వీరిలో ఒకరు తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. కాగా నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి)తో కలిసి బిజెపి కూటమిగా ఏర్పడింది. మూడు సార్లు ముఖ్య మంత్రిగా పనిచేసిన సిట్టింగ్ ఎంపి నీఫి రియో నేతృత్వంలో ఈ కూటమి ఏర్పడింది. బిజెపి-ఎన్‌డిపి కూటమి 20 నుంచి 40 స్థానాలలో పోటీ చేయనున్నది.

లైంగిక దాడిని ప్రతిఘటించిన బాలిక సజీవ దహనం

రాజగఢ్: తనపై చేసిన లైంగిక దాడి యత్నాన్ని ఎదిరించిన ఓ బాలికపై కిరోసిన్ పోసి నిప్పుపెట్టాడో ప్రబుద్ధుడు. మధ్యప్రదేశ్‌లోని ఓ గ్రామంలో జరిగిన ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన బాధితురాలిని వైద్యచికిత్సకుతరలించి, ఆ యువకుడిన అరెస్ట్ చేశారని అధికారులు చెప్పారు. ఈ దాడిలో బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయని, ఆమె రాజ్‌గఢ్‌లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నదని, ఆమె పరిస్థితి విషమంగా వున్నట్లు వైద్యులు చెప్పారని అధికారులు వివరించారు. దాడి చేసిన వెంటనే ఆ యువకుడు పరారైనప్పటికీ గాలింపు చేపట్టిన పోలీసులు మరుసటి రోజు అతడిని అరెస్ట్ చేశారు. కుటుంబ సభ్యులు పొలంపనులకు వెళ్లటంతో ఆ బాలిక ఇంట్లో ఒంటరిగా వుండటాన్ని గమనించిన ఆ యువకుడు ఇంట్లో ప్రవేశించి ఆమెపై దాడికి యత్నించాడని పోలీసు అధికారి ఇంద్రరాజ్‌సింగ్ చెప్పారు. ఆమె ఎదురు తిరగటంతో అక్కడే వంట కోసం నిల్వ చేసుకున్న కిరోసిన్‌ను ఆమెపై పోసి నిప్పుపెట్టాడన్నారు. ఈ మేరకు అతడిపై కేసునమోదు చేసిన పోలీసులు అతడిని ఆదివారం రాత్రి ఆరెస్ట్ చేశారని రాజ్‌గడ్ సీనియర్ పోలీసు అధికారి ధృవీకరించారు.

చిక్కుల్లో విజయ్ మాల్యా

లండన్: భారత్‌లో బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని ప్రస్తుతం బ్రిటన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న పారిశ్రామిక వేత్త విజయ్ మాల్యాకు బ్రిటన్‌లో చిక్కులెదురయ్యాయి. గతంలో మాల్యా నిర్వహించిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు, సింగపూర్‌కు చెందిన బిఓసి వివాదంలో 9 కోట్ల డాలర్ల క్లయిమ్‌లను చెల్లించాల్సిందేనని బ్రిటన్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బిఓసి సంస్థ నుండి కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌సంస్థ ఒక విమానాన్ని లీజుకు తీసుకుని బకాయి పడింది. ఈ కేసును విచారించిన వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పికెన్ ఈ నెల 5న ఈ మేరకు తీర్పును వెలువరించారు.

అసెంబ్లీలో జయ 'ఫొటో' పెట్టొద్దు

చెన్నై : అక్రమాస్తుల కోసులో దోషిగా వున్న మాజీ ముఖ్యమంత్రి జయలలిత చిత్రపటాన్ని అసెంబ్లీ హాల్‌లో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు సోమవారం ఆందోళన చేపట్టాయి. డిఎంకె, కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీల నేతలు ఆ కార్యక్రమాన్ని బహిష్కరించారు. సోమవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం ఆమె చిత్రపటాన్ని ఏర్పాటుచేయడంతో, రాష్ట్రానికి విశేష సేవలందించిన ప్రముఖులు సిఎన్. అన్నాదురై, ఎంజి. రామచంద్రన్ వంటి నేతల మధ్య ఆమె ఫోటోను ఏర్పాటుచేయరాదని విపక్షాలు పట్టుపట్టాయి. అసెంబ్లీ చరిత్రలో ఈరోజు బ్లాక్‌డేగా నిలిచిపోతుందని ప్రధాన ప్రతిపక్షమైన డిఎంకె నేత స్టాలిన్ ట్విటర్‌లో పేర్కొన్నారు. ఈ చర్య సభ గౌరవానికి, పవిత్రతకు భంగకరమని తెలిపారు. కాగా, దీనిపై డిఎంకె ఎంఎల్‌ఎ ఒకరు మద్రాసు హై కోర్టులో పిటిషన్ కూడా వేశారని, అయినా స్పీకర్ పట్టించుకోలేదని తెలిపారు. పాలక అన్నాడిఎంకె నేతల తీరును సిపిఐ(ఎం), పిఎంకె వంటి పలు ప్రతిపక్ష పార్టీలు కూడా తీవ్రంగా తప్పుపట్టిన సంగతి తెలిసిందే. అక్రమాస్తుల కేసులో దోషిగా ఉన్న వ్యక్తి ఫోటోను అసెంబ్లీలో ఆవిష్కరించడం తప్పుడు సంకేతాన్నిస్తుందని, ఈ కార్యక్రమాన్ని నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జి. రామకృష్ణన్ పేర్కొన్నారు.

హిమాచల్ మాజీ సిఎం వీరభద్రకు సమన్లు

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్, ఆయన భార్యకు మనీలాండరింగ్ కేసులో ప్రత్యేక కోర్టు సోమవారం సమన్లు జారీ చేసింది. వీరిద్దరితో పాటు మరో ముగ్గురికి కూడా సమన్లు జారీ చేసింది. సుమారు రూ.7కోట్ల మేరకు మనీలాండరింగ్‌కు పాల్పడిన కేసులో వీరు నిందితులుగా ఉన్నారు. నేరానికి సంబంధించి ప్రాథమికంగా తగిన సాక్ష్యాధారాలున్నాయని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంతోష్ స్నేహి మన్ పేర్కొన్నారు. నిందితులు మార్చి 22న తన ఎదుట హాజరు కావాలని ఆదేశించారు. తన భార్యతోనూ, ఇతరులతోనూ కలిసి వీరభద్ర సింగ్ రూ.7 కోట్ల వ్యవసాయ ఆదాయాన్ని రహస్యంగా దారి మళ్లించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆరోపించింది. ఆ మొత్తాన్ని ఎల్‌ఐసి పాలసీల కొనుగోలులో పెట్టుబడులుగా పెట్టినట్లు పేర్కొంది. వీర భద్ర సింగ్, ఆయన భార్య ప్రతిభా సింగ్‌తో పాటు యూనివర్సల్ యాపిల్ అసోసియేట్ యజమాని చున్నీలాల్ చౌహాన్, ఇద్దరు సహ నిందితులు ప్రేమ్ రాజ్ అండ్ లావాన్ కుమార్ రోచ్‌లకు కూడా కోర్టు సమన్లు జారీ చేసింది.

న్యాయ విద్యార్థి హత్యకు నిరసనగా అలహాబాద్ వర్సిటీ విద్యార్థుల ఆందోళన



- బస్సు దగ్ధం

అలహాబాద్ : ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో న్యాయ విద్యార్థి దిలీప్ సరోజ్ హత్యను నిరసిస్తూ అలహాబాద్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. విద్యార్థుల నిరసన నినాదాలతో వీధులన్నీ హోరెత్తాయి. తమ ఆందోళనలో భాగంగా ఒక బస్సుకు నిప్పు పెట్టారు. అలహాబాద్‌లోని ఒక రెస్టారెంట్ వద్ద శుక్రవారం 26 ఏళ్ళ న్యాయ విద్యార్థిని కొంతమంది దుండగులు హత్య చేసిన సంగతి తెలిసిందే. పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అదుపు చేశారు. అలహాబాద్‌లో ఒక రెస్టారెంట్‌లోకి ప్రవేశిస్తున్న ప్రధాన నిందితుడు విజయ్ శంకర్ సింగ్‌ను లోపలి నుండి వస్తున్న దిలీప్ సరోజ్ యాదృచ్ఛికంగా ఢీ కొన్నాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ ప్రారంభమైంది. శంకర్ సింగ్ హాకీ స్టిక్, ఐరన్ రాడ్లతో దిలీప్ సరోజ్‌పై దాడి చేశాడు. ఈ దాడిని అటుగా వెళుతున్న ఒక వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించాడు. స్పృహతప్పి పడిపోయిన దిలీప్ సరోజ్ శనివారం ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి రెస్టారెంట్ వెయిటర్ మున్నా చౌహాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చౌహాన్ ఐరన్ రాడ్‌తో దిలీప్ తలపై కొట్టాడు. ఇదే అతని మృతికి కారణమైంది. పోలీసులు రెస్టారెంట్ నుంచి సేకరించిన సిసిటివి పుటేజ్‌లను విడుదల చేశారు.

సిపిఎం నేత

మహ్మద్ అమీన్ కన్నుమూత

సిపిఎం పొలిట్ బ్యూరో ఘన నివాళి



ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ : ప్రముఖ కమ్యూనిస్టు, ట్రేడ్ యూనియన్ నాయకులు మహ్మద్ అమీన్ సోమవారం మధ్యాహ్నం కోల్‌కతాలో మృతి చెందారు. ఆయన వయస్సు తొంభై సంవత్సరాలు. అమిన్ మృతిపట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఆయన మృతి పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీవ్ర లోటని ఘనంగా నివాళులు అర్పించింది. అయన ముగ్గురు సంతానానికి ప్రగాఢ సానుభూతి తెలిపింది.

1928 ఏప్రిల్ 15న కోల్‌కతాలో జన్మించిన అమీన్ పేదరికంగా కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి తల్లిదండ్రులతో వలస వెళ్లారు. పేదరికంతో విద్యాభ్యాసం కొనసాగించలేక 14 ఏళ్ల వయస్సులోనే జూట్ మిల్లులో పనిచేయడం ప్రారంభించారు. అక్కడ కొద్దికాలంలోనే ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో చేరి తరువాత బెంగాల్ జూట్ మిల్ మజ్దూర్ యూనియన్‌లో సభ్యులుగా మారారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కమ్యూనిజం వైపు ఆకర్షితులై 1946లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. దేశ విభజన సమయంలో పార్టీ సూచనలతో తూర్పు పాకిస్తాన్ వెళ్లారు. అక్కడ ఉద్యమాలకు నేతృత్వం వహించడంతో అమీన్‌కు జైలు శిక్ష విధించారు. విడుదలైన తరువాత ఆయన పశ్చిమ బెంగాల్‌కు తిరిగి వచ్చారు. అక్కడ బార్రాక్‌పూర్ పారిశ్రామిక ప్రాంతంలో జూట్, బీడీ, ఇతర కార్మికుల పక్షాన పోరా టాలు నడిపారు. ఆయన తన జీవితాన్నంతా కార్మిక వర్గ పోరాటాలకే అంకితం చేశారు.

1955లో సిపిఎం 24 పరగణాల జిల్లా కమిటీకి ఎన్నికయ్యారు. 1971లో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1985లో జరిగిన పార్టీ 12వ మహాసభలో కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 2008లో పార్టీ పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. 2012లో జరిగిన పార్టీ 20వ మహాసభ సందర్భంగా కేంద్ర కమిటీకి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

12వ భారత ట్రేడ్ యూనియన్ల సదస్సులో ప్రధాన కార్యదర్శిగా అమీన్ ఎన్నికయ్యారు. తరువాత ఉపాధ్యక్షులు గానూ సేవలు అందించారు.

1969లో తితాగర్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ఎన్నికైన అమిన్, 1970లో అజయ్ ముఖర్జీ ప్రభుత్వంలో రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1971 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. 1977లో మరో సారి అసెంబ్లీకి ఎన్నికైన అమిన్ తొలి లెఫ్ట్ ప్రభుత్వంలో రవాణా మంత్రిగా భాధ్యతలు స్వీకరించారు. 1996 నుంచి 2006 వరకూ మైనార్టీల అభివృద్ధి శాఖా మంత్రిగానూ, కార్మిక మంత్రిగానూ అయన బాధ్యతలు నిర్వహించారు. 1988 నుంచి 1994 రాజ్యసభ సభ్యులుగా వ్యవహరించారు.

తమ రాజకీయ జీవితంలో రెండు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించిన అమిన్, మరో రెండేళ్ళపాటు అజ్ఞాతంలో వున్నారు. రచనా రంగంలోనూ అమీన్ తన గుర్తింపు చాటుకున్నారు. అయన రచించిన అనేక పద్యాలు పుస్తక రూపంలో వచ్చాయి. అలాగే సిపిఎం పశ్చిమ బెంగాల్ ఉర్దూ పత్రిక కిసాన్ మజ్దూర్‌కు అమీన్ సంపాదకులుగానూ పనిచేశారు. అమీన్ చాలా నిరాడంబర జీవితం గడిపారు. అయన ఎల్లప్పుడూ అణగద్రొక్కబడినవారి దుస్థితి గురించి అలోచించేవారు.

ఎపి రాష్ట్ర మహాసభ ఘన నివాళి

ప్రజాశక్తి - పర్సాసత్యనారాయణ నగర్ (భీమవరం)

అమీన్ మృతికి భీమవరంలో జరుగుతున్న సిపిఎం 25వ రాష్ట్ర మహాసభ ఘన నివాళి అర్పించింది. సంతాప తీర్మానాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ ప్రవేశపెట్టగా ప్రతినిధులు సంతాప సూచికంగా లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అమీన్‌కు విప్లవ జోహార్లు అర్పించారు.

సరిహద్దు దాడులు చేస్తే సహించం

భారత్‌కు పాక్ బెదిరింపులు

ఇస్లామాబాద్/శ్రీనగర్ : కాశ్మీర్‌లో సైన్యంపై దాడి జరిగిందన్న సాకుతో తమ సరిహద్దులపై దాడి చేస్తే సహించబో మని పాక్ బెదిరింపులకు దిగింది. జమ్మూ సమీపంలోని సైనిక శిబిరంపై పాకిస్తాన్‌కు చెందిన జైషేమహ్మద్ ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఐదుగురు భారత సైనికులు, మరణించగా కొంతమంది సాధారణ పౌరులు గాయపడిన విషయం తెలిసిందే. సైనిక శిబిరం సమీపంలో వున్న క్వార్టర్స్‌పై దాడి చేసిన సాయుధులందరూ పాకిస్తాన్‌కు చెందిన జైషేమహ్మద్ మిలిటెంట్ గ్రూప్‌కు చెందిన వారేనని భారత్ పేర్కొంది. దీనిపై స్పందించిన పాకిస్తాన్ పూర్తిగా విచారించకుండా ఒక నిర్ణయానికి రావటం తొందరపాటని భారత్‌పై ఎదురు దాడికి దిగింది. భారత భూభాగంలో ఏ ఘటన జరిగినా సరైన విచారణ జరిపించకుండా అవాస్తవా లతో బాధ్యతారహిత ప్రకటనలు చేయటం భారత నేతలకు అలవాటుగా మారిపోయిందని పాక్ విదేశాంగశాఖ ఆరోపిం చింది. కాశ్మీరీలలో తిరుగు బాటును అణచివేసేందుకు సైన్యం చేపడుతున్న కిరాతక చర్యల నుండిదృష్టిని మళ్లించేందుకే భారత్ ఈ విమర్శలు చేస్తోందని, సరిహద్దుల వెంట ఎటువంటి ప్రతీకార దాడు లకు పాల్పడినా తాము సహించబోమని పేర్కొంది. కాశ్మీర్ లో కొనసాగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు తెరదిం చేలా, సరిహద్దుల్లో దుస్సాహసానికి పాల్పడకుండా భారత్‌పై వత్తిడి తేవాలని తాము అంతర్జాతీయ సమాజాన్ని కోరుతు న్నామని, ఇదిలా వుండగా జమ్మూ కాశ్మీర్ డిజిపి ఎస్‌పి వైద్ శ్రీనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ గత వారాంతంలో తమ సైబర్ నిపుణులు అందచేసిన సమాచారం ప్రకారం జైషేమహ్మద్ మిలిటెంట్లే భారత దళాలపై దాడి చేశారని స్పష్టమవు తోందని చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌లోని భారత దళాలపై పోరులో ఇప్పుడు ఈ ఉగ్రవాద సంస్థే అగ్రస్థానంలో వుందన్నారు. తమపై దాడి చేసిన ఉగ్రవాదుల వద్ద అస్సాల్ట్ రైఫిళ్లు, గ్రెనేడ్ లాంచర్లు, గ్రెనేడ్‌ల వంటి మారణా యుధాలున్నాయని సైన్యం వేరొక ప్రకటనలో వెల్లడించింది. సోమవారంనాడు శ్రీనగర్ లోని మరో సైనిక శిబిరంపై ఉగ్రవాదులు దాడికి చేసిన ప్రయత్నాన్ని తాము భగ్నం చేసినట్లు సైన్యం తెలిపింది.

కొందరు వ్యక్తులు మోడీకి తాళం వేస్తున్నారు : అసదుద్దీన్

హైదరాబాద్: అఖిల భారత ముస్లిం పర్సనల్ లాబోర్డ్ (ఎఐఎంపిఎల్‌బి)లో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న మౌలానా హుస్సేనీ నద్వీ ప్రధాని నరేంద్రమోడీ పాటకు తాళం వేస్తున్నారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఎఐఎంపిఎల్‌బి మూడు రోజుల ప్లీనరీ సందర్భంగా సోమవారం జరిగిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబ్రీ మసీదును వదులుకోవాలంటున్న వారిని ముస్లింలు సామాజికంగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కొంతమంది వ్యక్తులు మోడీకి తాళం వేస్తున్నారన్నారు. బోర్డు అనుసరిస్తున్న వైఖరికి భిన్నంగా నద్వీ వ్యవహరిస్తున్నారని, బాబ్రీ మసీదు విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మసీదు మసీదుగానే వుంటుందంటూ 2001లో జారీ చేసిన ఫత్వాపై సంతకాలు చేసిన పెద్దల్లో నద్వీ ఒకరని, అందువల్ల ముస్లింలు బాబ్రీ మసీదును వదులుకునే ప్రసక్తే లేదని ఆయన చెప్పారు.

రూ. 50వేల రైతు రుణాలు రద్దు

- రాజస్థాన్ ఎన్నికల బడ్జెట్

జైపూర్ : రాజస్థాన్‌లో కోల్పోయిన పట్టును నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక శాఖను తన వద్దే అట్టిపెట్టుకున్న ముఖ్యమంత్రి వసుంధర రాజే సోమవారం ఉదయం అసెంబ్లీలో 2018-2019 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో పలు తాయిలాలను ప్రజలకు అందించారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి పనితీరుకు జీరో ఫలితాలు రావడంతో ప్రజాదరణ గల బడ్జెట్‌ను రూపొందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ ఏడాదితో తన పదవీకాలం ముగుస్తుండటంతో పలు ప్రజాదరణ పథకాలతో బడ్జెట్‌ను తీసుకు వచ్చారు. రాష్ట్రం లోని చిన్న, మధ్యతరహా రైతులకు సహకార బ్యాంకులు అందించిన రూ.50 వేల వరకు ఏకకాల రుణ రద్దు పథకాన్ని ప్రవేశపెట్టింది. అంగన్‌వాడీలకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని పెంచింది. శిశు అభివృద్ధి ప్రాజెక్టులలో పనిచేసేందుకు 1000 మంది నర్సింగ్ టీచర్లను నియమించనున్నది. 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలకు ప్రభుత్వ సహకారంతో శానిటరీ నాప్‌కిన్స్‌ను అందించే పథకానికి రూపకల్పన చేసింది. సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర కార్పొరేషన్‌కు చెందిన బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నది.

వారికి సహాయంగా వచ్చేవారికి ప్రయాణపు చార్జీలలో 50శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నది. వీటితోపాటు గోశాలల్లో బయోగ్యాస్ ప్లాంట్‌లను నిర్మించుకుని ఉపాధి పొందే నిరుద్యోగులకు దానికయ్యే వ్యయంలో 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు రాజే తన బడ్జెట్‌లో పేర్కొన్నారు. ప్రతి మున్సిపాల్టీలోనూ అంబేద్కర్ భవన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు పలుమార్లు నిరసన వ్యక్తం చేశారు..

రైనోను చంపి కొమ్మును ఎత్తుకెళ్లిన దుండగులు

దిస్పూర్ : అసోంలోని బిస్వంత్ జిల్లాలో ఉన్న ఖజరంగ్ నేషనల్ పార్క్‌లో ఆదివారం రాత్రి కొంత మంది దుండగులు వృద్ధ రైనోను చంపి దాని కొమ్ము కత్తిరించి తీసుకొని పారిపోయారని అటవీ అధికారి రోహిణీ బల్లావ్ పేర్కొన్నారు. ఈ సంఘటన లహోరిజన్ అటవీ శిబిరం క్రింద ఉన్న బాగ్మరి పవర్ గ్రిడ్ స్టేషన్ దక్షిణాన ఉన్న బ్రహ్మపుత్ర ఇసుక దీవిలో అర్ధరాత్రి సంభవించిందని అధికారి తెలిపారు. వేటగాళ్లు రైనోను చంపి, దాని కొమ్మును తీసుకొని పారిపోయారని, ఘటన స్థలంలో రైఫిల్‌ను గుర్తించామని తెలిపారు. వేటగాళ్ళ కోసం అటవీ, పోలీసు అధికారులు ఉమ్మడిగా గాలింపు చర్యలు చేపట్టారు.

భారతీఘోష్‌పై అరెస్టు వారెంటు



ఖరగ్‌పూర్ : ఐపిఎస్ మాజీ అధికారిణి భారతీఘోష్‌పై సిఐడి అధికారులు అరెస్టు వారెంట్ జారీ చేశారు. పలుమార్లు ఆమె ఇంటిలో సోదాలు నిర్వహించిన అధికారులు, ఆమెను వారి ప్రధాన కార్యాలయం భవానీ భవన్‌లో హాజరు కావాలని కోరారు. కానీ ఆమె హాజరుకాలేదు. పశువుల వ్యాపారి యూనిష్ ఆలీ మండల్ నుండి ఆమెతో పాటు మరో ముగ్గురు రూ. 45 లక్షలు మోసగించి తీసుకున్నారనే ఆరోపణపై ఘటాల్ కోర్టులో కేసు దాఖలైంది. ఈ కేసులో శుభాంకర్ దే, చిత్తపాల్‌లనే పోలీస్ అధికారులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. సెక్యూరిటీ గార్డ్ సుజిత్ మండల్, భారతీ ఘోష్ అరెస్టుకు సిఐడి పెట్టిన అభ్యర్థనను కోర్టు స్వీకరించింది. వారి అరెస్టుకు రంగం సిద్ధం చేసింది. వారిద్దరూ గుజరాత్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లో ఉండవచ్చని సిఐడి భావిస్తోంది.

మరుగుదొడ్డి నిర్మాణం కోసం మహిళ భిక్షాటన

పాట్నా: బలహీన వర్గాలకు చెందిన ఒక మహిళ తన ఇంట్లో మరుగుదొడ్డి నిర్మాణం కోసం భిక్షాటన ద్వారా నిధులు సేకరించిందని ఒక అధికారి వివరించారు. కోశీనది వరద ప్రభావిత ప్రాంతమైన సుపౌల్ జిల్లా పిప్రా బ్లాక్‌లోని పాత్రా ఉత్తర్ గ్రామానికి చెందిన అమీనా ఖాటూన్ అనే మహిళ తన ఇంటిలో మరుగుదొడ్డి నిర్మాణం కోసం పరిసర గ్రామాలలో భిక్షాటన ద్వారా నిధులు సేకరించిందన్నారు. ఆమె చిత్తశుద్ధిని గుర్తించిన తాపీమేస్త్రీ, కూలీలు తన వద్ద నుండి డబ్బుతీసుకునేందుకు నిరాకరించారని ఆమె చెప్పింది. ఇంటిలో మరుగుదొడ్డి నిర్మాణం కోసం విశేషంగా శ్రమించిన ఆమెను జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా సత్కరించింది. నలభయ్యో పడిలో వున్న ఈమె తన జీవనాధారం కోసం రోజుకూలీగా పనిచేస్తోంది. తన ఇంటిలో మరుగుదొడ్డి నిర్మాణానికి నిధులు అందించాలంటూ ఆమె బ్లాక్ అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ వారు ఆమె వినతిని నిర్లక్ష్యం చేశారు. ఒకవైపు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ భారత్ పథకాన్ని అమలు చేస్తుంటే, మరోవైపు అధికారులు ఈ మహిళ వినతిని నిరాకరించటం గమనార్హం.

ప్రత్యేకం

హైకోర్టు జడ్జీల నియామకాల్లో తీవ్ర జాప్యం

- 4.2 మిలియన్ల కేసుల పెండింగ్
- దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో జడ్జీల నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. కోర్టుల్లో 37 శాతం జడ్జీల కొరత వుంది. ఈ నెల 4 తేదీ నాటికి దేశంలో 24 హైకోర్టుల్లో 4.2 మిలియన్ల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు నేషనల్ జ్యూడిషియల్ డేటా గ్రిడ్ తెలిపింది. ఇందులో 49 శాతం కేసులు ఐదు కంటే ఎక్కువ సంవత్సరాల నుంచి కొనసాగుతున్నట్లు తెలిపింది. పెండింగ్ కేసుల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థ మీద తీవ్ర ప్రభావం చూపుతుందని వెల్లడించింది. ఆర్థిక సర్వే 2017-18 ప్రకారం వివిధ మంత్రిత్వ శాఖల్లో సుమారు రూ. 52,000 కోట్ల విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టులు కోర్టు ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాయి.

అలహాబాద్ హైకోర్టులో అత్యధికంగా 9 లక్షల కేసులో పెండింగ్‌లో ఉన్నాయి. 24 హైకోర్టుల్లోనూ పెండింగ్ కేసుల మధ్య వ్యత్యాసం స్వల్పంగానే ఉంది. కర్నాటక హైకోర్టులో పని ఒత్తిడి అధికంగా ఉంది. ఇక్కడ పెండింగ్ కేసుల వృద్ధి అత్యంత వేగంగా ఉంది. ఈ కోర్టులో 2016లో 2,56,509 కేసులు పెండింగ్‌లో ఉండగా, 2017 నాటికి ఈ సంఖ్య 2,92,988కు చేరుకుంది. ఏడాది వ్యవధిలో 36,479 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పని ఒత్తిడిలో కర్నాటక తరువాత స్థానంలో హైదరాబాద్, చండీఘర్ హైకోర్టులు ఉన్నాయి. హైదరాబాద్‌లో ఏడాదిలో 32,548 కేసులు, చండీఘర్‌లో 30,195 కేసులు పెండింగ్‌లో వున్నాయి. జార్ఖండ్, మేఘాలయ, సిక్కిం హైకోర్టుల్లో పని ఒత్తిడిలో ఎలాంటి మార్పు లేదు.

2016తో పోలిస్తే 2017 నాటికి వివిధ హైకోర్టులో జడ్జీల సంఖ్య తగ్గింది. కోల్‌కతా హైకోర్టులో ఏడుగురు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టులో ముగ్గురు, గుజరాత్ హైకోర్టు, త్రిపుర హైకోర్టుల్లో ఇద్దరు, మణిపూర్ హైకోర్టు, ఒడిషా హైకోర్టుల్లో ఒక్కరు తగ్గారు. అయితే 2016తో పోలిస్తే 2017 నాటికి మద్రాస్ హైకోర్టులో అత్యంత అధికంగా 16 మంది జడ్జీలు, బాంబే హైకోర్టులో 10 మంది జడ్జీలు పెరిగారు. పాట్నా, రాజస్థాన్, గౌహతి, చత్తీస్‌ఘడ్ హైకోర్టుల్లో ఆరుగురు జడ్జీలు పెరిగారు. అయితే దేశంలో ఏ హైకోర్టులోనూ పని ఒత్తిడికి తగినట్లుగా జడ్జీల సంఖ్య పెరగలేదు. అలాగే హైకోర్టుల్లో జడ్జీలుగా వచ్చినవారంతా బదిలీలపై వచ్చిన వారే. పని ఒత్తిడి ఆధారంగా ఈ జడ్జీల బదిలీలు జరిగాయి.

ప్రస్తుతం కొలిజయం సిఫార్సుల ఆధారంగా జడ్జీల బదిలీలు, నియామకాలు జరుగుతున్నాయి. భారత ప్రధాన న్యాయమూర్తితో పాటు సుప్రీంకోర్టులో నలుగురు అత్యంత సీనియర్ జడ్జీలు ఈ కొలిజయంలో ఉంటారు. అయితే కొలిజయంకు ఎలాంటి రాజ్యాంగ బద్ధత లేదు. కొలిజియం స్థానంలో నేషనల్ జ్యుడిషియల్ అప్పాయిమెంట్స్ కమిషన్ (ఎన్‌జెఎసి)ని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఈ ఎన్‌జెఎసిను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ కొలిజయంపై న్యాయవర్గాల్లోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. న్యాయమూర్తుల నియామకాలు, బదిలీల్లో కొలిజయం సమర్థవంతంగానూ, పారదర్శకంగానూ పనిచేస్తుందని కొంత మంది వ్యాఖ్యానిస్తుండగా, ఎన్‌జెఎసిపై పునరాలోచన చేయాలని మరికొంత మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

టాప్-10 హైకోర్టుల్లో పెండింగ్ కేసులు

హైకోర్టు	2016	2017
అలహాబాద	9,24,488	9,17,955
మద్రాస	8,41,255	8,49,985
చండీఘర్	2,89,799	3,19,128
మధ్యప్రదేశ్	2,83,119	2,96,164
హైదరాబాద్	2,78,695	3,11,243
బాంబే	2,71,268	2,76,026
కర్నాటక	2,56,509	2,92,988
రాజస్థాన్	2,50,236	2,57,859
కోల్‌కతా	2,13,514	2,22,132
ఒడిషా	1,70,834	1,72,066

సంక్షిప్తం

కొట్టి, ఆహారాన్ని ఇవ్వలేదని అనాథ బాలికల ఫిర్యాదు

ఎర్నాకుళం : కేరళలోని క్రిస్ట్ కింగ్ అనాథ శరణాలయంలోని పిల్లలు అక్కడ పనిచేస్తున్న నర్సులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నన్స్ తమను కొట్టి, తమకు అనేక సందర్భాల్లో ఆహారాన్ని ఇవ్వలేదని కొందరు బాలికలు పోలీసులకు తెలిపారు. వీరంతా 7 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల వయస్సు వారే. జువైలెన్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 75 కింద నన్స్‌పై కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్ ప్రకారం పిల్లలపై క్రూరత్వంగా వ్యవహరించిన, దాడి చేసినా వారిని మూడు సంవత్సరాల జైలు శిక్ష, సుమారు లక్ష రూపాయల జరిమానా ఉంటుంది.

అత్యధిక హిమపాతంతో జమ్ము కశ్మీర్ హైవే మూసివేత

శ్రీనగర్: అత్యధిక హిమపాతం కురవడం వల్ల జమ్ము కశ్మీర్‌లోని వ్యూహాత్మక హైవేను సోమవారం మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ అధికారులు ప్రకటించారు. ఈ కారణంతో వాహనాలను అనుమతించడం లేదని తెలిపారు. హిమపాతం తగ్గిన తర్వాత తగిన చర్యలు చేపట్టి ట్రాఫిక్ పునరుద్ధరిస్తామని తెలిపారు. దాదాపు రెండు నెలలుగా జమ్ము కశ్మీర్‌లో పొడిగా ఉన్న వాతావరణం, సోమవారం చిన్నపాటి వర్షాలు కురిశారు. దీంతో భారీ హిమపాతం నమోదైంది.

మహారాష్ట్రలో వడగళ్ల వాన పంట నష్టం, ముగ్గురి మృతి

ముంబయి : మహారాష్ట్ర సెంట్రల్, మరథ్వాడా, విదర్భ ప్రాంతాల్లో వడగళ్ల వానకు ముగ్గురు మృతి చెందారు. ఆదివారం ఉదయం 7 గంటల నుండి అరగంట సేపు వడగళ్ల వాన పడిందని సీనియర్ రెవెన్యూ అధికారి పేర్కొన్నారు. జల్నా జిల్లాకు చెందిన చెందిన నామ్‌దేష్ షిండే అనే వృద్ధుడు, ఆశారాం జగప్త్ మృతి చెందారని జిల్లా కలెక్టర్ శివాజీరావ్ పేర్కొన్నారు. సుమారు 180 గ్రామాల్లో వడగళ్ల వాన ప్రభావం ఉందని, గుర్తు తెలియని రైతు మృతి చెందారని రెవెన్యూ అధికారి ఒకరు తెలిపారు. మహారాష్ట్రలోని బీడ్, ఉస్మానాబాద్, లాతూర్, నాందేడ్, పర్భానీ, హింగోరీ, ధూలే, నందుర్బార్, ఔరంగాబాద్‌లో ఈ వర్షం పడిందని తెలిపారు.

స్వదేశానికి చేరిన ఉత్తరకొరియా ప్రతినిధి బృందం

సియోల్/ప్యాంగాంగ్ : మూడు రోజుల దక్షిణ కొరియా పర్యటన ముగించుకుని డెమో క్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (డిపిఆర్‌కె) ఉన్నత స్థాయి ప్రతినిధివర్గం ఆదివారం రాత్రి స్వదేశానికి తిరిగి వచ్చింది. ప్రైవేట్ జెట్‌లో బయలు దేరిన ఈ ప్రతినిధి బృందానికి దక్షిణ కొరియా ఏకీకరణ మంత్రి చో మియాంగ్ వీడ్కోలు పలికారు. దక్షిణ కొరియాలోని ప్యాంగ్ చాంగ్‌లో జరిగిని 23వ వింటర్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉత్తర కొరియా నుండి ఈ ప్రతి నిధి బృందం హాజరైంది. పర్యటనలో రెండోరోజు దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో విందు సమావేశం జరిపారు.

ఆరెంజ్ ఫెస్టివల్

ఇటలీలోని ఐవెరా సిటీలో సోమవారం ఆరెంజ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు.ఇది స్పెయిన్‌లోని టమాటో ఫెస్టివల్‌ను పోలి ఉండటం విశేషం. 19వ శతాబ్దంలో భూస్వామ్యులపై రైతుల, వ్యవసాయ కార్మికుల విజయానికి గుర్తుగా ప్రతి ఏడాది ఈ ఉత్సవాన్ని జరుపుకుంటారు.



ఇజ్రాయిల్‌పై ట్రంప్ విమర్శలు

వెస్ట్ బ్యాంక్ ఆవాసాల నిర్మాణానికి ఖండన

జెరూసలేం : పాలస్తీనాతో శాంతిని కోరుకోవడంలో ఇజ్రాయిల్ ప్రయోజనాలు ఏమిటని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశ్నించారు. ఇజ్రాయిల్ హేయమ్ డైలీకి ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, ఒప్పందం కుదుర్చుకోవాలని పాలస్తీనా ఆకాంక్ష పట్ల కూడా సందేహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్‌తో సత్సంబంధాలు నెరుపుతూ మరో పక్క పాలస్తీనాతో బహిరంగంగానే ఘర్షణ పడే అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయిల్‌పై ఇటువంటి విమర్శ చేయడం చాలా అరుదు. ఇప్పటికైతే పాలస్తీనియన్లు శాంతి స్థాపన కోసం ఎదురుచూడడం లేదని, ఇజ్రాయిల్ అలా ఎదురుచూస్తుందని తాము అనుకోవడం లేదని అన్నారు. కాబట్టి ఏం జరుగుతుందో చూడడం ప్రస్తుతం మనం చేయాల్సిన పనని ఆయన వ్యాఖ్యానించారు. అయితే అమెరికా శాంతి ప్రణాళిక ఏమిటన్నది వివరాలు ట్రంప్ వెల్లడించలేదు. పైగా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ ఆవాసాలను నిర్మించడాన్ని కూడా ట్రంప్ విమర్శించారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే ట్రంప్ హయాంలో ఇజ్రాయిల్ అక్రమ ఆవాసాల నిర్మాణాన్ని ఖండనలు తక్కువే. 'ఆ ఆవాసాల నిర్మాణం చాలా క్లిష్టంగా మారింది. దాంతో శాంతి ప్రయత్నాలకు కూడా ఇబ్బంది కలుగుతోంది. కాబట్టి ఇజ్రాయిల్ ఈ విషయంలో కాస్తంత జాగ్రత్తగా వుండాలి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తూ ట్రంప్ ప్రకటించిన నాటి నుండి అమెరికా, పాలస్తీనా మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. పైగా పాలస్తీనా శరణార్థుల వ్యవహారాలు చూసే ఐక్యరాజ్య సమితి సంస్థకు నిధుల్లో కోత కూడా విధించారు. ఇజ్రాయిల్‌తో చర్చలు పునరుద్ధరిస్తేనే సాయం అందిస్తామని షరతు విధించారు.

ఉ.కొరియాకు దౌత్యనీతి గోల్డ్ మెడల్

ద.కొరియా నిపుణుల అభిప్రాయం

పియాంగ్‌చాంగ్ : ఒలింపిక్స్ క్రీడలలో అత్యుత్తమ దౌత్యనీతిని అనుసరించిన ఉ.కొరియాకు బంగారుపతకాన్ని సాధించే అర్హత వుందని ద.కొరియా మాజీ ఉప విదేశాంగమంత్రి కిమ్‌సుంగ్ హాన్ అభిప్రాయపడ్డారు. ఆయన సియోల్‌లోని కొరియా యూనివర్శిటీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న శీతాకాలపు ఒలింపిక్ క్రీడోత్సవాలలో ఉ.కొరియా అనుసరించిన దౌత్యనీతి పలువురి ప్రశంసలను అందుకుంటోంది. ముఖ్యంగా ఈ క్రీడోత్సవాల వేదిక ద్వారా తమపై ఆంక్షల వత్తిడిని తగ్గించుకునేందుకు ప్రయత్నించటంలో ఉ.కొరియా విజయం సాధించిందని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తమ దేశం శీతాకాలం ఒలింపిక్ క్రీడలలో పాల్గొనేందుకు సిద్ధమని ఉ.కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ ప్రకటించిన నెలరోజుల్లోపే ద.కొరియా అధ్యక్షుడు మూన్‌జేఇన్ తమ సైనిక విన్యాసాలను వాయిదా వేశారు. కిమ్ సోదరిని పియాన్‌చాంగ్ ఒలింపిక్ క్రీడలకు సాదరంగా ఆహ్వానించటంతో పాటు ఉ.కొరియా ఆహ్వానాన్ని (షరతు లతో) అంగీకరించారు. ఉ.కొరియా ప్రతినిధి బృందం, అందులోని క్రీడాకా రులు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారని, కిమ్‌జోంగ్ ఉన్ సోదరి చిరునవ్వులు ద.కొరియా ప్రజలను, ప్రపంచాన్ని ఆకర్షించాయని, అది సాధారణ పరిస్థితులున్న దేశమేననిపించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ క్రీడల ప్రారంభోత్సవానికి ఉ.కొరియాతో పాటు హాజరైన అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ మాట్లాడుతూ ఉ.కొరియాను ఏకాకిని చేయాల్సినంత అవసరం లేదన్న అభిప్రాయం అమెరికాతో పాటు ద.కొరియా జపాన్‌లకు కూడా ఏర్పడిందన్నారు. క్రీడల



ప్రారంభ కార్యక్రమంలో ద.కొరియా క్రీడాకారులు ప్రవేశించినపుడు ఆ దేశ అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్ సోదరి కిమ్‌యోజాంగ్‌తో కలిసి హర్షధ్వానాలు చేస్తుండగా పెన్స్ మాత్రం ఏకాకిగా ఒంటరిగా నిలబడిపోయారు.

జపాన్‌కు పీడకల?

ఒలింపిక్ క్రీడల నేపథ్యంలో ఉభయ కొరియాల మధ్య ఏర్పడిన సౌహార్ద్ర వాతావరణం ఇటు ద.కొరియా, అటు అమెరికా మధ్య విభేదాలకు దారితీయటంతో పాటు ద.కొరియా, జపాన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి కూడా తెరతీసింది. ఒలింపిక్ క్రీడల సమయంలో తీవ్ర అసహనానికి లోనైన జపాన్ ప్రధాని షింజో అబే క్రీడల అనంతరం ద.కొరియా–అమెరికా సైనిక విన్యాసాలు సకాలంలో ప్రారంభమవుతాయంటూ అక్కడి అతిధులకు ఆగ్రహం తెప్పించారు. ఒలింపిక్ క్రీడావేదికకు ఉ.కొరియాను రప్పించేందుకే ద.కొరియా తమ సంయుక్త సైనిక విన్యాసాలను వాయిదా వేసిందన్న విషయం తెలిసిందే. అసలు ఇప్పుడు సైనిక విన్యాసాలను వాయిదావేయాల్సిన సమయం కాదని అబే మూన్‌కు నచ్చచెప్పే ప్రయత్నం చేశారని ద.కొరియా అధ్యక్ష భవనం బ్లూహౌస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఆనంద సమయంలో ఆ విషయం ప్రస్తావించటం సబబు కాదని, ఇది తమ అంతర్గత వ్యవహారమని మూన్ ఆయనకు జవాబిచ్చినట్లు తెలుస్తోంది. ఇది జపాన్‌కు ఒక పీడకల వంటిదని టోక్యోలోని టకుషోకూ యూనివర్శిటీలోని ఇంటర్నేషనల్ పాలిటిక్స్ ప్రొఫెసర్ టకాషీ కవకామీ అంటున్నారు.

ఆంక్షల సడలింపు?

ఉ.కొరియా తన అణు, క్షిపణి కార్యక్రమాలకు తక్షణమే తెరదించాలన్న డిమాండ్‌తో ఐరాస ఆ దేశంపై తీవ్ర ఆంక్షలను విధించింది. అయితే ఉ.కొరియా తన అణు, క్షిపణి కార్యక్రమాల వేగాన్ని పెంచిన తరువాత ఈ ఆంక్షలు దారి తప్పాయి. ఏళ్ల పాటు అసమర్థంగా కొనసాగిన ఈ ఆంక్షలు ఎట్టకేలకు తగ్గుముఖం పట్టటం ప్రారంభించాయని జపాన్ ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఆంక్షలు తగ్గుముఖం పట్టటం వల్లే కిమ్‌జోంగ్ ఉన్ ఒలింపిక్ క్రీడ లకు తమ ప్రతినిధి బృందాన్ని పంపేందుకు సిద్ధమయ్యారని నిపుణులు చెబు తున్నారు. ఉ.కొరియా క్రీడా ప్రతినిధులను తీసుకు వచ్చిన నౌక గత వారం ద.కొరియాను చేరుకున్నపుడు తమను తిరిగి పంపేందుకు అవసరమైన ఇంధనాన్ని సమకూర్చాలని ఉ.కొరియా విజ్ఞప్తి చేసిందని సియోల్ ఏకీకరణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. అయితే ద.కొరియా ఇంథన ఏర్పాటుకు ముందే అంగీకరించింది. క్రీడా వేదిక అయిన పియాంగ్‌చాంగ్‌లో ఉభయ కొరియాలు ఆంక్షల ప్రస్తావనను పక్కన పెట్టి ఒలింపిక్ క్రీడల నిర్వహణపైనే దృష్టిపెట్టాయి. శనివారం నాడు ఉభయ కొరియా మహిళా బృందాల ఐస్ హాకీ టోర్నీ సందర్భంగా ఇది స్పష్టమైంది.

లండన్ ఎయిర్‌పోర్టులో రెండవ ప్రపంచ యుద్ధ కాలం నాటి బాంబు

లండన్ : లండన్ నగర విమానాశ్రయాన్ని ఆదివారం రాత్రి మూసివేశారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలానికి చెందిన పేలని బాంబును జార్జి వి.డాక్ వద్ద థేమ్స్ నదిలో కనుగొనగడంతో ఈచర్య తీసుకున్నట్లు మెట్రోపాలిటన్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయం వద్ద ముందుగా అనుకున్న కార్యకలాపాలు చేపట్టేందుకు పనులు ప్రారంభించిన సమయంలో ఈ బాంబును కనుగొన్నారు. రాయల్ నేవీ బలగాలతో కలిసి ఈ పేలుడు పదార్థాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ చర్యల కారణంగా వచ్చి, వెళ్ళే విమానాలకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. బాంబును కనుగొన్న ప్రాంతంలో 214 మీటర్ల పరిథిలో నిషిద్ధ ప్రాంతంగా ప్రకటించారు. తదుపరి నోటీసులు జారీ చేసేవరకు విమానాశ్రయానికి రావద్దని ప్రయాణికులకు సూచించారు.

మధ్య ప్రాచ్యంలో విస్తరిస్తున్న యుద్ధ ప్రమాదం?

ఇరాన్ సిబ్బంది లక్ష్యంగా సిరియాపై ఇజ్రాయిల్ దాడులు

డమాస్కస్ : సిరియాలోని సైనిక స్థావరాలపై శనివారం ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడులతో మధ్య ప్రాచ్యంలో యుద్ధం మరింత విస్తరించే ప్రమాదాలు కనిపిస్తున్నాయి. ఈ దాడుల్లో సిరియా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న ఇరాన్ సిబ్బంది వున్నారు. ఈ దాడులపై ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు స్పందిస్తూ తమ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే ఇరాన్ సిబ్బందిని లక్ష్యంగా చేసుకుందని చెప్పారు. ఆ వైమానిక దాడుల్లో ఇరాన్ మానవ రహిత వైమానిక వాహనం ధ్వంసమవడాన్ని సమర్ధించుకున్నారు. ఇజ్రాయిల్ దాడులకు ప్రతిస్పందనగా సిరియా సైన్యం ఇజ్రాయిల్‌కి చెందిన ఎఫ్–16 జెట్‌ను కూల్చివేసింది. సిరియాలోని ప్రధానమైన 12 రక్షణ స్థావరాలపై ఇజ్రాయిల్ దాడులు జరిగాయి. ఇవన్నీకూడా ఇరాన్ లక్ష్యాలని ఇజ్రాయిల్ పేర్కొంటోంది. 1982 లెబనాన్ యుద్ధం తర్వాత సిరియాపై ఇంత పెద్ద ఎత్తున దాడి జరగడం ఇదే. ఈదాడుల్లో తీవ్రమైన నష్టం కలిగించామని తెలిపింది. ఇరాన్ పౌరులు కూడా మరణించారు. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ఉపయోగించే ఆయుధాలను తరలించే లక్ష్యంతో పాల్మిరాకి సమీపంలోని తియాస్ ఎయిర్ బేస్‌ను ఇరాన్ మిలటరీ ఉపయోగించుకుంటోందని ఇజ్రాయిల్ రక్షణ బలగాలు (ఐడిఎఫ్) తెలిపాయి. ఇదే చివరి దాడి అనుకోకూడదని కూడా సూచనప్రాయంగా తెలిపింది. ఉత్తర ప్రాంతంలో దాడికి ఐడిఎఫ్ సన్నద్ధమవుతోందని పేర్కొంది. ఈ దాడులకు అమెరికా మద్దతు సంపూర్ణంగా వుంది. అమెరికాతో చర్చించిన తర్వాతనే దాడులు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ సైనిక చర్యలో తాము పాలు పంచుకోలేదని అమెరికా రక్షణ విభాగం తెలిపింది. అయితే ఈ ప్రాంతాన్ని అస్థిరపరిచేందుకు ఇరాన్ చేపట్టే కార్యకలాపాల పట్ల తాము చాలా ఆందోళన చెందుతున్నామని తెలిపింది.

రష్యా విమాన దుర్ఘటనపై దర్యాప్తు

భారీ మంచుతో కష్టమవుతున్న గాలింపు

స్టైపనోవిస్కా, రష్యా : ఆదివారం జరిగిన రష్యా విమాన ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైంది. మానవ తప్పిదం, సాంకేతిక లోపం, వాతావరణ పరిస్థితులు వంటి అన్ని కారణాలను పరిశీలించనున్నట్లు దర్యాప్తు కమిటీ అధికారులు తెలిపారు. ఇటీవలి వారాల్లో దేశంలో రికార్డు స్థాయిలో మంచు కురిసిందని, అందువల్ల వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని కూడా తోసిపుచ్చలేమని తెలిపారు. అయితే తీవ్రవాద చర్య అయి వుండవచ్చునన్న అనుమానాలను ప్రస్తావించలేదు. ఆదివారం విమానం బయలుదేరిన కొద్ది నిముషాలకే మాస్కోకి సమీపంలో కూలిపోయిన ఈ దుర్ఘటనలో 71మంది మరణించారు. ఉరల్ పర్వత సానువుల్లోని నగరమైన ఓర్స్కికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంటనే 400మందికి పైగా సహాయ సిబ్బందిని, 70వాహనాలను ప్రమాద ప్రాంతానికి తరలించారు. అక్కడ గాలింపు జరుగుతోందని అధికారులు తెలిపారు. ఆ ప్రాంతమంతా భారీగా మంచుతో కప్పబడి వుందని దాంతో గాలింపు చర్యలకు చాలా కష్టమవుతోందని తెలిపారు. దూరంగా వాహనాలను నిలిపి కాలినడకన శిథిలాల వద్దకు చేరాల్సి వస్తోందన్నారు. ఈ ప్రాంతంలో సర్వే కోసం డ్రోన్‌లను, స్నో మొబైల్స్‌ను ఉపయోగిస్తున్నారు.

ఇరాక్ పునర్మిర్మాణానికి 8800 కోట్ల డాలర్లు

కువైట్ సిటీ : ఐసిస్‌తో ఏళ్ళ తరబడి సాగిన యుద్ధంలో ధ్వంసమైన ఇరాక్‌ను పునర్నిర్మించడానికి 8800 కోట్ల డాలర్లకు పైగా నిధులు అవసరమవ ుతాయని ప్రణాళికా శాఖ మంత్రి సల్మాన్ అల్ జుమైలి తెలిపారు. కువైట్ సిటీలో ఇరాక్ పునర్నిర్మాణంపై జరిగిన అంతర్జాతీయ సమావేశంలో మాట్లాడుతూ ఆయన, మూడు రోజుల పాటు జరిగే ఈ సమావే శంలో కోట్లాది డాలర్లను సేకరించగలమని ఆశిస్తు న్నట్లు తెలిపారు. ఐసిస్‌పై విజయం సాధించినట్లు డిసెంబరులో ఇరాక్ ప్రకటించింది. దాదాపు మూడేళ్ళుగా సాగిన ఈ యుద్ధంలో దేశంలో పలు ప్రాంతాలు విధ్వంసానికి గురయ్యాయి. లక్షలాదిమంది నిర్వాసి తులయ్యారు. ఇరాక్, అంతర్జాతీయ నిపుణులు నిర్వ హించిన అధ్యయనం, అంచనాలు ప్రాతిపదికన ఇంత మొత్తం వ్యయమవుతుందని అంచనాకు వచ్చినట్లు ప్రణాళికా మంత్రి తెలిపారు. వీటిలో 2200కోట్ల డాలర్ల వరకు తక్షణమే అవసరమవు తాయని ప్రణా ళికా శాఖ డైరెక్టర్ జనరల్ క్వాసి అబ్దుల్‌ఫత్తా చెప్పారు. యుద్ధ బాధిత ప్రాంతాల్లో ఇప్పటికే కొన్ని నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభించామన్నారు. అయితే ఇరా క్‌కు అవసరమైన దానిలో కనీసం ఒక శాతం కూడా ఈ పనులు లేవని పునర్మిర్మాణ నిధి అధ్యక్షుడు ముస్తఫా చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

ప్రజా పునాదిని విస్తరించండి

ఉన్నారు. ఇది ప్రత్యామ్నాయ రాజకీయాలకు అనుకూలమైన సమయం.' అని ఆయన అన్నారు. గత మూడేళ్ల కాలంలో రాష్ట్రంలో చోటుచేసుకున్న వివిధ పోరాటాలను, ఉద్యమాలను ఆయన ప్రస్తావించారు. వివిధ రంగాలకు చెందిన ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం శ్రేణులు చేస్తున్న పోరాటాలు ఉత్తేజకరంగా ఉన్నాయని, అదే సమయంలో ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచడానికి కృషి చేయాల్సిఉందని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ఈ తరహా కృషి చేయడానికి అనుకూలంగా ఉన్నాయని దీనిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బూర్జువా పార్టీల రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా సిపిఎం సొంత బలాన్ని పెంచుకోవడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన బలోపేతానికి దోహదం చేయాలన్న విశాఖ మహాసభ పిలుపును గుర్తుచేశారు. ఆ దిశలో ఇప్పటికే రాష్ట్రంలో జరిగిన కసరత్తును మరింత ముందుకు తీసుకుపోవాలని దిశానిర్దేశం చేశారు. వామపక్ష ప్రజాతంత్ర సంఘటనలో భాగంగా పెద్ద ఎత్తున ప్రజా,వర్గ పోరాటాలను నిర్మించాలన్న విశాఖ మహాసభ సూచనను రాష్ట్ర పార్టీ నాయకత్వం విజయవంతంగా అమలు చేసిందని చెప్పారు. పోరాటాల్లో కలిసి వస్తున్న ప్రజానీకానికి రాజకీయ విద్యను అందించడం ద్వారా వారిని చైతన్యవంతులను చేయాలని సూచించారు. వివిధ స్థాయిల్లోని పార్టీ కమిటీలలో యువతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.

ప్రత్యేక హోదాపై విశాల ఉద్యమం

పెద్దఎత్తున జరుగుతున్నాయని, గోదావరి జిల్లాల్లో రైతులు పండించిన ధాన్యానికి కూడా మద్దతు ధర ఉండడం లేదన్నారు. రైతురుణభారం, పంటలకు గిట్టుబాటు ధర సమస్యలుతీవ్రంగా ఉన్నాయన్నారు. వీటిపైచర్చించేందుకు ఈ నెల 14న విజయవాడలో వామపక్షాలతో సమావేశమవుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో చర్చించిన అనంతరం భవిష్యత్ కార్యాచరణ ఖరారు చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, రాజమండ్రి, గుంటూరు వంటి పలుకేంద్రాల్లో వామపక్ష ఉద్యమానికి ప్రజలు పెద్దఎత్తున మద్దతు తెలుపుతున్నారన్నారు. మున్ముందు జనం మద్దతుతో భారీస్థాయిలోఉద్యమాలు చేపడతామన్నారు. రాష్ట్రకమిటీలో అన్ని జిల్లాల నుంచి నాయకులను ఎంపిక చేసినట్లు తెలిపారు. పొత్తులవంటి విషయాలు ఎన్నికల సమయంలో నిర్ణయం ఉంటుందన్నారు. అనంతరం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల పదో తేదీ నుంచి 12వ తేదీ వరకూ మూడు రోజుల పాటు జరిగిన సిపిఎం 25వ రాష్ట్రమహాసభల్లో 15 మందితో రాష్ట్రకార్యదర్శివర్గంతో కలిపి 60 మందితో కమిటీ సభ్యులను, పదిమంది ఆహ్వానితులతో నూతన కమిటీ ఎన్నికైందని తెలిపారు. రాష్ట్రకార్యదర్శిగా పి.మధు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ హైదరాబాద్‌లో జాతీయ మహాసభలు జరగనున్నాయని, ఈ మహాసభకు రాష్ట్రం నుంచి 23 మంది ప్రతినిధులు, ఇద్దరు పరిశీలకులను మహాసభ ఎన్నుకుందన్నారు. మహాసభను జయప్రదం చేసిన పశ్చిమగోదావరి జిల్లా కమిటీలకు, కార్మికులకు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎ1 కన్వెన్షన్‌లో సంతోష నగరాల సదస్సు

ఏర్పాట్లను సమీక్షించిన సిఎం

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ఏప్రిల్ 10 నుంచి 12 వరకు జరుగనున్న 'హ్యాపీ సిటీస్ సమ్మిట్– 2018' (సంతోష నగరాల సదస్సు) కార్యక్రమానికి వేదికగా విజయవాడ ఎ–1 కన్వెన్షన్ సెంటర్‌ను ముఖ్యమంత్రి ఖరారు చేశారు. సోమవారం సచివాలయంలో కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సిఎం సమీక్షించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని భవానీ ద్వీపంలో నిర్వహించాలనుకున్నారు. 'అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ టు గ్లోబల్ లివింగ్' థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సిఎం ఈ సందర్భంగా సూచించారు. సుమారు 2 వేల మంది అతిథులు ఈ సదస్సుకు రానున్నట్లు అంచనా వేశారు. సదస్సులో అతిథులకు ఆర్గానిక్ ఫుడ్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమం లోగో రూపకల్పనపైనా సమావేశంలో చర్చించారు. హ్యాపీ సిటీస్ సమ్మిట్ లోగోలో అసెంబ్లీ భవనం, హరిత, జల రాజధాని ఇతివృత్తాన్ని ప్రతిబింబించాలని అధికారులకు సూచించారు. అతిథులకు భద్రత, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వహణపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన అరుణతారలు, జయమ్మునిశ్చయమ్మురా, నేలకొరిగిన కోకిల తదితర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు విరపు బాలసుబ్రహ్మణ్యం, పాటూరు రామయ్య, చౌదరి తేజేశ్వరరావు, భిక్షవతి, జోయ, పుతుంబాక భారతి బివి రాఘవులు, రమాదేవి, ధనలక్ష్మీ, బుక్‌హౌస్ ఎడిటర్ ఉషారాణి తదితరులు



సిపిఎం త్రిపుర రాష్ట్ర ఎన్నికల నిధి కోసం ఏచూరి, కరత్ ద్వారా రూ.లక్ష విరాళం అందజేస్తున్న పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా నాయకులు

కేంద్రం మరో మాయ!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి లోటు నిధులు, పోలవరం, రైల్వేజోన్‌పై సానుకూలంగా స్పందించినట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే! అయితే, దీనిపై ఇంతవరకు తమకు ఎటువంటి సమాచారం రాలేదని ఉన్నతస్థాయి అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ హామీలను కేంద్రం అమలు చేస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ఆందోళనను మెత్తబరిచేందుకే ఈ హామీని ఇచ్చి ఉంటుందన్న అభిప్రాయంలో కొందరు అధికారులు ఉన్నారు. ఆదివారం ముఖ్యమంత్రితో జరిగిన భేటీలో అనేక మంది పార్లమెంట్ సభ్యులు పాల్గొనకపోవడం కూడా అధికారవర్గాల్లో చర్చనీ యాంశమైంది. ఎంపిల్లో కూడా భిన్న వాదనల్ని వినిపిస్తున్నారని, కొంతమంది కేంద్రానికి అనుకూలంగా మాట్లాడుతున్నారన్న విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. లోటు భర్తీకి సంబంధించి ఇప్పటికే చాలా నష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారు. రూ.16వేల కోట్లకు ఎజి నిర్ధారణకుగాను కేవలం 4 వేల కోట్లేనని కేంద్రం ప్రకటించడంపైనా వారు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం చెప్పిన గత అంచనాల మేరకు ఇంకా రూ.4000 కోట్లు రావాల్సి ఉంటుందని రాష్ట్రం డిమాండ్ చేయగా, కేంద్రం మాత్రం నాలుగువేల కోట్లు ఇస్తామని చెప్పింది. అయితే ఇప్పటి వరకూ ఇచ్చిన మొత్తాన్ని కలిపి నాలుగు వేల కోట్లుగా కేంద్రం భావిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతుండడం రాష్ట్ర అధికారులకు మింగుడుపడడం లేదు. అందుకే లోటుపై కేంద్రం ఆలోచనలు, హామీలు అనుమానాలు కలిగిస్తున్నాయని సీనియర్ ఆర్థికశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఇదే పరిస్థితిలో రాజధాని నిర్మాణం కూడా ఉందని గుంటూరు, విజయవాడ డ్రైనేజీకి ఇచ్చిన నిధులు వెయ్యి కోట్లు మినహాయిస్తే, రాజధానికి ఇచ్చింది కేవలం 1500 కోట్లేనని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇలా అయితే రాజధాని నిర్మాణం జరిగినట్లేనని వారు పెదవి విరుస్తున్నారు. పోలవరంపైనా ఆశలు ఆవిరయ్యే పరిస్థితే కనిపిస్తోందని వారు చెబుతున్నారు. 2019లోగా ఈ ప్రాజెక్టు ఎలా పూర్తవుతుందన్నది ప్రశ్నార్థకంగానే ఉన్నట్లు వారు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 15న ఢిల్లీలో జరిగే సమావే శంపై మరో సారి ఆశల్ని పెట్టుకుంటున్నారు. అన్ని రాష్ట్రాల నీటిపారుదల మంత్రులు, నీటిపారుదల, ఆర్థికశాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సమావేశం కోసం రాష్ట్ర అధికారులు నివేదికల్ని కూడా సిద్ధం చేసుకుంటున్నారు. ఈ చర్చల్లో భాగంగానే పోలవరంపై గట్టిగా పట్టుబట్టాలని భావిస్తున్నారు. పైసా కూడా బడ్జెట్‌లో కేటాయించని పరిస్థితుల్లో 2019 నాటికి పోలవరాన్ని ఎలా పూర్తి చేస్తారో వివరించాలని వారు డిమాండ్ చేయనున్నారు.

భయం గుప్పిట్లో సరిహద్దు గ్రామాలు

(మొదటి పేజీ తరువాయి)

పాటు బాద్రి గులాబ్‌గఢ్, అవదాల్, కపూర్‌పూర్, కుశాల్‌పూర్ వంటి గ్రామాలలో కొన్ని సెటిల్మెంట్లు కూడా పాక్ సైనికుల తుపాకులకు టార్గెట్లుగా మారుతున్నాయి. ఇవన్నీ సియాల్ కోట్‌కు 11 కి.మీ దూరంలోనూ, లాహోర్‌కు 141 కి.మీ దూరంలోనూ వున్న ప్రాంతాలే. సుచేత్‌గఢ్‌కు కేవలం ఐదు కి.మీ దూరంలో వున్న సంకా, షాబాద్ టంకన్‌వాలి గ్రామాల వాసులు శత్రువుల తుపాకీ గుండ్లు తమకు వెంట్రుకవాసిలో దూసుకుపోతున్నాయని భయాందోళనలు వ్యక్తం చేశారు. జమ్మూ కు దాదాపు 30 కి.మీ పరిధిలో వుండే ఈ గ్రామాలన్నీ ప్రధానంగా వ్యవసాయాధారమైనవే. సరిహద్దుల్లో సైనిక విన్యాసాలు కొనసాగే సమయంలో వీరిని కొద్దిరోజుల పాటు ఇతర ప్రాంతాలకు తరలించటం సాధారణంగా జరుగుతూ వుండే కార్యక్రమమే. అయితే గత ఏడాది ఆగస్టు తరువాత తమ ఇళ్లు, పశుసంపదపై శత్రువుల కాల్పులు విపరీతంగా పెరిగిపోయాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుడే నయం

1971 నాటి యుద్ధంలో తమ గ్రామంపై కేవలం రెండు షెల్స్ మాత్రమే పడ్డాయని, గత ఆగస్టు నుండి ఇప్పటి వరకూ దాదాపు 250–300 షెల్స్ తమ 170 కుటుంబాలపైకి దూసుకొచ్చాయని షాబాద్ టంకన్ వాలి గ్రామ సర్పంచ్ స్వరణ్‌సింగ్ చెప్పారు. గతంలో శత్రువు కాల్పులపై సైన్యం ముందుగా హెచ్చరించి తమను సురక్షిత ప్రాంతాలకు తరలించేదని, గత ఆగస్టు నుండి అటువంటి హెచ్చరికలేమీ జారీ చేయటం లేదని సారికా సోనా అనే మహిళ వివరించారు. గత జనవరి 18న ఇరుదేశాల సైన్యాల మధ్య ఎటువంటి హెచ్చరికలూ లేకుండానే కాల్పులు ప్రారంభమయ్యాయని, సాయంత్రం ఆరుగంటలకు ప్రారంభమైన ఈ కాల్పులు ఉదయం వరకూ కొనసాగుతూనే వున్నాయని ఆమె చెప్పారు. అందులో ఒక షెల్ వచ్చి తమ ఇంటిపై పడటంతో తమ ఇంటి కిటికీలు, మెట్లు, టెర్రెస్ దెబ్బతిన్నాయని ఆమె వివరించింది.

ఎదురుకాల్పుల్లో జవాను మృతి

ఉగ్రవాదులకు, సిఆర్‌పిఎఫ్ జవాన్లకు మధ్య సోమవారం ఉదయం జరిగిన కాల్పుల్లో ఒక జవాను మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. శ్రీనగర్‌లోని కారానగర్ ప్రాంతంలోని అత్యంత కీలకమైన పారా మిలటరీ ఫోర్స్‌కు చెందిన 23 బెటాలియన్ క్యాంప్ లక్ష్యంగా ఇద్దరు ఉగ్రవాదులు ఎకె–47 రైఫిల్స్‌తో దాడికి పాల్పడ్డారు.. భద్రతాదళాలు ఎదురుకాల్పులు జరపడంతో వారిద్దరు క్యాంప్‌కు ఎదురుగా నిర్మాణంలో ఉన్న భవనంలో ఆశ్రయం పొందినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో ఇరుపక్షాల మధ్య కాల్పులు జరిగాయని, అయితే ఉగ్రవాదులు తప్పించుకున్నట్లు సైనికాధికారులు పేర్కొన్నారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, శ్రీనగర్‌లోని కారానగర్ ప్రాంతాన్ని తమ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు

స్వలాభం కోసమే బాబు రాజీపడ్డారు

వైసిపి అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వలాభం కోసం రాజీపడటం వల్లే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని వైసిపి అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ఆరోపించారు. హిట్లర్ వల్ల జర్మనీ జాతి ఏవిధంగా నష్టపోయిందో, చంద్రబాబు చేతగానితనం వల్ల ఆంధ్ర జాతి నష్టపోతోందన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని రాజకీయ పార్టీలు సహా 5 కోట్ల మంది ప్రజలు ఏకమై ప్రశ్నిస్తుంటే, టిడిపి నేతలు మాత్రం ఏదో సాధించినట్లుగా సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. పార్లమెంటులో ఎంపీ గల్లా జయదేవ్ అటూ,ఇటూ కాని ప్రసంగం చేస్తే ఊరేగింపులు, సత్కారాలు, సన్మానాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొన్ని రోజులుగా ఎంపీలు, ఎమ్మెల్యేల నటనకు నంది, ఆస్కార్ అవార్డులివ్వొచ్చని ఆమె ఎద్దేవా చేశారు. కేసులకు భయపడి సగం పార్టీని కేసీఆర్‌కు, మరో సగం పార్టీని కాంగ్రెస్‌కి చంద్రబాబు అమ్మేశారని విమర్శించారు. చొక్కాలు చించుకున్నా ప్రజలు క్షమించే పరిస్థితి లేరన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బయటకొచ్చి, రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడాలని ఆమె డిమాండ్ చేశారు.

కంబాల దున్నపోతుల పోటీలపై 'స్టే'కు

సుప్రీం నిరాకరణ

బెంగళూరు : కర్ణాటకలో ప్రతి ఏటా నిర్వహించే కంబాలా దున్నపోతుల పోటీల నిర్వహణపై తాత్కాలిక స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈకేసుకు సంబంధించి జంతువుల హక్కుల సంఘం (పెటా) వాదనలను మార్చి 12న వింటామని న్యాయస్థానం సోమవారం వెల్లడిం చింది. ఎ.ఎం. కన్విల్కర్, డివై. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పోటీలపై స్టే విధించటం కుదరదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వపు అనుమతి పొందిన కంబాలాపోటీలకు సుప్రీంకోర్టు అనుమతి కూడా లభించిందని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా పేర్కొన్నారు. సాంప్రదాయం పేరిట జంతువులను హింసించే విధంగా పోటీలను నిర్వ హించటాన్ని సవాలు చేస్తూ జంతువుల సంరక్షణ సంస్థలలో ఒకటైన ఫియోపో అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్ర యించింది. ఉత్తర కర్ణాటక, ఉడిపిలోని తీరప్రాంతపు జిల్లాలు, దక్షిణ కన్నడ ప్రాంతాలలో జంట దున్నపోతుల పోటీలు నిర్వహిస్తారని, వీటినే కంబాలా పోటీలని పిలుస్తారని ఈ సంస్థలు తెలిపాయి. నవంబరు మార్చి నెలల మధ్యలో ఈ పోటీలను ఏర్పాటుచేస్తారని తెలిపారు. మంచి పంటలకోసం దేవుళ్లను ప్రసన్నం చేయటం కోసమని ప్రవేశపెట్టామని పేర్కొంటూ రైతుల వినోదం కోసం ఈ క్రీడను నిర్వహిస్తున్నట్లు పెటా పేర్కొంది.


సమంత, రామ్ చరణ్

ఎంత సక్కగున్నావే...

రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'రంగస్థలం'. మార్చి 30న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సమంత కథానాయిక. చిట్టిబాబుగా రామ్ చరణ్, రామలక్ష్మిగా సమంత మెప్పించనున్నారు. రెండు వారాల నుంచి ఈ చిత్రం ప్రచార కార్యక్రమాలు పెంచారు. మొన్ననే సమంత ఈ చిత్రంలో ఎలా ఉండబోతుందన్న దానిపై ఓ టీజర్‌ను విడుదల చేశారు. 80వ దశకం నాటి పరిస్థితులకు అద్దంపట్టేలా తీసిన ఈ చిత్రంలో మొదటి గీతాన్ని మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు విడుదల చేయనున్నారు. ఎంత సక్కగున్నావే...అనే పల్లవితో సాగే ఈ గీతంలోని రామ్ చరణ్, సమంత లుక్స్‌ను సోమవారం చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు. దేవిశ్రీప్రసాద్ బాణీలు సమకూర్చాడు. రెండు రోజుల క్రితమే ఈ సినిమా ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించారు. రామ్ చరణ్, పూజా హెగ్డేపై షూట్ చేసిన ఈ గీతం కోసం చెర్రీ డాన్స్‌లు ఇరగదీశాడని, ఆయన అంకిత భావం చూసి ఆశ్చర్యపోయానని ఆ పాటను కంపోజ్ చేసిన జానీ మాస్టర్ పేర్కొన్నారు. చెర్రీతో ఆయన దిగిన ఓ ఫొటోను ట్విట్టర్‌లో పోస్టు చేస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆ గీతం 'జిల్ జిల్ జిగేల్' అనే పల్లవితో సాగుంది. జగపతిబాబు, అనసూయ, ఆదిపినిశెట్టి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.


ఎన్టీఆర్

'బిగ్ బాస్2'!

'మీలో ఎవరు కోటీశ్వరుడు' భాగాలుగా వచ్చినట్లే.. తాజాగా ఎన్‌టీఆర్ చేసిన 'బిగ్ బాస్' షో రెండో భాగం రానున్నందట. ఎన్టీఆర్ హోస్ట్‌గా వ్యవహరించిన బిగ్ బాస్ తెలుగు సీజన్ వన్ షో టెలివిజన్ రికార్డులన్నింటికీ తిరగరాసింది. టెలివిజన్ రేటింగ్ పాయింట్ లోను, టెలివిజన్ వీవర్స్ పాయింట్‌లోను అత్యధిక పాయింట్స్ రాబట్టి ముందుస్థాయిలో దూసుకుపోయింది. అందుకే ఆ ఛానెల్ బిగ్‌బాస్ సీజన్ 2 కోసం అన్ని ఏర్పాట్లు చేస్తుందట. ఇందులోనూ ఎన్టీఆరే హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. ఈ షో కోసం కంటెస్టెంట్ ఎంపిక వేగంగా జరుగుతోందని తెలిసింది. సినిమా, టీవీ రంగాల్లో ఉన్న వారితో పాటు ఇతర రంగాల వారు కూడా ఈ షోలో పాల్గొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సారి కంటెస్టెంట్‌తో పాటు రోజులు కూడా పెరగనున్నట్లు సమాచారం. మొదటి సీజన్లో 14 మంది 70 రోజుల పాటు బిగ్ హౌస్‌లో ఉండేందుకు వచ్చారు. ఇప్పుడు 18 మంది 100 రోజుల పాటు హౌస్‌లో ఉండేందుకు పోటీ పడనున్నారు. జూన్ నుంచి మొదలు కానుంది ఈ రియాలిటీ షో. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కనున్న షూటింగ్‌లో పాల్గొంటూనే బిగ్ హౌస్‌కి ఎన్టీఆర్ వెళ్లి రానున్నారు.

డైరెక్టర్‌గా పదికి పది మార్కులు ఇచ్చుకుంటా

మంజుల



"నేను దర్శకురాల్ని అవ్వాలనే ఈ రంగంలోకి వచ్చా. పలువురు దర్శకుల సినిమాలు పరిశీలించాను. పూర్తి సెట్‌ను నా చేతిలోకి తీసుకున్నాను. సినిమాటోగ్రాఫర్ రవి యాదవ్.. 'అదేంటి మేడమ్, పది సినిమాలు చేసిన అనుభవమున్న డైరెక్టర్‌గా అనిపిస్తున్నారు' అని అన్నారు. డైరెక్టర్‌గా పదికి పది మార్కులు ఇచ్చుకుంటాను. డైరెక్షన్ చేస్తానని చెప్పగా.. నా భర్త ఎంకరేజ్ చేశారు. అలాగే నాన్న ఎంతో హ్యాపీగా, థ్రిల్‌గా ఫీలయ్యారు. 'మహేష్.. నీకు పిచ్చెక్కిందా? దర్శకత్వం చేయడం ఎంతో కష్టం' అన్నాడు. ఆ తర్వాత ట్రైలర్ చూసి తను షాకయ్యాడు. చాలా బావుందని అప్రిసియేట్ చేశాడు. నాన్నగారు, మహేష్ ఇద్దరూ తొలిరోజు, తొలి ఆటను చూస్తామని చెప్పారు. దర్శకత్వంలో నాకు ఎవరి ఇన్‌స్పిరేషన్ లేదు. ఒక్కొక్క దర్శకుడిలో ఒక్కొక్క శైలి నచ్చుతుంది" అని దర్శకురాలు మంజుల ఘట్టమనేని అన్నారు. ఆమె చేసిన చిత్రం 'మనసుకు నచ్చింది' సందీప్ కిషన్ హీరోగా అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరోయిన్‌గా నటించారు.

ఈ కథకు ఆధారం ఏమిటి?

పచ్చనిచెట్లు, పక్షుల కిలకిలలు, నదులు, సరస్సుల హొయలు, సూర్యోదయం, అస్తమయం.. వంటి వెన్నో ప్రకృతిలో ఉన్న అద్భుతాలు మనస్సుకు నచ్చుతాయి. ఇలాంటివి సినిమా నేపథ్యంగా తీస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతోనే నా మనసుకు నచ్చిన సినిమా తీశాను.

మీ మనసుకు ఏవిధంగా నచ్చింది?

ఏదో ఒక సినిమా చేయాలనే స్థితిలో నేను లేను. కానీ ఈరోజు సినిమా చేస్తున్నానంటే.. నా హృదయంలోని విషయాలను వ్యక్తపరచాలనే ఉద్దేశంతోనే. ఎక్కడో.. ఏదో ఒక సినిమా.. ఐడియా చూసి చేసిన సినిమా కాదు. నా హృదయంలో నుండి వచ్చిన ఆలోచనతో చేసిన సినిమా ఇది. ప్రకృతి ప్రేమికురాలిగా మంచి కథను రాసుకుని చేశా.

ఇందులో మీరు చెప్పే అంశాలేమిటి?

సినిమా అనేది కళ. ఎంటర్‌టైన్‌మెంట్ అవసరమే. దీంతో పాటు ఏదో ఒక చిన్న మార్పు కూడా ఉండాలి. అలా మార్పుతో ఉండే సినిమా 'మనసుకు నచ్చింది'. రేపు సినిమా చూసిన తర్వాత సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని చూడాలనుకుంటారు. మన జీవితంలో చిన్న చిన్న ఆనందాలను వదిలేసుకుంటున్నాం. వేగవంతమైన జీవితంలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాం. నేను కూడా ఒకప్పుడు అలాగే ఉండేదాన్ని. కానీ ఎప్పుడైతే జీవితంలో చిన్న చిన్న ఆనందాలను ఆస్వాదించడం మొదలు పెట్టానో.. పక్షుల కిల కిల రావాలు.. పువ్వుల సువాసన ఆస్వాదించడం.. నాకు చాలా ప్రశాంతంగా అనిపించింది. నేను దాన్ని అందరికీ షేర్ చేయాలనిపించింది. నేను ఫీల్ అయిన అనుభవాలను సినిమా రూపంలో చెబితే బావుంటుందనిపించింది.

ప్రేమకథతో పాటు మరేదైనా చెప్పదలిచారా?

ఈ కథ ఓ సముద్రంలాంటిది. ఇందులో చాలా కోణాలు ఉంటాయి. కంప్లీట్ ఫన్ లవ్‌స్టోరీ. కథ వెనుక మరో కథ ఉంటుంది. మన మనసుకు మనం కనెక్ట్ కావడానికి నేను ప్రకృతి అనే అంశాన్ని ఈ సినిమాలో ఉపయోగించాను. ఈ సినిమాలో అసలు హీరో ప్రకృతే. ప్రకృతి రూపంలో మహేష్‌బాబు వాయిస్ ఓవర్ ఇచ్చాడు.

చాలా సమయం పట్టినట్లుంది?

నేనే మొత్తం స్క్రిప్ట్‌ను రాసుకున్నాను. అలా స్క్రిప్ట్ అంతటినీ తయారు చేసుకోవడానికి ఏడాది సమయం పట్టింది. నేను ఇంగ్లీష్‌లో రాసిన దాన్ని సాయిమాధవ్ బుర్రా స్వచ్ఛమైన తెలుగులో రాశారు. ఇది పూర్తి కావడానికి ఏడాదిన్నర సమయం పట్టింది. క్యారెక్టర్‌కి ఓ ఫ్లో ఉంటుంది. నేను త్వరగా ఏదో చేసేయాలని ఆ ఫ్లోను దెబ్బతీయలేను. మంచి సినిమా చేయాలనే ఈ సినిమా చేశాను. ఎందుకంటే మంచి సినిమాలు మన జీవితంలో ఎంతో కీలక పాత్రను పోషిస్తాయి. మంచి కథాబలం ఉన్న సినిమాలు చేయడం నా బాధ్యత.

మీ నిజజీవిత ప్రేమకథను టచ్ చేశారా?

ఇది నిజ జీవితానికి సంబంధించిన కథ కాదు. ఫిక్షనల్ స్టోరీ. నా జీవితంలో లవ్‌స్టోరీ ఉంది. కానీ దానికి, సినిమాకు సంబంధం లేదు. సినిమాలో నేను చూపిన నిత్య క్యారెక్టర్, నా హృదయానికి దగ్గరగా ఉంటుంది. క్యారెక్టర్స్ ప్రవర్తించే కొన్ని లక్షణాలను నాన్న, మహేష్ ఇలా రియల్ లైఫ్ వ్యక్తుల నుండి తీసుకున్నవే కానీ. కథ మాత్రం ఫిక్షనల్. ఇద్దరు మధ్య సాగే ఫన్ లవ్‌స్టోరీ.

మీరు చెబుతున్నదాన్నిబట్టి పెద్దవంశీ చిత్రంలా అనిపిస్తుంది?

అవును. నేను ఆయన సినిమాలు చూడలేదు. కథ విన్నాక చాలామంది ఆయన పేరు ప్రస్తావించారు.

సందీప్‌ను అనుకుని కథ రాశారా?

నేను ఎవరినీ దృష్టిలో పెట్టుకుని కథను రాసుకోలేదు. అలా రాయడం నాకు నచ్చదు. కథ పూర్తయిన తర్వాతే నటీనటుల ఎవరైతే బావుంటుందని ఆలోచించాం. నాన్న, మహేష్ సినిమాలే ఎక్కువగా చూస్తాను. ప్రస్తుతం ఉన్న యంగ్ హీరోస్ గురించి నాకు పెద్దగా తెలియదు. సినిమా చేసే క్రమంలో కొంత మందిని వెళ్లి కలిశాను కూడా... అయితే వర్కవుట్ కాలేదు. చివరకు సందీప్ పేరుని నిర్మాత కిరణ్ సూచించారు. తను చేసిన 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సీడీని కూడా నాకు పంపారు. నేను ఆ సినిమాను చూడలేదు కూడా. కానీ తనని కలిసిన తర్వాత తను సూట్ అవుతాడనిపించింది. తను స్పాంటేనియస్. తనకు కరెక్ట్ ఇన్‌పుట్ ఇస్తే.. తన అవుట్‌పుట్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది. తన క్యారెక్టర్‌లో వేరియస్ ఎమోషన్స్ ఉంటాయి. చాలా డైమన్షన్స్ ఉంటాయి.

మహేష్‌తో సినిమా అన్నారు ఎప్పుడు?

నేను మహేష్‌కి ఎలాంటి కథ రాయాలి అని ఆలోచించకూడదు. ఎందుకంటే తన యాక్టింగ్ గురించి అందరికీ తెలిసిందే. అయితే తన ఇమేజ్‌కు తగ్గ కథ అయితే తనే పిలిచి సినిమా చేయమంటాడు. అదీగాక తను సెట్‌లో నా మాట వినడు. ఇద్దరం కొట్టుకుంటాం. మహేష్‌తో సినిమా చేయడం నా డ్రీమ్.

పవన్‌తో సినిమా అని స్టేట్‌మెంట్ ఇచ్చారు?

ఇటీవలే ఫంక్షన్‌లో పవన్‌తో సినిమా అని అన్నాను. క్యాజువల్‌గా అన్నా. ఆయన కోసం ఓ కథ రాసుకున్నా. తనకు మాత్రమే సూట్ అయ్యే కథ ఉంది. తను ప్రజా సేవ చేయాలనే తపనతో సినిమాలనుండి రాజకీయాలకు వెళుతున్నాడు. దానికి సంబంధించిన కథ నా దగ్గరుంది.


నివేదా థామస్

నివేదా... నీకెంత ధైర్యమో!

పాముని చూస్తేనే ఆమడ దూరంలో పారిపోతారు చాలా మంది. ఎవరో స్నేక్ సేవర్స్ తప్ప వాటిని ధైర్యంగా పట్టుకోగలిగే వారు తక్కువే. సినిమాల్లో హీరో హీరోయిన్స్ పాములతో అన్నీ చేస్తారంటే అది ఎంత వరకూ వాస్తవమో అందరికీ తెలిసిందే. కానీ ఈ 'జెంటిల్‌మేన్' అమ్మడు...అదేనండీ...నివేదా థామస్ కొండ చిలువనే మెడలో వేసుకుని తన సరదాలు తీర్చుకుందట. అంతేకాదు వాటిని ఆడించి అప్పుడు తీసుకున్న ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా పోస్టు చేసింది. 'బాబ్రాను పరిచయం చేసుకోండి. ఆనందానికి చిన్న పని. కానీ అనుకున్నంత చిన్నదైతే కాదు' అని ఈ ఫొటోలకు క్యాప్షన్ ఇచ్చింది నివేదా. ఈ ఫొటో చూసిన అభిమానులు 'అమ్మో! నివేదా నీకెంత ధైర్యమో అని తెగ పోస్టు మీద పోస్టులు పెటేస్తున్నారు. ప్రస్తుతం నివేదా నాగశౌర్య కథానాయకుడిగా చేస్తున్న ఓ చిత్రంలో కథానాయికగా చేస్తుంది. సాయిశ్రీరామ్ దర్శకత్వంలో ఈ సినిమా రాబోతోంది.


సల్మాన్ ఖాన్

గుర్రానికి రెండు కోట్లు

అయినా ఇవ్వడానికి నిరాకరించిన యజమాని

బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్, తెలుగు చిత్రసీమలో రామ్ చరణ్‌కు గుర్రాలు పెంచడమంటే చాలా ఇష్టం. వీరిద్దరూ గుర్రాల కోసం ప్రత్యేక శాలలనే నిర్మించి పెంచుతున్నారు. కండల వీరుడు సల్మాన్ ఖాన్ కొత్త గుర్రాన్ని కొనాలనుకున్నాడట. దానికి రెండు కోట్లు ఇస్తానని చెప్పాడట. అయినా ఆ గుర్రం యజమాని దాన్ని ఇవ్వడానికి ఇష్టపడలేదు. సల్మాన్ అడిగినా ఇవ్వలేనన్ని ప్రత్యేకతలు ఆ గుర్రంలో ఏమున్నాయి? అసలు గుర్రం ఎవరిది? అని పరిశీలిస్తే...సిరాజ్ పాతన్ అనే వ్యక్తి ఐదేళ్ల క్రితం ఈ గుర్రాన్ని రాజస్థాన్‌లో ఓ సంతలో 14.5 లక్షలకు కొనుగోలు చేశాడు. ఈ గుర్రానికి అంతకు ముందు తుఫాన్, పవన్ అనే పేర్లు ఉండేవి. సిరాజ్ కొన్నాక దానికి సఖిబ్ అనే పేరు మార్చేశాడు. ఇది గంటకు 43 కిలోమీటర్లు వేగంతో పరుగెత్తగలదు. ఇప్పటి వరకూ ఒక్క రేస్‌లోనూ పాల్గొలేదు. ఈ గుర్రానికి తల్లి పాకిస్తాన్‌లోనూ, తండ్రి రాజస్థాన్‌లో ఉన్నాయి. ఇటువంటి గుర్రాలు అమెరికా, కెనడాల్లో మాత్రమే ఉంటాయి. అందుకే ఇంత డిమాండ్. ఈ గుర్రానికి సల్మాన్‌కు ముందు పంజాబ్ ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన బాదల్ ఫ్యామిలీ 1.11 కోట్లు ఇస్తానని చెప్పినా ఇవ్వలేదట. ఇప్పుడు సల్మాన్ రెండు కోట్లు ఇస్తానన్నా ఇవ్వలేదు.



'జువ్వ' పాటలు వచ్చేశాయ్

రంజిత్, పాలక్ లల్వాని జంటగా నటిస్తున్న సినిమా 'జువ్వ'. భరత్ సోమి నిర్మాత. 'దిక్కులు చూడకు రామయ్య' ఫేమ్ త్రికోటి దర్శకత్వం వహించారు. ఎం.ఎం.కీరవాణి సమకూర్చిన పాటలు విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఆడియో వేడుకలో వినాయక్, బొత్స సత్యనారాయణ, ఝాన్సీ దంపతులు ఆవిష్కరించారు. ఎం.ఎం.కీరవాణి మాట్లాడుతూ 'దర్శకుడు త్రికోటి చాలా సంవత్సరాలుగా తెలుసు. ఈ చిత్రం ప్రేక్షకులకు విందు భోజనం లాంటిది. సినిమా నేను చూశా. అన్ని రకాల ఎమోషన్స్ ఉన్నాయి. హీరో రంజిత్ డాన్స్, ఫైట్స్ బాగా చేశాడు' అని అన్నారు.


బొత్స సత్యనారాయణ, ఝాన్సీ, రంజిత్, వినాయక్, త్రికోటి, కీరవాణి, పాలక్ లల్వాని

మాటల రచయిత ఎం.రత్నం మాట్లాడుతూ 'కథకు సంబంధించిన విషయంలో దర్శకుడు కచ్చితంగా ఉంటాడు. సీన్ నచ్చేదాకా తనకు కావలసిన విధంగా రాసివ్వాలి. ఈ సినిమా అతనికి మంచి దర్శకుడిగా గుర్తింపు ఇస్తుంది. హీరో రంజిత్ అనుభవం ఉన్న నటుడిగా చేశాడు. హీరోయిన్ నటన బాగుంది. పాటలు బాగున్నాయి. కీరవాణి అబ్బాయి భైరవ పాడిన 'ఓ కలా..' అనే పాట చాలా నచ్చింద'ని అన్నారు

'సత్య గ్యాంగ్'కు అనాధ బాలలే అతిథులు

సమాజంలో అనాధలనేవారు లేకుండా చేయాలనే సందేశానికి వినోదాన్ని జోడించి రూపొందిన చిత్రం 'సత్య గ్యాంగ్'. ఈ సినిమా టీజర్‌ను అనాధ బాలల సమక్షంలో విడుదల చేసి కొదిపాటి ఆర్థిక సాయం చేసినట్టు చిత్ర నిర్మాత మహేష్ ఖన్నా తెలిపారు. సాత్విక ఈశ్వర్‌ని హీరోగా పరిచయం చేస్తూ.. సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై రూపొందుతోన్న సినిమా ఇది. ప్రభాస్ దర్శకత్వం వహించారు. షూటింగ్ పూర్తయి పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ ముగించుకున్న ఈ చిత్రం టీజర్‌ని ఫిలిం ఛాంబర్12 మంది అనాధబాలులు విడుదల చేశారు. త్వరలోనే ఆడియోను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. ఈ కార్యక్రమంలో సాత్విక్ ఈశ్వర్, ప్రత్యూష్, అక్షిత పాల్గొన్నారు.


మహేష్ ఖన్నా, సాత్విక్ ఈశ్వర్, అక్షిత, ప్రత్యూష్ తదితరులు





బోన్‌క్యాన్సర్ నివారణ సాధ్యమే

క్యాన్సర్ వ్యాధి శరీరంలో ఏ భాగానికి సోకినా అది ఆందోళన కలిగించే అంశమే. రకరకాల క్యాన్సర్లలో బోన్ క్యాన్సర్ కూడా ఒకటి. వివిధ కారణాల వల్ల ఎముకల్లో వచ్చే కణితినే బోన్ క్యాన్సర్ అంటారు. నేరుగా ఎముకకే క్యాన్సర్ రావడం కాస్తంత అరుదు. కానీ ఇతర క్యాన్సర్లు ఎముకలకు పాకడం సాధారణం. దీనిని తొలిదశలో గుర్తించి, తగిన చికిత్స అందించగలిగితే సులభంగా దీన్నుంచి బయటపడొచ్చు. అదే తీవ్రమైతే చికిత్స అందించడం చాలా కష్టం. కొన్నిసార్లు ఇది అంగవైకల్యానికీ దారితీయొచ్చు. మరికొన్నిసార్లు ప్రాణాంతకం కూడా. ఎముకలకు వచ్చే క్యాన్సర్లు, వాటి లక్షణాలు, అందుబాట్లో ఉన్న ఆధునిక చికిత్సల విశేషాలే ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్'లో...

ఎముకల సముదాయంతో అస్థిపంజరం ఎవరికైనా ఒక అస్థిత్వాన్ని ఇస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆకృతికి మూలం అస్థిసముదాయమే. శరీరంలోని 206 ఎముకలలో ఏ ఎముకకైనా క్యాన్సర్ రావొచ్చు. ఎముక ఒక ప్రత్యేకమైన కనెక్టివ్ టిష్యూ కణజాలంతో ఏర్పడ్డ గట్టి పదార్థం. ఎముక క్యాన్సర్ మొత్తం శరీరంలో 1.1 శాతం మాత్రమే. బయటకు కనిపించే శరీరాకృతిని అలా నిలబెట్టి ఉంచడానికి తోడ్పడేవి ఎముకలే. వీటిలో మూడు రకాల కణాలు ఉంటాయి. మొదటివి ఆస్టియోబ్లాస్ట్స్ (ఎముక పెరిగే సమయంలో దీని నుంచే కొత్త కణాలు పుడుతుంటాయి). రెండోవి ఆస్టియోసైట్స్ (ఇవి ప్రధాన ఎముక కణాలు), మూడోరకం కణాలను ఆస్టియోక్లాస్ట్స్ అంటారు. అంటే ఎముక కణాల జీవితం పూర్తయ్యాక వాటిని శిథిలంచేసే కణాలివి.

ఎముక క్యాన్సర్ గురించి తెలుసుకునే ముందు క్యాన్సర్ గురించి కాస్త తెలుసుకోవాలి. ఏ అవయవంలోని కణాలైనా ఒక నిర్దిష్ట క్రమంలో కాకుండా తమ ఇష్టం వచ్చినట్లుగా హానికరమైన రీతిలో పెరగడమే క్యాన్సర్. ఇది శరీరంలోని ఏ భాగానికైనా రావచ్చు. శరీరంలోని ఏ భాగంలో క్యాన్సర్ మొదలైతే... దాన్ని ఆ అవయవ క్యాన్సర్‌గా చెబుతారు. ఉదాహరణకు ఊపిరితిత్తులకు క్యాన్సర్ వస్తే దాన్ని లంగ్ క్యాన్సర్ అంటారు. ఏ భాగానికి ముందుగా క్యాన్సర్ వచ్చిందో దాన్ని ప్రైమరీ క్యాన్సర్ అంటారు. క్యాన్సర్ ఆ భాగానికే పరిమితం కాకుండా ఎటుపడితే అటు విస్తరిస్తుంది. ఇలా ఒక క్యాన్సర్ విస్తరించడాన్ని మెటస్టాసిస్ అంటారు.

సాధారణంగా నేరుగా ఎముకకు క్యాన్సర్ రావడం అరుదే అయినా రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటివి వచ్చి... ఆ కణతులు పెరుగుతూ ఎముకలకు వ్యాపించి, నిర్దిష్టమైన ఆకృతిలో సాఫీగా ఉండే ఎముకలపై కణుతులుగా ఏర్పడతాయి. ఇవిగాక... శరీరంలోని మృదుకణజాలమైన చర్మం, కండరాలు, నరాలు, రక్తనాళాల సముదాయం, కొవ్వు కణాలు, ఎముకలోనే ఉండే మృదువైన కణజాలపు పొర సైనోవియమ్ వంటి వాటికి వచ్చే క్యాన్సర్లు కూడా ఉన్నాయి.

లక్షణాలు

✧ ఎముకలో ఏదైనా భాగంలో కణిత పెరగగానే కనిపించే మొదటి లక్షణం నొప్పి. తొలుత ఈ నొప్పి రోజులోని ఏదో ఒక సమయంలో వస్తుంటుంది. క్యాన్సర్ పెరుగుతున్న కొద్దీ నొప్పి వచ్చే వ్యవధీ పెరుగుతుంది. అయితే ప్రతి నొప్పినీ క్యాన్సర్‌గా భావించనవసరం లేదు. ఎందుకంటే ఆర్థ్రైటిస్, ఆస్టియోపోరోసిస్ వంటి సాధారణ జబ్బుల్లోనూ ఎముకలూ, కీళ్లల్లో నొప్పులు వస్తాయి. ఇదే సమయంలో మరో విషయమూ గమనించాలి. ఒక్కోసారి ఎముకలకు వచ్చే కణతులను ఆటల్లో తగిలిన గాయాలుగా పొరబడే అవకాశమూ ఉంది. కాబట్టి జాగ్రత్తగా పరీక్ష చేయించుకుని, క్యాన్సర్ కాదని తేలితే నిశ్చింతగా ఉండొచ్చు.





✧ ఎముకలో నొప్పి వచ్చే చోట, వాపూ కనిపించే అవకాశం ఉంది.

✧ సాధారణంగా క్యాన్సర్ కణాలు వృద్ధి చెందిన ప్రాంతంలో ఎముక బలహీనంగా మారుతుంది. అది తేలిగ్గా విరిగిపోతుంది.

✧ ఎముక క్యాన్సర్‌లో కణిత కీళ్ల వద్ద వస్తే మామూలు కదలికలూ తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. శరీర కదలికలు బాగా తగ్గుతాయి.

✧ ఎముకల్లో నొప్పితో పాటు బరువు తగ్గడం, నీరసం, నిస్సత్తువ కనిపిస్తాయి. క్యాన్సర్ ఇతర అవయవాలకు పాకితే ఆ అవయవానికి చెందిన లక్షణాలూ కనిపిస్తుంటాయి.

ఎముక మృదుకణజాల క్యాన్సర్ల లక్షణాలు

ఎముకలోని మృదుకణజాలానికి క్యాన్సర్ వ్యాపించినప్పుడు తొలి దశలో లక్షణాలు అంతగా కనిపించవు. ఎందుకంటే ఎముక మృదుకణజాలానికి సాగేగుణం (ఎలాస్టిసిటీ) ఎక్కువ. దాన్ని కనుగొనే సమయానికి దాని పరిమాణం పెరిగిపోతుంది. ఈ తరహా క్యాన్సర్లలో మొదటి లక్షణం... నొప్పిలేని గడ్డ. ఈ గడ్డ పెరుగుతూ పోతున్నకొద్దీ నరాలనూ, కండరాలనూ నొక్కుతూ, వాటిపై ఒత్తిడి పెంచుతుంది. దాంతో నొప్పి కలుగుతుంది.

రకాలు

క్యాన్సర్ ఎముకలోనే మొదలైతే దాన్ని 'ప్రైమరీ బోన్ క్యాన్సర్' అంటారు. ఒకవేళ శరీరంలోని వేరే ఏదైనా భాగానికి క్యాన్సర్ వచ్చి అది పాకే క్రమంలో ఎముకకు చేరితే దాన్ని సెకండరీ బోన్ క్యాన్సర్ అంటారు. మామూలుగా ఈ క్యాన్సర్ ఏ ఎముకకైనా రావచ్చు. కానీ చిన్న ఎముకలతో పోలిస్తే పొడుగ్గా పెరిగేందుకు అవకాశం ఉన్న కాళ్లు, చేతుల ఎముకలకు వస్తుంటుంది.

ఎముకల్లోని కణజాలంలో పుట్టడం వలన ఎముకగాకానీ, కార్టిలేజ్‌గా కానీ ఫైబ్రస్ టిష్యూగా కానీ రోగగ్రస్తమైన కణజాలం వృద్ధిచెందవచ్చు. 20ఏళ్ల వయసులోపల 60ఏళ్లు దాటిన వారికీ ఇది సోకే ప్రమాదం ఎక్కువ. స్త్రీ-పురుషుల్లో ఎవరికైనా బోన్‌క్యాన్సర్ రావొచ్చు. కానీ పురుషుల్లో ఎక్కువగా వస్తోంది.

ప్రైమరీ బోన్ క్యాన్సర్

క్యాన్సర్ ముందుగా ఎముకలోనే పుట్టడాన్ని ప్రైమరీ క్యాన్సర్ అంటారు. ఈ తరహా క్యాన్సర్‌ను 'సార్కోమా' అంటారు. ఇందులోని మరికొన్ని రకాలున్నాయి.

✧ **ఆస్టియోసార్కోమా**: ఎముకలోనే పుడుతుంది కాబట్టి దీన్ని 'ఆస్టియోజెనిక్ సార్కోమా' అని కూడా అంటారు. ఎముక క్యాన్సర్లలో ఇది అత్యంత సాధారణంగా కనిపిస్తుంది. ప్రధానంగా భుజాలు, కాళ్లు, పెల్విస్ ప్రాంతపు ఎముకల్లో 10 నుంచి 30 ఏళ్ల వారికి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

✧ **కాండ్రోసార్కోమా :** ఎముకల చివర్లో మృదువైన అస్థికణజాలం ఉంటుంది. దీన్నే కార్టిలేజ్ అంటారు. ఈ కార్టిలేజ్‌లో వచ్చే క్యాన్సర్‌ను కాండ్రోసార్కోమా అంటారు. సాధారణంగా ఇది 20 ఏళ్లలోపు వారికి చాలా అరుదు. అయితే వయసుతో పాటు ఎదుగుతున్న క్రమంలో ఇది వచ్చే అవకాశాలు ఒకింత ఎక్కువగా ఉంటాయి.

✧ **ఎవింగ్స్ సార్కోమా :** ఇది ఎముకల్లోనూ మొదలుకావచ్చు, లేదా కండరాల్లోనూ రావొచ్చు. పిల్లలు, టీనేజర్లలో ఎక్కువగా కనిపించే సాధారణ క్యాన్సర్లలో దీనిని మూడో స్థానం.

✧ **ఫైబ్రోసార్కోమా అండ్ మ్యాలిగ్నెంట్ ఫైబ్రస్ హిస్టియోసైటోమా :** ఈ రెండు రకాల క్యాన్సర్లూ వృద్ధుల ఎముకల చివర్లలో ఉండే మృదుకణజాలంలో మొదలవుతాయి. ప్రధానంగా భుజాలు, కాళ్లు, దవడ ఎముకల్లో ఈ తరహా క్యాన్సర్లు పుడుతుంటాయి.

✧ **జెయింట్ సెల్ ట్యూమర్ ఆఫ్ బోన్:** ఈ తరహా క్యాన్సర్‌లలో అపాయంలేనివీ ఉంటాయి. హాని చేసేవీ ఉంటాయి. అయితే అపాయం కలిగించనివే ఎక్కువ. సాధారణంగా యుక్తవయస్కులు, మధ్యవయస్కుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. చాలావరకు వ్యాపించకుండా స్థిరంగా ఉంటాయి. శస్త్రచికిత్స తర్వాత మళ్లీ వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

✧ **కాడోమా క్యాన్సర్:** సాధారణంగా 30 ఏళ్లు దాటినవారిలో ఇది వెన్నెముకకుగానీ లేదా పుర్రె కిందిభాగపు ఎముకలకుగానీ వచ్చే క్యాన్సర్. మహిళలతో పోలిస్తే పురుషుల్లో ఇది వచ్చే అవకాశాలు రెండు రెట్లు ఎక్కువ. చాలా నెమ్మదిగా పెరుగుతాయి.. కానీ విస్తరించవు. అయితే శస్త్రచికిత్స తర్వాత మళ్లీ వచ్చే అవకాశాలు ఎక్కువ. అప్పుడవి ఊపిరితిత్తులకూ, కాలేయానికీ, లింఫ్‌నోడ్స్‌కూ వ్యాపిస్తాయి.

సెకండరీ బోన్ క్యాన్సర్లు

ఇవి శరీరంలోని ఏ భాగంలోనైనా పుట్టి, రక్తప్రవాహంతోగానీ, లింఫ్ ప్రవాహంతోగానీ క్యాన్సర్ కణాలు ఎముకకు పాకి, అక్కడ పెరుగుతాయి. ఈ తరహా క్యాన్సర్లు సాధారణంగా శరీరం మధ్యభాగంలో ఉండే ఎముకలు అంటే పెల్విస్‌లోగానీ వెన్నెముక (స్పైన్)లోగాని కనిపిస్తాయి.

నిర్ధారణ

ఎముక క్యాన్సర్‌ను అక్కడి నుంచి చిన్నముక్క తీసి (బయాప్సీ) పరీక్షించి నిర్ధారణ చేస్తారు. బయాప్సీ ద్వారా క్యాన్సర్ ఏ దశలో ఉందన్న విషయాన్ని నిర్ణయించడం మీదే చికిత్స ఆధారపడి ఉంటుంది. దాని పరిస్థితిని ఇతర ఆర్థోపెడిక్ సర్జన్లతోనూ సంప్రదించి, రోగిని బతికించడానికి సదరు అవయవాన్ని ఏ మేరకు తొలగించాలన్న విషయాన్ని నిర్ధారిస్తారు. ఎముక క్యాన్సర్ ఏ దశలో ఉందనే విషయాన్ని నిర్ధారణ చేయడానికి అమెరికన్ జాయింట్ కమిషన్ ఆన్ క్యాన్సర్ (ఏజేసీసీ) రూపొందించిన మార్గదర్శకాలను పాటిస్తున్నారు. ఇందులో ట్యూమర్ (టీ), లింఫ్ నోడ్ (ఎన్), మెటాస్టాసిస్ (ఎమ్) అనే మూడు అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. దీన్నిబట్టి క్యాన్సర్ ఏ దశ (గ్రేడ్)లో ఉందో తెలుసుకుంటారు. అందుకే ఈ దశను 'జీ' (గ్రేడ్) అనే అక్షరం ద్వారా సూచిస్తారు. జీ1, జీ2 అనే దశలో తక్కువ తీవ్రమైనవిగానూ, జీ3, జీ4 దశలో చాలా తీవ్రమైనవిగానూ నిర్ణయిస్తారు. వ్యాధి తీవ్రత ఆధారంగా చికిత్స మారుతుంది.

చికిత్సలు

బోన్ క్యాన్సర్ తీరుని బట్టీ చికిత్సలుంటాయి. రేడియోథెరపీ కెమోథెరపీ, ఫ్రాక్షనేటెడ్ డోస్ కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ. శస్త్ర చికిత్సలు ముఖ్యమైనవి. శస్త్ర చికిత్సలో అయితే కాలు కానీ, చెయ్యి కానీ తీసెయ్యడం తప్పదు. మిగిలిన సందర్భాల్లో రేడియోథెరపీ ,కెమోథెరపీ ఇవ్వడం, క్రమం తప్పకుండా స్కాన్‌లు తీయించుకుంటూ క్యాన్సర్ ఎక్కడికీ పాకలేదని నిర్ధారించుకుంటూ ఉండాలి. ఇలా ఐదేళ్లు అది విస్తరించకుండా, మిగతా చోట్లకు వ్యాపించకుండా ఉంటే ఇక ప్రాణానికి ముప్పులేనట్లే. దీనినే ఐదేళ్ల సర్వైవల్ రేట్ అంటారు.

అలాగే కణితని అతి చిన్నదిగా ఉన్నప్పుడే కనుక్కుని ఎక్కడికీ పాకలేదని నిర్ధారించుకుంటే కాలు కానీ, చెయ్యి కానీ తొలగించాల్సిన అవసరం లేకుండా చికిత్స చెయ్యొచ్చు. దీన్నే లింబ్ సాల్వేజ్ పద్ధతి అంటారు. అంటే కణితని మాత్రమే తీసి, కొత్త కస్టమ్ మేడ్ జాయింట్ వేసే పద్ధతి. ఇది చాలా ఖరీదైన వైద్యం. అయితే ఒక్కొక్కసారి ఇది చేసినా కొన్నిరోజుల తర్వాత అదే బోన్‌లో కానీ శరీరంలో వేరేచోట్లకు విస్తరించే ప్రమాదం లేకపోలేదు. అందువల్ల పిల్లల్లో కాళ్ళ మీద నొప్పులు, వాపులు విషయంలో అశ్రద్ధ చెయ్యకూడదు. పెద్దవాళ్ళు నడుము నొప్పి, ఎముకల నొప్పుల వంటివాటితో చాలా రోజులుగా బాధపడుతుంటే అశ్రద్ధ చేయకుండా.. ఎముకలు పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం.



డాక్టర్ రమణ యశస్వి
ఎంఎస్ (ఆర్థో)
ప్రొఫెసర్ ఆఫ్ ఆర్థోపెడిక్స్
గుంటూరు వైద్య కళాశాల
9848078807

లింబ్ సాల్వేజ్ సర్జరీ

ఏ ఎముకకు క్యాన్సర్ సోకినా సాధ్యమైనంత వరకు ఆ అవయవాన్ని తొలగించకుండా కాపాడడమే డాక్టర్ల లక్ష్యం. శస్త్రచికిత్స ప్రక్రియను ఎంపిక చేసుకున్నప్పటికీ ఇందుకోసమే వారు శ్రమిస్తారు. ఈ ఉద్దేశాన్నే వైద్యపరిభాషలో 'లింబ్ సాల్వేజ్ సర్జరీ' (ఎల్.ఎస్.ఎస్.)అంటారు. ఇందులో రెండు దశలుంటాయి. మొదటి దశలో ఆరోగ్యకరమైన భాగాన్ని వీలైనంతగా రక్షిస్తూ క్యాన్సర్‌కు గురైన భాగాన్ని పూర్తిగా తొలగించడం. రెండో దశలో తొలగింపు తర్వాత కోల్పోయిన భాగాన్ని పునర్నిర్మించడం. దీనికోసం వివిధ మార్గాలు అవలంబిస్తారు. ఉదాహరణకు... కోల్పోయిన ఎముక స్థానంలో లోహంతో చేసిన అలాంటి ఆకృతినే అమర్చుతారు. ఇలా కత్రిమంగా అమర్చే లోహభాగాన్ని 'ప్రోస్థెసిస్' అంటారు. ఒక్కోసారి మొత్తం ఎముకే లోహంతో తయారుచేసి, తొలగించిన ఎముక స్థానంలో దీన్ని అమరుస్తారు. ఇది ఎముక మార్పిడి (బోన్ ట్రాన్స్‌ప్లాంట్) చికిత్స. ఇలా చేయడానికి అనుగుణంగా ఇప్పుడు సర్జన్లకు రకరకాల లోహాలతో రూపొందించనవి.. రోగి ఎముక పరిమాణం ఎంతుందో అంతే సైజ్‌లో ఉన్నవీ లభ్యమవుతున్నాయి. వయసు పెరుగుతున్న కొద్దీ లోహపు ఎముకా పెరిగేలా వ్యాప్తిచెందే కృత్రిమ ఎముకలూ ఉన్నాయి. దీనితో పాటు రోగికి అవసరమైన ఆహారం (న్యూట్రిషన్), నొప్పి తగ్గించడం (పెయిన్ మేనేజ్‌మెంట్), కదలికలను మునుపటిలా చేసే స్వాభావిక చికిత్స (నేచురోపతి మెడిసిన్), ఫిజియోథెరపీ వంటివాటిల్లో డాక్టర్ తగిన సూచనలూ అందిస్తారు.





పొడుపు కథ

వచ్చేది తూర్పు,
వెళ్ళేది పశ్చిమం,
అతడు ఉంటే ప్రాణికోటికి ఉత్తేజం,
ఎవరతడు?

జవాబు : సూర్యుడు

జోక్ :

తండ్రి : ఏంట్రా చింటూ! అలా కుర్చీలో కూర్చోని తాళ్ళతో కట్టేసు కుంటున్నావు?

చింటు : అక్క..ఇందాకటి నుంచీ భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుందని అంటోంది నాన్నా! అందుకే పడిపోకుండా ఉండటానికి..

నీడను కనుక్కోండి!

పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని ఇళ్లు, వాటి నీడలు ఉన్నాయి. ఏ నీడ దేనిదో కనుక్కోండి!





సముద్రంలో..ఛాలెంజర్ డీప్



పిల్లలూ! మన భూగోళంపైన పర్వతాలు, మైదానాలు, పీఠభూముల్లాంటి భూస్వరూపాలు ఎన్నో ఉన్నాయన్న సంగతి మీరు వినే ఉంటారు. అయితే ఇలాంటి వేరువేరు భౌగోళిక స్వరూపాలు నేలపైనే కాకుండా, నీటి లోపలా చాలా ఉన్నాయి. మహాసముద్రాల్లో కొండలు, కోనలు, పర్వతశ్రేణులు, మైదానాలు వంటి వివిధ భూస్వరూపాలు నిక్షిప్తమై ఉన్నాయి.

ఫసిఫిక్ మహాసముద్రంలోని పల్లపు ప్రాంతాలలో ఒకటైన 'మురియానా ట్రెంచ్' చాలా లోతైనది. ఈ మహాసముద్రం పశ్చిమభాగంలో మెరియానా దీవులకు తూర్పుదిక్కున మరొక విశాలమైన పల్లపు ప్రాంతం ఉంది. అది కేవలం పదులసంఖ్యలో పొడవు, వెడల్పు ఉంటుందని అనుకుంటున్నారా? అయితే పిల్లలూ మీరు తప్పులో కాలేసినట్టే! అది ఎంత విశాలంగా ఉంటుందంటే పొడవు 1554 మైళ్లు, వెడల్పు 44 మైళ్ళు. ఈ పల్లపు ప్రాంతం నైరుతీదిశ అగ్రభాగంలో ప్రపంచపు అతిలోతైన ప్రదేశం ఉంది. దీనినే 'ఛాలెంజర్ డీప్' అంటారు. ఇదే మన భూగోళపు అతి లోతైన ప్రదేశం. ఇది సముద్ర ఉపరితలం నుంచి సుమారు ఏడుమైళ్ల లోతులో ఉంటుంది. అయితే పిల్లలూ ఈ ఛాలెంజర్ డీప్ గురించి తెలుసుకున్న విషయాలు చాలా తక్కువేననీ, ఇంకా తెలియాల్సింది చాలా ఉందనీ పరిశోధకులు చెబుతున్నారు. ★





నేను గీసిన చిత్రం



ఎస్‌కె. షోహెల్,
ఐదవ తరగతి, పి.దోర్నాల ప్రకాశంజిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

విజయ్ హజారే ట్రోఫీ క్వార్టర్స్‌లో ఆంధ్ర, ముంబాయి

చెన్నై : విజయ్ హజారే ట్రోఫీ క్వార్టర్‌ఫైనల్స్‌కు గ్రూప్-సి నుండి ఆంధ్రప్రదేశ్, ముంబాయి జట్లు ప్రవేశించాయి. సోమవారం ఆంధ్రజట్టు గుజరాత్‌పై 9 వికెట్ల తేడాతోనూ.. ముంబాయి జట్టు గోవాపై 4 వికెట్ల తేడాతో విజయాలను నమోదు చేసుకొన్నాయి. దీంతో ఈ రెండుజట్లు గ్రూప్-సిలో తొలి రెండు స్థానాల్లో నిలిచి క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. సోమవారం గుజరాత్‌తో తలపడి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌట్ అయ్యింది. గుజరాత్ సారథి పార్థీవ్ పటేల్ 39 పరుగులు చేయగా... రజుల్ భట్ (74), పియూష్ చావ్లా (56)తో జట్టును ఆదుకున్నారు. ఆంధ్ర బౌలర్ కార్తీక్ రామన్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 251 పరుగుల లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు కేవలం ఒక వికెట్ నష్టపోయి 45.2 ఓవర్లలో ఛేదించింది. ఓపెనర్ శిఖర్ భరత్ అజేయంగా 106 పరుగులు చేయగా... మరో ఓపెనర్ అశ్విన్ హెబ్బర్ 99 పరుగులు చేసి దేశాయ్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. వీరిద్దరి జోడీ తొలి వికెట్‌కు 36.4 ఓవర్లలో 192 పరుగులు భాగస్వామ్యం నిర్మించింది. ముంబాయి తరపున ఆడిన అండర్-19 కెప్టెన్ పృథ్వీ షా 53 పరుగులతో ఆకట్టుకున్నాడు.

చరిత్ర సృష్టించేందుకు ఒక్క గెలుపు...

- నేడు భారత్-దక్షిణాఫ్రికా ఐదో వన్డే
- సాయంత్రం 4.30 గం॥ల నుంచి



దక్షిణాఫ్రికా పర్యటనలో టీమిండియా చరిత్ర సృష్టించేందుకు ఒక్క విజయం దూరంలో నిలిచింది. ఆరు వన్డేల సిరీస్‌లో 3-1 ఆధిక్యతలో ఉన్నప్పటికీ మిగతా రెండు వన్డేల్లో ఒక్కటి గెలిస్తే చాలు. నాల్గో వన్డేలో అనవసర తప్పిదాలతో మ్యాచ్‌ను చేజార్చుకున్నప్పటికీ... రోహిత్‌శర్మ ఫామ్ టీమిండియాను కలవరపెడుతోంది. అతడు క్రీజ్‌లో నిలదొక్కుకుంటే భారీస్కోర్ సాధించడం ఖాయం... విరాట్ కోహ్లీ స్పిన్నర్లపై ఎక్కువగా ఆధారపడకుండా పేసర్లను కూడా సరైన సమయంలో ఉపయోగించుకుంటే విజయం తథ్యం...

పోర్ట్ ఎలిజబెత్: భారత్-దక్షిణాఫ్రికా జట్లమధ్య ఐదో వన్డే మంగళవారం జరగనుంది. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఆరు వన్డేల సిరీస్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న టీమిండియాకు వాండరర్స్‌లో జరిగిన నాలుగో వన్డేలో తొలి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ఆరు వన్డేల సిరీస్‌లో 3-1 ఆధిక్యతలో టీమిండియా నిలిచినప్పటికీ చరిత్ర సృష్టించేందుకు మరొక్క విజయం సాధించాల్సి ఉంది. నాల్గో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ భారీ స్కోర్ చేసినా... వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయిన అనంతరం అది సఫారీల విజయానికి దోహద పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సిరీస్‌లో ఆధిక్యంలో ఉన్న భారత్ పోర్ట్ ఎలిజబెత్ వేదికగా జరిగే ఐదో వన్డేలో కచ్చితంగా విజయం సాధించాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ ఐదో వన్డేలో ఓ విషయం టీమిండియాను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఐదో వన్డే జరిగే పోర్ట్ ఎలిజబెత్‌లో కూడా మంగళవారం వర్షం పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలియ జేసింది. ఒక వేళ భారీ వర్షం కురిసి మ్యాచ్ పూర్తిగా రద్దు అయిన పక్షంలో భారత్ సిరీస్ విజయం సాధించవచ్చు. టీమిండి యా 3-1 ఆధిక్య తలో ఉండడంతో సిరీస్ కైవసం చేసుకోవడం లాంఛ నమే కానుంది.

కలవరపెడుతున్న రోహిత్ ఫామ్...

టీమిండియాకు కలవరపెడుతున్న మరో అంశం రోహిత్‌శర్మ ఫామ్. అతడు ఇటీవల శ్రీలంకజట్టుపై డబుల్ సెంచరీ సాధించిన అనంతరం ఒక్కసారిగా ఫామ్ కోల్పోయాడు. సఫారీ జట్టుపై నాలుగు ఇన్నింగ్స్‌లో అతడు చేసింది 40 పరుగులు మాత్రమే. లంకపై డబుల్ సెంచరీ అనంతరం... 10, 11, 10, 47, 20, 15, 0, 5.. అతడు చేసిన చివరి ఎనిమిది ఇన్నింగ్స్ పరుగులివి. ఒంటిచేత్తో మ్యాచ్‌ను శాసించగల సత్తా ఉన్న క్రీడాకారుల్లో రోహిత్ ముందుంటాడు.



మార్క్రమ్ (కెప్టెన్)

భారతజట్టు (అంచనా) : రోహిత్‌శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లీ (కెప్టెన్), అజింక్యా రహానే, శ్రేయస్ అయ్యర్/కేదర్ జాదవ్, ఎం.ఎస్. ధోనీ (కీపర్), హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్, యజ్ఞేంద్ర చాహల్, బుమ్రా.

దక్షిణాఫ్రికాజట్టు (అంచనా) : హషీమ్ ఆమ్లా, మార్క్రమ్ (కెప్టెన్), డుమిని, డివిలియర్స్, డేవిడ్ మిల్లర్, క్లేశన్ (కీపర్), క్రిస్ మోరిస్, ఫెల్యూక్వాయో, రబాడ, మోర్కెల్, ఎంగిడి/తాహీర్.

స.హ. చట్టం పరిధిలో బిసిసిఐ ?

న్యూఢిల్లీ : సమాచార హక్కు చట్టం పరిధిలోకి భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ)ను తీసుకుని రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. న్యాయ కమిషన్ ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రపంచంలో అత్యంత ధనిక క్రికెట్ బోర్డుగా పేరుగాంచిన బిసిసిఐ ప్రస్తుతం ఒక ప్రైవేటు సంస్థగా ఉంది. సమాచార హక్కు పరిధిలోకి రావాలంటే బిసిసిఐ ముందుగా ప్రభుత్వ సంస్థగా మారాల్సివుంటుంది. లేదా ప్రత్యామాన్యంగా ప్రైవేట్ సంస్థగానే ఉంటూ సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రశ్నలకు సమాధానం ఇస్తామని బిసిసిఐ అంగీకరించాల్సి వుంటుంది. బిసిసిఐను సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకుని వచ్చే విషయంపై నివేదికను సిద్ధం చేశామని న్యాయ కమిషన్ చైర్మన్ జస్టిస్ బిఎస్ చౌహన్ విలేకరులకు తెలిపారు. ఈ నివేదికను త్వరలోనే కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు సమర్పిస్తామని వెల్లడించారు. రాజ్యాంగంలోని అర్టికల్ 12 ప్రకారం బిసిసిఐను స.హ. చట్టం పరిధిలోకి వస్తుందని ఆయన తెలిపారు. బిసిసిఐ నిర్ణయాలు రాజ్యాంగ పరిశీలనకు లోబడి ఉంటాయని, బిసిసిఐ నిర్ణయాలను ప్రశ్నించే అవకాశం వుందని జస్టిస్ బిఎస్ చౌహాన్ తెలిపారు. అనేక సంవత్సరాలుగా బిసిసిఐ ప్రభుత్వాల నుంచి గణనీయమైన ఆర్థిక సహాయం పొందుతుందని తెలిపారు. అలాగే ప్రభుత్వాల నుంచి పన్ను మినహాయింపులను, భూ కేటాయింపులను బిసిసిఐ పొందుతుందని ఆయన వివరించారు.

2016 జులైలో ఇచ్చిన తీర్పులో బిసిసిఐను సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకుని వచ్చే విషయంపై న్యాయ కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

నాగర్‌కోటికి రాజస్థాన్ ప్రభుత్వం నజరానా



జైపూర్: ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ గెలుచుకున్న భారత యువజట్టు సభ్యుడైన నాగర్‌కోటికి రాజస్థాన్ ప్రభుత్వం రూ.25లక్షల నజరానా ప్రకటించింది. సోమవారం రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధర రాజే బడ్జెట్ ప్రసంగంలో నాగర్‌కోటికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రూ.25లక్షల నజరానా అందజేస్తున్నట్లు ప్రకటించారు.



ఫిగర్ స్కేటింగ్‌లో కెనడాకు స్వర్ణం

వింటర్ ఒలింపిక్స్‌లో సోమవారం జరిగిన ఫిగర్ స్కేటింగ్ (ఐస్ డాన్స్ ఫ్రీ డ్యాన్స్) టీమ్ విభాగంలో కెనడాకు బంగారు, ఒలింపిక్ అథ్లెట్ రష్యాకు రజిత, అమెరికాకు కాంస్యం పతకాలు దక్కాయి.

భారత స్విమ్మర్ రికార్డు

న్యూఢిల్లీ: పుణెకు చెందిన లాంగ్ డిస్టెన్స్ స్విమ్మర్ రోహన్ మోరె.. సముద్రపు ఈతలో కొత్త రికార్డును నెలకొల్పాడు. న్యూజిలాండ్‌లోని నార్త్, సౌత్ ద్వీపాలను కలుపుతూ వెళ్లే కుక్ స్ట్రేట్‌ను అతను 8 గంటలా 37 నిమిషాల్లో ఈదాడు. దీంతో ఈ పోటీని పూర్తి చేసిన అతి తక్కువ వయసు గల తొలి ఆసియన్‌గా రికార్డులకెక్కాడు. వాతావరణం అనుకూలించకపోవడంతో చాలా రోజులు వేచి చూసిన మోరె ఈనెల 9న ఎట్టకేలకు ఈతకు పూనుకున్నాడు. ఉష్ో?గ్రత 19 డిగ్రీల సెల్సియస్ ఉండటంతో తొలి ఐదు గంటలు ఈత సాఫీగా సాగింది. కానీ అంటార్కిటికా నుంచి వచ్చే ప్రవాహలతో ఉష్ో?గ్రత ఒక్కసారిగా 4 డిగ్రీలకు పడిపోయింది. దీంతో విపరీతమైన చలిలో వణుకుతూనే మిగతా పోటీని పూర్తి చేశాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ పోటీని పూర్తి చేసిన తొమ్మిదో వ్యక్తిగా మోరె రికార్డు స ష్టించాడు. 11 ఏండ్ల వయసులోనే మోరె తన తొలి మారథాన్ స్విమ్‌ను పూర్తి చేయడం గమనార్హం.

అట్టహాసంగా జాతీయ లాన్‌టెన్నిస్ పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ కెఇ.ప్రభాకర్, టిజి భరత్, కమిషనర్ సిబి హరినాథ్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

కర్నూలు క్లబ్‌లో ఆలిండియా లాన్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలు సోమవారం ఘనంగా ప్రారం భమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కెఇ.ప్రభాకర్, వ్యాపారవేత్త టిజి భరత్, మున్సిపల్ కమిషనర్ డా.సిబి హరినాథరెడ్డిలు హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కెఇ.ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలో ప్రతిరోజూ సాధన చేసి మెలకువలు నేర్చుకొని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. రాజకీయ నాయకులకు, సినీ హీరోలకు లేనంతగా క్రీడాకారులకు ప్రపంచ గుర్తింపు లభిస్తుందన్నారు. టిజి భరత్ మాట్లాడుతూ కర్నూలును క్రీడల నగరంగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపొటములకు అతీతంగా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. పోటీల నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీలు అండర్-14, 18 బాలబాలికల విభాగంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ర్యాంకర్లయిన 128 మంది ఐటా ర్యాంకర్స్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

జిపిఎస్‌తో భూగర్భ ప్రకంపనల విశ్లేషణ

- వర్క్‌షాప్‌లో ఎఎన్‌యు హెచ్‌ఒడి రత్నాకర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భూగర్భ ప్రకంపనల తీవ్రత, సంభవించే సమయం, ప్రదేశాల్ని మరింత శాస్త్రీయంగా విశ్లేషించేందుకు జిపిఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ భూగర్భశాస్త్ర విభాగం హెచ్‌ఒడి రత్నాకర్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ కార్యాలయంలో భూకంపాల విశ్లేషణపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ భూకంప తీవ్రతను తెలుసుకునేందుకు గతంలో రిక్టర్ స్కేల్‌ను ఉపయోగించేవారని, ప్రస్తుతం భూకంప తీవ్రత పరిణామం, సంభవించిన సమయం, ప్రాంతం మొదలైన విషయాల్ని సిస్మోగ్రాఫ్ ద్వారా సమగ్రంగా తెలుసుకోగలుగుతున్నామని చెప్పారు. పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ భూకంపాల్ని ముందుగానే అంచనా వేసే పరిజ్ఞానం నేటికీ అందుబాటులోకి రాలేదన్నారు. సిస్మోగ్రాఫ్ ద్వారా భూమిలోని పొరల కదలికల్ని అంచనా వేయగలుగుతామని, తద్వారా నష్టాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోగలుగుతున్నామని అన్నారు. ఏడు జిల్లాల్లో జిపిఎస్ రిసీవర్లను అమర్చడం ద్వారా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామన్నారు.

ఎఒబిలో ఎదురు కాల్పులు

తప్పించుకున్న మావోయిస్టులు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు (విశాఖ)

ఆంధ్రా, ఒడిశా కటాఫ్ ఏరియాలో సోమవారం తెల్లవారుజామున మావోయిస్టులకు, ఆంధ్రా, ఒడిశా గ్రేహౌండ్స్ పోలీసు బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. అయితే ఎటువంటి ప్రాణనష్టం చోటుచేసుకోలేదు. ఈ కాల్పుల్లో మావోయిస్టులు తప్పించుకోగా 70కి పైగా కిట్ బ్యాగులు, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్, జోడం పంచాయతీ పంపర్లమెట్ట పోలీస్ స్టేషన్ పరిధి, జగన్నాథ్‌గుడ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వారం రోజులుగా ఆంధ్రా, ఒడిశాకు చెందిన గ్రేహౌండ్స్ పోలీసు బలగాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. జగన్నాథగుడ అటవీ ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేతల ఆధ్వర్యంలో భారీ ప్లీనరీ జరుగుతున్న సమాచారంతో పాటు ఆ సమావేశానికి మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరిగోపాల్ అలియాస్ ఆర్‌కె ఉన్నట్టు పక్కా సమాచారంతో ఆ దిశగా పోలీసు బలగాలు కూంబింగ్‌ను ముమ్మరం చేశాయి. పోలీసు రాకను ముందుగానే మావోయిస్టులు పసిగట్టి అక్కడి నుంచి తప్పించుకునేందుకు సోమవారం తెల్లవారుజామున ఆరుగంటల సమయంలో ప్రయత్నిస్తూ పోలీసులకు తారసపడ్డారు. దీంతో వారి మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టుల అగ్రనేత ఆర్‌కె ఉన్నట్టు సమాచారం. ఈ ఎదురుకాల్పుల్లో సుమారు 200 మందికిపైగా మావోయిస్టులు పాల్గొన్నట్టు తెలిసింది. వీరంతా గుమ్మ ఏరియా కమిటీకి చెందిన మావోయిస్టులుగా పోలీసులు భావిస్తున్నారు. కాల్పుల అనంతరం సంఘటనా స్థలంలో మావోయిస్టులకు చెందిన 70 కిట్ బ్యాగులు, విప్లవ సాహిత్య పుస్తకాలు, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం మరిన్ని బలగాలతో కటాఫ్ ఏరియాలో వేట కొనసాగిస్తున్నారు.

ప్రత్యేక హోదాపై పోరు ఉధృతం



- మార్చి 5న ఢిల్లీలో ధర్నా
- పార్టీ సీనియర్ నేతలతో జగన్ సమావేశం

ప్రజాశక్తి- కలిగిరి: ప్రత్యేక హోదాపై ఉధృత పోరాటం నిర్వహించాలని వైసిపి అధినేత వైఎస్ జగన్ నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ ఎంపీలు, సీనియర్ నేతలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కలిగిరి మండలం, పెద్దకొండూరు వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ముఖ్య నేతలతో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా - ఆంధ్రుల హక్కు అన్ని, దీన్ని సాధించుకునేందుకు ఉధృత పోరాటాలు నిర్వహించాలని నాయకులకు పిలుపునిచ్చారు. మార్చి 1న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించాలన్నారు. మార్చి 5న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసి ధర్నా నిర్వహించాలని తీర్మానించారు. మార్చి 3న ఢిల్లీ వెళ్లే ప్రజా ప్రతినిధుల వాహనాలకు జగన్ జెండా ఊపి ప్రారంభించాలని నిర్ణయించారు. ప్యాకేజీ వద్దు- హోదానే ముద్దు అని నినాదంతో ప్రజలలో ప్రచారం నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిసింది. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి సంబంధించి ప్రజలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని, టిడిపి అనుసరిస్తున్న ద్వంద వైఖరిని ఎండగట్టాలని పార్టీ ముఖ్య నేతలతో చర్చించినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన రాష్ట్ర బంద్ విజయవంతమైందని, దీన్ని బట్టి ప్రజలు ప్రత్యేక హోదా కోసం ఎదురుచూస్తున్నట్లు అర్థమైందని ఆయన నేతలతో అన్నట్లు సమాచారం.

ఈ సమావేశంలో ఎంపిలు విజయసాయిరెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, తిరుపతి ఎంపి వరప్రసాద్, నేతలు భూమన కరుణాకరరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాను ప్రసాదరావు, మేకపాటి గౌతంరెడ్డి తదితర నేతలు ఉన్నారు.

రైతులను ఆదుకుంటా

సోమవారం ప్రజా సంకల్పయాత్ర యాత్ర శ్రీపొట్టిశ్రీరాములు జిల్లా కలిగిరి మండలం, అనంతపురం నుంచి ప్రారంభమైంది. అయ్యపురెడ్డిపాళెం, పెదకొండూరుకు పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే రైతుల సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. చదువుకునే విద్యార్థులకు రూ. 15వేలు ఇస్తామని, పొదుపు మహిళలకు నాలుగు విడతలుగా రుణ మాఫీ చేస్తామని పేర్కొన్నారు. వృద్ధాప్య ఫించన్లు రూ. వెయ్యి నుంచి రూ. రెండు వేల వరకూ పెంచనున్నట్లు తెలిపారు.

రాజధానిలో రక్షణ లేదంటూ..

సిఎంతో ఓ వ్యక్తి వాగ్వాదం



సిఎంతో వాగ్వాదానికి దిగిన వ్యక్తి (సర్కిల్లో)

ప్రజాశక్తి- తుళ్లూరు(గుంటూరు)

రాజధానిలో ప్రజలకు రక్షణ లేదని, తనను కొందరు అకారణంగా చితకబాదారని కృష్ణా జిల్లా జి.కొండూరుకు చెందిన రామాంజనేయులు సిఎం చంద్రబాబుతో వాగ్వాదానికి దిగాడు. 'జల సంరక్షణ' సభలో సిఎం చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో కలుగజేసుకున్న రామాంజనేయులు 'జలసంరక్షణ కాదు.. రాజధానిలో ప్రజలకు రక్షణ లేదు. 2017 జనవరిలో మందడంలో కొందరు తనను చితకబాదారు' అని పెద్దగా అన్నాడు. పార్కింగ్ కోసం మాదల సుబ్బయ్య కుమారుడు దాడి చేశారని ఆరోపించాడు. దీనికి స్పందించిన సిఎం చంద్రబాబు 'క్రమశిక్షణగా ఉండు.. నోరుందికదా అని ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడితే అవాస్తవం వాస్తవం కాదు. నువ్వు ప్రజాస్వామ్యబద్ధంగా నీ సమస్య చెప్పావు. దీనిపై ఎస్‌పి, కలెక్టర్‌కు చెప్పా.. వాళ్లు విచారిస్తారు' అని అన్నారు. అయినా రామాంజనేయులు మాట్లాడుతుండడంతో 'ఏయ్ తమ్ముడు.. విను.. వినవయ్యా.. నువ్వు తెలివైనవాడివైతే నేను నీకన్నా తెలివైనవాడిని. నువ్వు రోడ్డు మీద ఎక్కడ పడితే అక్కడ కారు పెట్టావనుకో ఎలా..' అంటూ మండిపడ్డారు. అయినా ఆ వ్యక్తి మాట్లాడుతుండంతో 'ఏయ్.. వింటావా.. లేదా? నీ సమస్య గురించి చెప్పు.. కొంచెం ఓపిక పట్టు.. నోరుందని పెద్దపెద్ద ఉపన్యాసాలు వద్దు' అని సిఎం కసురుకున్నారు.

ఆర్థికేతర ఫిర్యాదుల్ని త్వరగా పరిష్కరించండి

సిఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమి, ఇతర సందర్భాల్లో ప్రజల నుంచి వచ్చిన ఆర్థికేతర ఫిర్యాదులను త్వరితంగా పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గ్రీవియెన్స్ ఫిర్యాదుల పరిష్కారం, ముఖ్యమంత్రి హామీల అమలుపై సచివాలయంలో సోమవారం ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఆర్థిక పరమైన ఫిర్యాదులు, వినతులు ఇంకా ఎన్ని పరిష్కారించాల్సి ఉంది, వాటికి ఎంత మేర నిధులు అవసరం ఉందనే దానిపై ఆయా శాఖలు నివేదికల్ని సిద్ధం చేయాలన్నారు. వీటిని పరిశీలించేందుకు రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో ప్రత్యేకంగా అధికారిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆర్థికేతర ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించడంతో పాటు, ఆర్థికపరమైన వినతులను కూడా నిధుల లభ్యతను బట్టి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. 1400 వరకూ సిఎం హామీల్ని అమలు చేయాల్సి ఉందని, వాటిని శాఖల వారీగా విభజించి జాబితాను రూపొందించాలని సూచించారు.

చంద్రబాబు ప్రజల ముందుకు రావడంలేదు

వైసిపి అధికార ప్రతినిధి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రం అతలాకుతలమవుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు ప్రజల ముందుకు రావడం లేదని వైసిపి అధికార ప్రతినిధి జోగి రమేష్ ప్రశ్నించారు. గత 12 రోజులుగా ఆయన ఎక్కడా కనబడడంలేదని, ప్రజలు ఆయన కోసం వెతుకుతున్నారని పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెర వెనుకనుండి మీడియాకు లీకులిస్తున్నారని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినప్పటికీ, ఏదో సాధించినట్లు టిడిపి నేతలు సన్మానాలు చేయించుకుంటున్నారని, అసలు వారేం సాధించారని విమర్శించారు. వారి డ్రామాల్ని, సంబరాల్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు.

దళిత తేజం కాదు..ద్రోహం: మేరుగు నాగార్జున

దళితుల్ని అడుగడుగునా అవమానిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం దళిత తేజం పేరును దళిత ద్రోహంగా మార్చాలని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మేరుగు నాగార్జున అన్నారు.. టిడిపి అధికారంలోకొచ్చాక దళితులపై దాడులు పెరిగాయన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల్ని దారి మళ్లించడంతో దళిత కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు.

యుద్ధానికి మేమూ సిద్ధమే

సందేహాలుంటే చర్చకు రండి

బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ఎంపీలు యుద్ధమే చేయాలనుకుంటే తాము సిద్ధంగానే ఉన్నామని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యామ్‌కిషోర్ అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు వెల్లడించిన నిధుల వివరాలపై సందేహాలుంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం, బిజెపి ప్రజలకు జవాబుదారీగా ఉంటుందన్నారు. గత వారం రోజులుగా మిత్రపక్షమైన టిడిపి ఎంపీలు పార్లమెంట్‌లోనూ, బయటా చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. వైసిపితో బిజెపి కలిసే ప్రయత్నం చేస్తోందనడాన్ని తప్పుబట్టారు. వైసిపి మద్దతు ఇచ్చిన బంద్‌లో టిడిపి ఎలా పాల్గొందని ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధిపై బిజెపికి స్పష్టమైన విధానం ఉందన్నారు. విభజనకు అనుకూలంగా టిడిపి గతంలో లేఖ రాసిందని, ఈ విషయాన్ని ప్రజల ముందు చెప్పలేకపోయారన్నారు. పోలవరానికి నాబార్డు రుణం నేరుగా లభిస్తుందని, దాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించాల్సిన అవసరం లేదన్నారు. రాజధాని నిర్మాణానికి సంబంధించి ఇంత వరకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం డిపిఆర్ అందజేయలేదన్నారు. పార్టీ రాష్ట్రాభివృద్ధి కమిటీ కన్వీనర్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, పార్టీ కార్యవర్గ సభ్యులు సక్కుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68